
www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
PRAJAPAKSHAM ★★★




రేవంత్ ఓటమికి పికె వ్యూహం ఫలించేనా? 06
ప్రపంచ అస్థిరతమధ్య భారత్ – బ్రిటన్ భాగస్వామ్యం కీలకం
ఏఐని దుర్వినియోగం చేయొద్దు 05

సంపుటి 08, సంచిక: 309 | శుక్రవారం | 10-10-2025 | కరీంనగర్ Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar పేజీలు: 12+8 | వెల రూ. 5.00




# స్థానిక ఎన్నికల నోటిఫికేషన్‌పై స్టే

**బిసి కోటాపై మధ్యంతర ఉత్తర్వులు**

- విచారణ ఆరు వారాలకు వాయిదా
- నాలుగు వారాల్లోగా కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం
- అభ్యంతరాల దాఖలు కోసం పిటిషనర్లకు రెండువారాల గడువు
- బిసి రిజర్వేషన్లపై హైకోర్టులో రెండురోజులపాటు సుదీర్ఘంగా కొనసాగిన వాదనలు
- హైకోర్టు స్టేతో ఆరువారాల పాటు నిలిచిపోయిన స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ

ప్రజాపక్షం/హైదరాబాద్

స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 9కి అనుగుణంగా రాష్ట్ర ఎన్నికల సంఘం జారీ చేసిన ఎన్నికల నోటిఫికేషన్ అమలును నిలిపివేస్తూ హైకోర్టు స్టే ఉత్తర్వులను జారీ చేసింది. స్టే ఉత్తర్వుల నేపథ్యంలో రాష్ట్రంలో స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించే ప్రక్రియ నిలిపివేయాలని ఆదేశించింది. బిసి రిజర్వేషన్ల పెంపు రాజ్యాంగ వ్యతిరేకమని, రాష్ట్ర ప్రభుత్వం చట్ట వ్యతిరేకంగా రిజర్వేషన్ల పెంపు నిర్ణయం తీసుకుందంటూ దాఖలైన పలు వ్యాజ్యాల్లో ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. సామాజిక కార్యకర్త బుట్టెంగారి మాధవ రెడ్డి, పెద్దపల్లి జిల్లా మహాముత్తారం మండలం కమ్మపల్లి గ్రామానికి చెందిన సముద్రాల రమేష్, సిద్ధిపేట జిల్లా కొండూరుకు చెందిన జల్లపల్లి మల్లవ్వ, నల్లగొండ జిల్లా చింతపల్లికి చెందిన గోరటి వెంకటేష్ ఇతరులు వేర్వేరుగా దాఖలు చేసిన పిటిషన్లల్లో ప్రతివాదులైన బిసి సంక్షేమ, పంచాయతీరాజ్, సాధారణ పరిపాలన, న్యాయ శాఖల ముఖ్య కార్యదర్శులకు, రాష్ట్ర ఎన్నికల సంఘానికి నోటీసులు జారీ చేసింది. పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశించింది. నాలుగు వారాల్లోగా తమ వాదనలతో కౌంటర్లు దాఖలు చేయాలని ప్రతివాదులను ఆదేశించింది. ప్రభుత్వం వేసే కౌంటర్లల్లోని అంశాలపై అభ్యంతరాలు ఉంటే పిటిషనర్లు రిప్లై కౌంటర్లను రెండు వారాల్లోగా దాఖలు చేయాలనీ ఉత్తర్వులు జారీ చేసింది. విచారణను ఆరు వారాలకు వాయిదా వేసింది. ప్రధాన పిటిషన్లను విచారణకు అనుమతిచ్చింది. ఈ కేసుల్లో ఇంప్లీడ్ అయిన 30 పిటిషన్లను కూడా విచారణకు అనుమతిచ్చింది. ఎన్నికలను నిలిపివేస్తూ స్టే ఉత్తర్వుల జారీకి కారణాలను వివరిస్తూ పూర్తి వివరాలతో తర్వాత మధ్యంతర తీర్పును వెలువరిస్తామని ప్రకటించింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ జిఎం మొహియుద్దీన్‌లతో డివిజన్ బెంచ్ గురువారం మధ్యంతర ఉత్తర్వులను వెలువరించింది. బిసిలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లను కల్పిస్తూ జారీ చేసిన జీవో 9ను రద్దు చేయాలంటూ బుట్టెంగారి మాధవరెడ్డి, సముద్రాల రమేశ్, బిసి రిజర్వేషన్లను ఎబిసిడిలుగా వర్గీకరించాకే 42 శాతం రిజర్వేషన్ల అమలుతో ఎన్నికలు నిర్వహించేలా ఉత్తర్వులు జారీ చేయాలంటూ వికారాబాద్ జిల్లా ధరూర్ గ్రామానికి చెందిన మడివాల మచ్చదేవ రజకుల సంఘం ప్రధాన కార్యదర్శి ఎన్.లక్ష్మయ్య, హైదరాబాద్ బాగ్‌లింగంపల్లికి చెందిన న్యాయవాది శాంతప్ప, కులాలతో సంబంధం లేకుండా రైతులకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలంటూ రైతు సంఘాల సమాఖ్య ఇతరులు దాఖలు దాఖలు చేసిన పిటిషన్లు, ఇంప్లీడ్ పిటిషన్లు 30 వరకు దాఖలయ్యాయి. వీటన్నింటిపైన హైకోర్టు గురువారం సుమారు రెండు గంటలపాటు విచారణ జరిపిన అనంతరం మధ్యంతర స్టే ఉత్తర్వులను జారీ చేసింది.

**బిసి లెక్కలను శాస్త్రీయంగానే తేల్చాం–ఎజి**

తొలుత రాష్ట్ర ప్రభుత్వం తరపున అడ్వొకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ, బీసీ రిజర్వేషన్ల పెంపు వ్యవహారం ఆషామాషీగా చేయలేదని, ఏక సభ్య కమిషన్ శాస్త్రీయంగా ఇంటింటి సర్వే నిర్వహించాకే నివేదికను తరువాయి 5లో

## నోటిఫికేషన్ నిలుపుదల

స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్‌ను తక్షణమే నిలిపివేస్తున్నట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. జెడ్‌పిటిసి, ఎంపిటిసి, సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికకు సంబంధించి గత నెల 29న విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్‌పై గురువారం హైకోర్టు ఇచ్చిన మధ్యంతర స్టే నేపథ్యంలో నిలిపివేస్తున్నట్లు పేర్కొంది. దీంతో పాటు ఎన్నికల ప్రవర్తన నియమావళి, దాఖలు చేసిన నామినేషన్లు, అన్ని ఇతర ప్రక్రియలు కూడా తదుపరి ఆదేశాలు వచ్చేంత వరకు ఎన్నికల ప్రక్రియను నిలిపివేస్తున్నట్లు స్పష్టం చేసింది. కాగా, గురువారం మెదటి విడతగా జెడ్‌పిటిసి, ఎంపిటిలకు నోటిఫికేషన్ విడుదల కావడంతో పలువురు నామినేషన్లు దాఖలు చేశారు. వాటిని కూడా రద్దు ఎన్నికల సంఘం రద్దు చేసింది.



# గాజాలో 24 నెలల రక్తపాతానికి తెర

- తొలి దశ ఒప్పందాన్ని ధ్రువీకరించిన హమాస్,ఇజ్రాయెల్ గురువారం సాయంత్రం నుండి యుద్ధ విరమణ!
- ప్రజల ఆనందోత్సాహాలు

**షర్మ్–ఎల్–షేక్:** గాజాలో యుద్ధం ముగించేందుకు ట్రంప్ ప్రతిపాదించిన 20 అంశాల ప్రణాళికలో మొదటిదశను అమలు చేసేందుకు హమాస్–ఇజ్రాయెల్ అంగీకరించాయి. ఈ ఒప్పందం ప్రకారం 20 మంది సజీవ బందీలను హమాస్ అప్పగిస్తుంది, 250 మంది జీవిత ఖైదీలతోసహా మొత్తం 2000 మంది పాలస్తీనియన్లను జైళ్ళనుండి ఇజ్రాయెల్ విడుదల చేస్తుంది. ఇజ్రాయెల్ సైన్యం గాజా నుండి పాక్షికంగా వైదొలగుతుంది. గాజాలోకి బయట నుండి భారీగా మానవతా సహాయం, ఆహార సరఫరా ప్రారంభమవుతుంది. గాజాలో 24 నెలలుగా జరుగుతున్న దారుణ రక్తపాతానికి తెరపడుతుంది. మరుభూమిగా మారిన పాలస్తినాలో శాంతి పుష్పాలు వికసిస్తాయి. ప్రాథమిక సమాచారం ప్రకారం ఇజ్రాయెల్ ప్రధానమంత్రి నెతన్యాహూ ప్రభుత్వం జెరూసలెంలో గురువారం సాయంత్రం సమావేశంలో ఒప్పందాన్ని ఆమోదించగానే గాజాలో కాల్పుల మోత ఆగిపోతుంది. ఇజ్రాయెల్–పాలస్తినా మధ్య సత్వరం బందీలు–ఖైదీల పరస్పర మార్పిడి జరుగుతుంది. గాజాలో 734 రోజుల యుద్ధాన్ని ఇజ్రాయెల్ విరమించినట్లవుతుంది. ఈ పరిణామాలతో గాజాలో ప్రజలు ఆనందోత్సాహాల్లో మునిగితేలుతున్నారు. ఇజ్రాయెల్‌లో కూడా బందీల కుటుంబాలు, స్నేహితులు, సామాన్య ప్రజలు, యుద్ధ బాధితులు తమవారు తిరిగి వస్తారని సంతోషపడుతున్నారు. హమాస్ నాయకులు, ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజిమన్ నెతన్యాహూ వేరు వేరు ప్రకటనల ద్వారా తమ అంగీకారాన్ని ధృవీకరించారు. రాబోయే తరువాయి 2లో

## తీవ్ర నిరాశకు గురిచేసింది



- బిసిలకు పెంచిన రిజర్వేషన్ జాప్యానికి బిజెపి ప్రభుత్వానిదే బాధ్యత
- తమిళనాడు కేసులో సుప్రీంకోర్టు తీర్పు పరిశీలించాలి
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

ప్రజాపక్షం/హైదరాబాద్

బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌తో పాటు స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ హైకోర్టు స్టే ఇవ్వడం తీవ్ర నిరాశకు గురి చేసిందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు అన్నారు. బిసిలకు పెంచిన రిజర్వేషన్ జాప్యానికి పూర్తి బాధ్యత కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానిదేనని ఆయన పేర్కొన్నారు. శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించిన బిసిల 42 శాతం రిజర్వేషన్ బిల్లుతో పాటు రిజర్వేషన్ పెంచుతూ ప్రభుత్వం జారీ చేసిన ఆర్డినెన్స్ సైతం నెలలు తరబడి కేంద్రం వద్ద పెండింగ్ ఉన్నందునే స్థానిక సంస్థల ఎన్నికలపై హైకోర్టు స్టే విధించడానికి కారణమైందన్నారు. తక్షణమే శాసనసభ ఆమోదించిన స్థానిక సంస్థలు, ఉద్యోగ, విద్య రంగాలలో బిసిలకు 42 శాతం రిజర్వేషన్ కల్పన బిల్లులను ఆమోదిస్తే, ఎలాంటి ఆటంకాలు లేకుండా పెంచిన రిజర్వేషన్‌తో ఎన్నికలు యథావిధిగా నిర్వహించవచ్చని, ఇందుకు బిజెపి రాష్ట్ర నాయకులు ఇప్పటికైనా చొరవ చూపాలి అన్నారు. తొమ్మిదివ షెడ్యూలులో చేర్చేందుకు రాజ్యాంగ సవరణ అవసరమేతే తరువాయి 2లో

## బిజెపి, బిఆర్‌ఎస్ కలిసే అడ్డుకుంటున్నాయ్



- కోటా వచ్చేదాకా పోరాడుతాం
- టిపిసిసి మహేష్‌కుమార్ గౌడ్, డిప్యూటీ సిఎం భట్టి

"బిసి రిజర్వేషన్ బిల్లును బిజెపి, బిఆర్‌ఎస్ కలిసి అడ్డుకుంటున్నాయి. ఈ రెండు పార్టీల నేతల వైఖరి చూస్తే దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉంది. కుట్రలు, కుతంత్రాలు చేస్తుందెవరో అందరికీ తెలుసు. రిజర్వేషన్లకు పరిమితి పెట్టింది బిఆర్‌ఎస్, బిల్లు ఆపింది బిజెపి. ఈ పార్టీల నేతలను ఓబిసిలు ఎప్పటికీ క్షమించరు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు వచ్చేవరకు రాజకీయంగా, కోర్టులో పోరాడతాం" అని టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్‌కుమార్ గౌడ్, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. బిసి రిజర్వేషన్లపై మంత్రివర్గంలో, అసెంబ్లీలో తీర్మానం చేశామని, ఆ రోజు బిల్లును అన్ని రాజకీయ పార్టీలు ఏకగ్రీవంగా ఆమోదించాయన్నారు. గవర్నర్ ఆ బిల్లును రాష్ట్రపతికి పంపారని, అక్కడ పెండింగ్‌లో ఉందని, ఆ బిల్లును ఆపిందెవరో కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం చెప్పాలని వారు డిమాండ్ చేశారు. బిసి రిజర్వేషన్లపై ఎవరికి తరువాయి 2లో

## ప్రభుత్వ నిర్లక్ష్య ఫలితమే

**బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు**



కోర్టు స్టేకు ప్రభుత్వానిదే బాధ్యత, తమపై అభాండాలు వద్దు హైకోర్టు స్టే విధించేందుకు కాంగ్రెస్ పార్టీనే కారణం అని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు అన్నారు. హైదరాబాద్ నాంపల్లిలోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో తరువాయి 2లో

## కేంద్ర సర్కార్ వల్లే

**సిపిఐ(ఎం) రాష్ట్ర కమిటీ విమర్శ**

రాష్ట్రంలో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు, స్థానిక సంస్థల ఎన్నికలపై హైకోర్టు స్టే విధించడానికి ప్రధాన కారణం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వమేనని సిపిఐ(ఎం) రాష్ట్ర కమిటీ విమర్శించింది. ఇప్పటికైనా రాష్ట్రం నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న బిజెపి ఎంపీలు, మంత్రులు నైతిక బాధ్యత వహించి, వారి పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేసింది. సామాజిక న్యాయం కోరే తరువాయి 2లో

## 'శ్రమ్ శక్తి నీతి – 2025' ముసాయిదాను తిరస్కరిస్తున్నాం

**ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి అమర్‌జీత్ కౌర్ ప్రకటన**



న్యూఢిల్లీ : 'శ్రమ్ శక్తి నీతి – 2025' పేరుతో విడుదలైన ముసాయిదా కార్మిక విధానాన్ని ఎఐటియుసి తిరస్కరిస్తున్నట్లు ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి అమర్‌జీత్ కౌర్ ప్రకటించారు. తక్షణమే ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ (ఐఎల్‌ఒ)ను సమావేశపరచాలని ఆమె ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బిజెపి ప్రభుత్వం ఏకపక్షంగా, నియంతృత్వంగా బుధవారం నాడు ఈ ముసాయిదాను విడుదల చేసినట్లు ఆమె తెలిపారు. ఇది సాధారణంగా అమలయ్యే త్రైపాక్షిక ప్రక్రియకు పూర్తిగా విరుద్ధమని ఆమె విమర్శించారు. అలాగే, తీవ్రమైన ఆందోళన కలిగించే, ప్రజాస్వామ్య వ్యతిరేకమైన ఈ చర్య, కార్మికులను, కార్మిక సంఘాలను దిగ్భ్రాంతికి గురి చేయడంతో పాటు, నమ్మక ద్రోహం చేసిందనే భావనలోకి నెట్టిందన్నారు.. ముసాయిదాను తక్షణమే ఉపసంహరించుకోవాలని, ప్రజాభిప్రాయం స్వీకరణకు ముందే కేంద్ర కార్మిక సంఘాలతో చర్చలు ప్రారంభించాలని కార్మిక,ఉపాధి కల్పన మంత్రిత్వ శాఖను డిమాండ్ చేశారు. కార్మిక విధానం అంటే తరువాయి 2లో



## ప్రతి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం

**20 రోజుల్లోనే చట్టం తీసుకువచ్చి 20 నెలల్లో అమలయ్యేలా చూస్తాం**

**ఆర్‌జెడి నేత తేజస్వీ యాదవ్ హామీ**

**పాట్నా :** బిహార్‌లో అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నేపథ్యంలో పలు పార్టీలు తమతమ ప్రచారాన్ని ముమ్మరం చేశాయి. ఓటర్లను ఆకర్షించేందుకు తీవ్ర కసరత్తు చేస్తున్నాయి. పలు రకాల కొత్త పథకాలను ప్రకటిస్తున్నాయి. ఆర్‌జెడి నేత తేజస్వీయాదవ్ భారీ ఎన్నికల వాగ్దానే చేశారు. రాష్ట్రంలో ఆర్‌జెడి నేతృత్వంలోని ఇండియా కూటమి అధికారంలోకి వస్తే రాష్ట్రంలోని ప్రతి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఉండేలా చట్టం తీసుకువస్తామని హామీ ఇచ్చారు. గురువారం పాట్నాలో జరిగిన విలేకరుల సమావేశంలో ఈ మేరకు ప్రకటన చేశారు. ప్రతిపాదిత చట్టాన్ని కొత్త ప్రభుత్వం ఏర్పడిన 20 రోజుల్లోపు తీసుకువస్తామని తరువాయి 2లో

## రాజ్యాంగ సవరణతోనే సాధ్యం

**బిఆర్‌ఎస్**



జిఒల ద్వారా బిసి రిజర్వేషన్లు సాధ్యం కాదని, రాజ్యాంగ సవరణ వల్లనే ఫలితం ఉంటుందని తాము మొదటి నుంచి చెబుతున్నామని బిఆర్‌ఎస్ మాజీ మంత్రులు గంగుల కమలాకర్, వి.శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. చట్టం ప్రక్రియ పూర్తి కాకముందే జిఒను ఎలా ఇస్తారని ప్రశ్నించారు. హైదరా బాద్‌లోని తెలంగాణ భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎంపి వద్ది రాజు చవిచంద్ర, తరువాయి 2లో



## సాహిత్యంలో హంగేరీ రచయిత క్రిస్నాహోర్కైకు నోబెల్ బహుమతి

స్టాక్‌హోం: హంగేరీ దేశ రచయిత లాజ్లో క్రిస్నాహోర్కై (71) కు నోబెల్–2025 సాహిత్య పురస్కారం లభించింది. శాస్త్రీయ,తాత్విక,హాస్య,భయానక,నిర్వేద, కరుణారసాలతో కూడిన నవలలు రాసినందుకుగాను ఈ సాహిత్య పురస్కారం లభించింది. ఈ విభిన్న భావోద్వేగాలను తరచుగా ఏకవాక్యాలలో తన నవలల్లో ఆయన ప్రతిబింబిస్తారు. అలౌకిక బీభత్స ఉద్వేగాల నడుమ శక్తిమంతమైన సాహిత్యకళను ప్రదర్శించే ఆయన దార్శనిక కృషికి ఈ పురస్కారాన్ని ప్రకటించినట్లు స్వీడిష్ అకాడమీ నోబెల్ కమిటీ ప్రకటించింది. చారిత్రక, రాజకీయ తరువాయి 2లో

## మద్దతు ధరకే మొక్కజొన్నలు కొనుగోలు

**మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడి**




ప్రజాపక్షం/హైదరాబాద్

మొక్కజొన్న పంటను మద్దతు ధరకు సేకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఇందుకు సంబంధించి గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితోమంత్రి తుమ్మల నాగేశ్వరరావు భేటీ అయ్యారు. మొక్కజొన్న పంటకు కేంద్రం మద్దతు ధర ప్రకటించినప్పటికి ఇప్పటివరకు కొనుగోళ్లకు ముందుకు రాకపోవడంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచనతో రాష్ట్ర ప్రభుత్వమే మార్క్ ఫెడ్ ద్వారా మొక్కజొన్న పంటను కొనుగోలు చేయాలని నిర్ణయించిందన్నారు. గత ఏడాది కూడా కేంద్రం కేవలం మద్దతు ప్రకటనకే పరిమితమై, ఎలాంటి కొనుగోళ్లు చేపట్టలేదని, దీంతో రాష్ట్ర ప్రభుత్వమే దాదాపు రూ.535 కోట్లు ఖర్చు పెట్టి రాష్ట్రంలో పండిన తరువాయి 2లో

## భారత్ – అమెరికా ఆర్థికవృద్ధికి దోహదపడేలా విధానాలు

- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆకాంక్ష
- పెంచిన సుంకాలు, హెచ్–1బి వీసాల కఠిన నిబంధనలపై ఆందోళన
- రాష్ట్రానికి వచ్చిన అమెరికా ప్రతినిధుల బృందంతో అభిప్రాయాలు పంచుకున్న సిఎం



ప్రజాపక్షం/హైదరాబాద్

అమెరికా నిర్ణయాలు, అనుసరించే విధానాలన్నీ సానుకూల దృక్పథంతో అమెరికా, భారత్ మధ్య సంబంధాలను మరింత పెంపొందించే విధంగా ఉండాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. ఇటీవల అమెరికా పెంచిన సుంకాలు, హెచ్ 1 బి వీసాలపై విధించిన కఠిన నిబంధనలపై ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి నిర్ణయాలు ఆర్థిక వ్యవస్థను ప్రభావం చేయడంతో పాటు అస్థిరతకు, అపార్థానికి దారి తీస్తాయన్నారు. రెండు దేశాల మధ్య ఆర్థిక వృద్ధికి దోహదపడే విధానాలు తరువాయి 2లో



# ప్రపంచం
WORLD NEWS

## ఫ్రెంచ్ తెరమీదకు నేడు ఆరో ప్రధాని రాక

**పారిస్:**ఫ్రాన్స్‌లో రాజకీయ సంక్షోభం చల్లారలేదు. సమస్యకు పరిష్కారం సాధించలేకపోయిన ఆ దేశాధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ కొత్త ప్రధాన మంత్రి నియామకానికి సన్నాహాలు చేస్తున్నారు.శుక్రవారంనాడు కొత్త ప్రధాన మంత్రిని మేక్రాన్ ప్రకటిస్తారు. ఆయన హయాంలో ఇప్పటివరకూ ఐదు గురు ప్రధానమంత్రులు వచ్చారు, వెళ్ళారు. ఆరో ప్రధానమంత్రి రంగ ప్రవేశం చేయబోతున్నారు. రెండోసారి అధికారంలోకి వచ్చాక మేక్రాన్ పాలన దిగజారింది. ప్రజలలో ఆయన రేటింగ్ పడిపోయింది. అసంతృప్తి ప్రబలింది. ప్రధానమంత్రి పదవికి రాజీనామా చేసిన లెకార్న్యును తుది విడత ప్రయత్నాలు చేయమని మేక్రాన్ ఒక అవకాశం ఇచ్చారు. కానీ ఈ విడత ప్రయత్నం కూడా విఫలమైంది. ప్రభుత్వంలో ప్రధానపాత్ర పోషిస్తున్న వామ పక్షాలను ఉద్దేశపూర్వకంగా విస్మరించేందుకు యత్నించడంవల్లనే మేక్రా న్‌కు, దేశానికి ఇన్ని కష్టాలు వస్తున్నాయని లెఫ్ట్ వింగ్ విమర్శలు కొనసాగి స్తోంది. ప్రజల ఆర్థిక బాధలు విపరీతంగా పెరిగిపోవడంతో సర్వత్రా తీవ్ర అసంతృప్తి నెలకొని ఉంది. ఈ పరిస్థితుల్లో జనరంజకమైన బడ్జెట్‌ను తీర్చి దిద్ది, ప్రజలకు మేలు చేసే సంక్షేమ విధానాలతో కూడిన ఆర్థిక ప్రణాళిక రూపొందించడం సవాలుగా మారింది.

# 24 నెలల రక్తపాతానికి తెర

(మొదటి పేజీ తరువాయి)

వచ్చే సోమ లేదా మంగళవారంలో 20 మంది సజీవులైన ఇజ్రాయెలీ బందీల విడుదల, 28 మంది నిర్జీవులైన ఇజ్రా యెలీ పౌరుల మృతదేహాలను స్వాధీనం చేస్తారు. కొంత మంది బందీల జాడ హమాస్‌కు కూడా తెలియలేదు. అందువల్ల ఇజ్రాయెల్, అమెరికా, ఖతార్, ఈజిప్టు, టర్కీల సారథ్యంలో ఒక ఉమ్మడి టాస్క్‌ఫోర్స్, జాడ తెలి యని బందీలకోసం అన్వేషణ చేస్తుంది. ఇటీవల హమాస్ చేసిన ప్రకటన ప్రకారం వారివద్ద గాజాసిటీలో ఉన్న ఇద్దరు బందీల జాడ తెలియలేదు. హమాస్–ఇజ్రాయెల్ ప్రతినిధులు మొదటి దశ శాంతి ఒప్పందం అమలును ధృవీకరించడంతో భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ, యూరోపియన్ యూనియన్, ఆఫ్రికా నాయకులు సహా ప్రపంచదేశాలు హర్షాతిరేకాలు వ్యక్తం చేశాయి. ఇజ్రా యెల్ ప్రధానమంత్రి శక్తిమంతమైన నాయకత్వాన్ని మోదీ ప్రశంసించారు. గాజాలో శాంతిస్థాపన సాధించడంలో అమెరికా జోక్యం చేసుకుంటుందని అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. తన ప్రణాళికలో మొదటిదశను అమలు చేసేందుకు హమాస్–నెతన్యాహూ అంగీకరించా రన్నారు. ఒప్పందం ప్రకారం ఇజ్రాయెల్ సైన్యం అంగీ కృత రేఖ నుండి వెనక్కు తగ్గుతాయన్నారు. ఈజిప్టు కోస్తా తీర ప్రాంత నగరం షర్మ్–ఎల్–షేక్‌లో హమాస్, ఇజ్రా యెల్,అమెరికా ప్రతినిధుల సమక్షంలో గడచిన సోమ వారం ప్రారంభమైన మధ్యవర్తిత్వ చర్చలు (ఈజిప్టు–ఖ తార్)బుధవారం పొద్దుపోయేనాటికి ఫలవంతమయ్యా యి. ఇజ్రాయెల్ నుండి 2023 అక్టోబరు ఏడోతేదీన అప హరించిన బందీలలో ఇంకా సజీవులు,నిర్జీవులైన పౌరుల జాబితాను హమాస్ ప్రతినిధులు మధ్యవర్తుల ద్వారా ఇజ్రాయెల్‌కు అందజేశారు. అదేవిధంగా ఇజ్రాయెల్‌లో ఉన్న దాదాపు 11,100 మంది పాలస్తీనా ఖైదీలకు విముక్తి లభించాల్సి ఉంది. ఐతే ఎంతమంది ఖైదీలను తొలి దశలో ఇజ్రాయెల్ విడుదల చేస్తుందన్న విషయాన్ని నెతన్యాహూ ప్రభుత్వం ఖరారు చేస్తుంది. గాజాలో యుద్ధం విరమించి ట్రంప్ ప్రణాళికలో మొదటిదశ అమ లుకు అంగీకరించిన ఇజ్రాయెల్ ప్రభుత్వం గురువారం జెరూసలెంలో సమావేశమై ఈ ఒప్పందాన్ని ఆమోదిం చింది. ఈ ఆమోదముద్ర పడగానే గాజాలో కాల్పుల శబ్దాలు నిలిచిపోయాయి. శాంతి ఒప్పందం అమలులోకి వచ్చిందని నెతన్యాహూ కార్యాలయం ప్రకటించింది.

### భావోద్వేగంతో ట్రంప్‌కు ఫోన్ చేసిన నెతన్యాహూ

గాజాలో శాంతి ఒప్పందానికి హమాస్ అంగీకరించడం పట్ల ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజిమన్ నెతన్యాహూ హర్షం ప్రకటించారు. "ఇది గొప్ప సుదినం, చరిత్రాత్మక మైన పరిణామం, మా దేశ పౌరులు రెండు సంవత్సరాల తర్వాత తిరిగి జన్మభూమిపై అడుగుపెట్టేందుకు రంగం సిద్ధమైంది, వారికి తీసుకువస్తున్నాం, ఇది ఎంతో గొప్ప సుదినం" అన్నారు. ఒప్పందానికి హమాస్ అంగీకరించి నట్లు తెలియగానే నెతన్యాహూ తీవ్ర భావోద్వేగానికి గుర య్యారు. వెంటనే ట్రంప్‌కు ఫోన్ చేసి కృతజ్ఞతలు తెలియ జేశారు. ఇజ్రాయెల్ పార్లమెంటు సమావేశంలో పాల్గొని ప్రసంగించాల్సిందిగా ఆయనను ఆహ్వానించారు. అందు కు ట్రంప్ సమ్మతించారు. గాజాలో గురువారం ఉదయం కూడా దాడులు కొనసాగాయి. ఒకవైపు ఈజిప్టులో చర్చలు ఒకకొలిక్కి రాగానే అదేసయంలో వైట్‌హౌస్ డైనింగ్‌రూములో సమావేశంలో ఉన్న ట్రంప్‌కు విదేశాం గమంత్రి మార్కో రుబియో ఒక నోట్ తెచ్చి ఇచ్చారు. ఆయన చెవిలో ఏదో గుసగుసలాడారు. గాజాలో యుద్ధ విరమణపై ఒప్పందం కుదిరింది, మీరు సోషల్ మీడి యాలో పోస్టు చేయాలి, దీనిపై ప్రకటన చేయాలి అని మార్కో రుబియో ట్రంప్ చెవిలో గుసగుజగా చెప్పారు. తర్వాత ట్రంప్ ఆయనతో మాట్లాడుతూ, బహుశా తాను ఈజిప్టుకు వెళ్ళే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని చెప్పారు. ఆ తర్వాత ట్రంప్ గాజాలో శాంతి ఒప్పందం మొదటిదశకు ఇజ్రాయెల్–హమాస్ అంగీకరించినట్లు ప్రకటించారు. దీంతో గాజాలో 734 రోజుల తర్వాత యుద్ధశాంతి నెలకున్నట్లవుతుంది.

### సోషల్ మీడియాలో ట్రంప్ భజన

శాంతిప్రణాళికను ఆమోదిస్తూ హమాస్ ప్రకటన చేసిన తర్వాత అందరూ ట్రంప్‌ను ప్రశంసల్లో ముంచెత్తుతు న్నారు. ఆయన ట్రూత్ సోషల్ మీడియా ప్రశంసలతో నిండిపోతోంది. ఇప్పుడు ఆయన గాలిలో తేలిపోతు న్నారు. మధ్యప్రాచ్యంలో ట్రంప్ శాంతి స్థాపన చేశారు అంటూ ఆయన పాలనాగణం, సన్నిహితులు, ఆయన ప్రాపుకోరే రిపబ్లికన్ నాయకులు, ఉన్నతాధికారులు భజన ప్రారంభించారు. ట్రంప్ తిరిగి వారికి ధన్యవా దాలు తెలియజేస్తున్నారు. కాగా మధ్యప్రాచ్యంలో అమె రికా దౌత్యవేత్త మైక్ హకబీ గురించి ట్రంప్ పోస్టింగ్ పెడుతూ, ఆయన అద్భుతమైన వ్యక్తి, మధ్యప్రాచ్యంలో శాంతిస్థాపనకోసం ఎంతో కష్టపడ్డారన్నారు.ఛానల్ 12తో ట్రంప్ మాట్లాడుతూ, ఇప్పుడే తనకు నెతన్యాహూ ఫోన్‌చే శారన్నారు. "ఇప్పుడు నన్ను అందరూ ఇష్టపడుతు న్నారు, కేవలం నన్నే కాదు, ఇజ్రాయెల్‌ను కూడా అందరూ ఇష్టపడుతున్నారు" అని భావోద్వేగంతో నెత న్యాహూ తనకు చెప్పారని ట్రంప్ అన్నారు. త్వరలో తాను ఇజ్రాయెల్ పర్యటించి అక్కడి పార్లమెంటులోప్రసం గిస్తానన్నారు.గురువారం ఉదయం నుం డి తనకు కృతజ్ఞ తలు వెల్లువలా వచ్చిపడుతున్నాయన్నారు.

### హమాస్‌ను నిరాయుధం చేసేదెలా?

గాజాలో యుద్ధం ఆపేందుకు మొదటిదశ ప్రణాళిక అమ లుకు రంగం సిద్ధమైనప్పటికీ ఇంకా అనేక సమస్యలు శేష ప్రశ్నలుగానే మిగిలిపోయాయి. ఆయుధాలు వదిలిపెట్టేది లేదని హమాస్ చెప్పడం, ఒకవేళ ఆయుధాలు స్వాధీనం చేస్తే కొత్తగా ఏర్పడే పాలస్తీనా ప్రభుత్వానికే ఇస్తామని చెప్పడం, మరోవైపు పాలస్తీనాను ఎట్టిపరిస్థితుల్లోనూ దేశంగా గుర్తించే ప్రశ్నేలేదని నెతన్యాహూ ప్రకటించడం రెండూ కీలకమైన భవిష్యత్ ప్రశ్నలే. ఈ రెండు ప్రశ్నలను పక్కనపెట్టినాగానీ వలసపాలకుల సంరక్షుడుగా పేరు పొందిన టోనీ బ్లెయిర్ (బ్రిటన్ మాజీ ప్రధానమంత్రి)ను ట్రంప్ తన 21 అంశాల ప్రణాళిక ద్వారా తెరమీదకు తీసుకురావడం కూడా వివాదాస్పదంగా మారింది. ట్రంప్, బ్లెయిర్ (72) ఇద్దరూ సంరక్షులుగా ఉంటామని చెప్పారు. ఇందులో టోనీ బ్లెయిర్ గవర్నర్ జనరల్‌గా గాజాలో ప్రధానపాత్ర పోషించే అవకాశాలు కనిపిస్తు న్నాయి. ఇరాక్‌పై అన్యాయపూరితంగా తప్పు డు ఆరోప ణలతో దాడిచేసిన అమెరికాతో చేతులు కలిపిన టోనీ బ్లెయిర్ బ్రిటన్ పార్లమెంటును తప్పుతోవ పట్టించారన్న ఆరోపణలు ఎదుర్కొన్నారు.

బలవంతంగా ఆయన ప్రధానమంత్రి పదవికి రాజీ నామా చేయాల్సి వచ్చింది. హమాస్ సంస్థ గాజాలో బ్లెయిర్‌కు ఏ విధంగా ఆయుధాలను స్వాధీనం చేస్తుంద న్నది ప్రధాన సమస్య. గాజాలో పాలన భవిష్యత్తుపై ఎలాంటి స్పష్టగా లేదు. ఈ విషయంలో రాజకీయ విశ్లేష కులు, దార్శనికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.సమస్య ఇంతటితో పరిష్కారం కాలేదని, రాబోయే కాలంలో అనేక కొత్త సమస్యలొస్తాయని అంతర్జాతీయ మీడియా సంకేతాలు ఇస్తోంది. 2023 అక్టోబరు ఏడో తేదీన యుద్ధం మొదలైన తర్వాత మొదట ఇజ్రాయెల్‌పై సాను భూతి వ్యక్తమైనప్పటికీ తర్వాతర్వాత నెతన్యాహూ క్రమంగా ఒక ప్రతినాయకుడుగా మారారు. హమాస్ తొలి దాడి నేరం పక్కకు పోయింది. సామాన్య జనహ ననం, ఊచకోతలు భూగోళంపై రెండేళ్ళుగా ప్రధాన చర్చ నీయాంశంగా మారింది. సానుభూతి పొందాల్సిన నెత న్యాహూతన చర్యల ద్వారా పూర్తిగా ప్రపంచ ప్రజల విశ్వాసం కోల్పోయారు. అధ్యయన నివేదికల్లో ఇప్పటికీ ఆయనపట్ల సానుకూల ధోరణి లేదు.

# తిరస్కరిస్తున్నాం

(మొదటి పేజీ తరువాయి)

పని ప్రదేశాన్ని నియంత్రించేందుకు, దేశంలోని ఉద్యోగ రంగాన్ని నిర్వహిం చేందుకు, కార్మిక హక్కులు, రక్షణలను నిర్ధారించడానికి ప్రభుత్వం ఏర్పాటు చేసే సమగ్ర నియమావళి అని అమర్‌జీత్ కౌర్ పేర్కొన్నారు. ఆ విధానాన్ని రూపొందించే ముందు ప్రధాన భాగస్వామ్యపక్షాలైన కేంద్ర కార్మిక సంఘా లతో చర్చించడం భారతదేశంలో అమలులో ఉన్న ప్రామాణిక,కీలకమైన పద్ధతి అని తెలిపారు. అలాంటి పద్ధతి మాత్రమే ముసాయిదా విధానానికి చట్టబద్ధ త ను, ప్రభావశీలతను కలిగిస్తుందని అన్నారు. కార్మిక సంఘాలతో సంప్ర దింపులు జరపడం అనేది ఒక ఐచ్ఛికం లేదా కేవలం లాంఛనం కాదని, ఇది పటిష్టమైన కార్మిక విధానానికి మూలస్తంభం అని స్పష్టం చేశారు. కార్మిక సంఘాలతో అవసరమైన సంభాషణను దాటవేసి, ముసాయిదా కార్మిక విధా నాన్ని విడుదల చేయడంలో కార్మిక, ఉపాధి కల్పన మంత్రిత్వ శాఖ అనుసరిం చిన దుందుడుకు వైఖరిని ఆమె తీవ్రంగా ఖండించారు. జాతీయ కార్మిక విధానం ఒక ప్రభుత్వం తన శ్రామిక శక్తి కోసం అనుసరించే వ్యూహాన్ని నిర్దే శిస్తుందని, ఇందులో ఉద్యోగ రక్షణ, ఉపాధి కల్పన, మెటర్నిటీ ప్రయోజ నంతో సహా సామాజిక భద్రత, పని గంటలు, భద్రత, నైపుణ్యాభివృద్ధి వంటి అంశాలు ఉండాలని అమర్‌జీత్ కౌర్ కోరారు. ఈ కార్మిక విధానం అంతర్జా తీయ కార్మిక ప్రమాణాలను, రాజ్యాంగపరమైన కర్తవ్యాలకు కట్టుబడి ఉండా లని తెలిపారు.కానీ, తాజా ముసాయిదా కార్మిక విధానానికి విశ్వసనీయత లేదని, డొల్లగా ఉందని మండిపడ్డారు. బిజెపి అనుసరిస్తున్న కార్పొరేట్‌అను కూల, కార్మికవ్యతిరేక విధానాల నేపథ్యంలో ఈ ముసాయిదా విధానం, ప్రభుత్వ కార్మిక వ్యతిరేక వైఖరిని చట్టబద్ధం చేయడానికి ప్రయత్నిస్తున్న నిజా యితీ లేని పత్రంగా కనిపిస్తోందని నిశితంగా విమర్శించారు. ముసాయిదా విధానాన్ని మామూలుగా పరిశీలించినా అందులోని డొల్లతనం స్పష్టంగా బైట పడుతుందని అమర్‌జీత్‌కౌర్ ఎద్దేవా చేశారు. ఈ విధానం కేంద్ర కార్మిక సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్న కార్మిక కోడ్లకు అనుకూలంగా రూపొందిం చబడిందన్నారు. ఉద్యోగ భద్రత, ఉపాధి కల్పన, కనీస వేతన చట్టం ప్రకారం తప్పనిసరి కనీస వేతనాలు వంటి అత్యంత కీలకమైన అంశాలను ఈ విధానం పరిష్కారం చూపలేదన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, జస్ట్ ట్రాన్సి షన్ పై ఒకవిధానం లేకపోవడం, అసంపూర్ణమైన, సందేహాస్పదమైన డేటా నేపథ్యంలో, ముసాయిదాలో చేసిన వాదనలు కేవలం కంటితుడుపు చర్య మాత్రమేనని అన్నారు. సార్వత్రిక సామాజిక భద్రతపై కార్మిక, ఉపాధి కల్పన మంత్రిత్వ శాఖ తప్పుడు కథనాన్ని ఎఐటియుసి తీవ్రంగా సవాలు చేస్తోందని అమర్‌జీత్ కౌర్ అన్నారు. సంక్షేమ పథకాలు సామాజిక భద్రత కిందకు రావని, అసంఘటిత రంగ కార్మికులు, దినసరి కూలీలు, గిగ్, సాధారణ, కాంట్రాక్ట్, వ్యవసాయ, గృహఆధారిత, గృహ కార్మికులు, అందరికీ కనీస వేతనాలు, సామాజిక భద్రతను చట్టపరమైన అర్హతలుగా అందించాలని, కఠినమైన తని ఖీల ద్వారా వాటిని అమలు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ అంశాల కు ఏ మాత్రం తక్కువగా ఉండే ఎలాంటి విధానాన్ని కూడా తాము అంగీకరిం చబోమని ఆమె స్పష్టం చేశారు.

# ప్రభుత్వ ఉద్యోగం

(మొదటి పేజీ తరువాయి)

స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఎన్‌డిఎపై తీవ్ర విమ ర్శలు చేశారు. 20 ఏళ్లలో యువతకు ఉద్యోగాలు కల్పిం చలేకపోయిందని మండిపడ్డారు. తాము అధికారంలోకి వచ్చిన 20 రోజుల్లోపు చట్టాన్ని తీసుకువస్తామని, 20 నెలల్లో అమలు జరిగేలా చూస్తామని మాజీ ఉప ముఖ్య మంత్రి వాగ్దానం చేశారు. గత అసెంబ్లీ ఎన్నికలలో కూడా ప్రభుత్వ ఉద్యోగాలకు సబంధించిన హామీ ఇచ్చా మని, తాను అధికారంలో ఉన్న కొద్ది కాలంలోనే ఐదు లక్షల ఉద్యోగాలు కల్పించామన్నారు. తనకు ఐదేళ్ల పదవీ కాలం లభిస్తే ఏమి జరుగుతుందో మీరు ఊహించవచ్చ న్నారు. అయితే నితీష్ కుమార్ ప్రభుత్వాన్ని 'కాపీకా ట్'గా తేజస్వీ పదే పదే అభివర్ణించారు, ఇటీవలి నెలల్లో అనేక ప్రజాకర్షక చర్యలు మునుపటి ఎన్నికల వాగ్దా నాల నుండి ప్రేరణ పొందాయని పేర్కొన్నారు. బిహార్ కోసం తన ఎజెండా గురించి ఎన్నికలు ప్రకటించిన తర్వాత మాత్రమే మాట్లాడతానని గతంలో తేజస్వీ చెప్పారు. కాగా, ఇటీవల ప్రభుత్వం వినియోగదారులకు నెలకు 125 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను అందించింది. అభ్యర్థులకు పరీక్ష రుసుములను రద్దు చేసింది. మహిళ లకు రిజర్వు చేసిన సీట్లలో 'డొమిసైల్ కోటా''ను ప్రవేశపె ట్టింది. సామాజిక భద్రతా పెన్షన్లను పెంచింది. ఎన్నికలు ప్రకటించడానికి ఒక వారం ముందు 'ముఖ్యమంత్రి మహిళా రోజ్‌గార్ యోజన'ను ప్రారంభించారు. అందులో భాగంగా రాష్ట్రంలోని కోటి మందికి పైగా మహి ళలకు ప్రత్యక్ష నగదు బదిలీ ద్వారా ఒక్కొక్కరికి రూ. 10,000 చెల్లించారు. మహిళల్లో వ్యవస్థాపకతను ప్రోత్స హించడానికి ప్రవేశపెట్టిన ఈ పథకాన్ని విమర్శకులు ఎన్నికలకు ముందు ఓటర్లకు లంచం ఇచ్చే ప్రయత్నంగా విమర్శించారు. అయితే, సీట్ల భాగస్వామ్యం, ముఖ్య మంత్రి అభ్యర్థిని అధికారికంగా ప్రకటించడం వంటి అంశాలతో అస్థిర రాజకీయ పరిస్థితిపై ప్రశ్నలను అడగ డానికి యాదవ్ నిరాకరించారు. పెద్ద ప్రకటన చేయడా నికి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశామని, దీనికి సంబంధించిన ప్రశ్నలు అడిగితే సమాధానం చెప్పడానికి సిద్ధంగా ఉన్నానన్నారు. ఇతర సమస్యల కోసం తరువాత మాట్లాడుకుందామన్నారు.

# నిర్లక్ష్య ఫలితమే

(మొదటి పేజీ తరువాయి)

ఆయన మాట్లాడుతూ బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌లకు బిజెపి కట్టుబడి ఉందని, అసెంబ్లీలో బిసి బిల్లుకు, ఆర్డినెన్స్‌కు పూర్తిగా మద్దతిచ్చామని తెలి పారు. బిజెపి ఎంపి ఆర్. కృష్ణయ్య ఇంప్లీడ పిటిషన్ వేశారన్నారు. గవర్నర్‌కు బిల్లు పంపి 3 నెలలు కూడా ఓపిక పట్టలేదన్నారు. ఇది చట్టవిరుద్ధం, అని ఆయన అన్నారు. బిసిల రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా రాజకీయ ప్రయోజనాల కోసమే వ్యవహరిస్తోందని విమర్శించారు. తమ తప్పులను కప్పిపుచ్చుకునేందుకు బిజెపిపై దుష్ప్రచారం చేస్తోందన్నారు. బిసి లకు న్యాయం జరిగేలా ప్రభుత్వం వెంటనే సుప్రీంకోర్టును ఆశ్రయించాలని బిజెపి డిమాండ్ చేస్తోందన్నారు. మధ్యప్రదేశ్‌లో 57 శాతం రిజర్వేషన్‌ల కోసం బిజెపి ప్రభుత్వం సుప్రీంకోర్టులో పోరాడుతోందన్నారు. తెలంగాణలో కూడా బిసిల హక్కుల కోసం తాము కట్టుబడి ఉన్నామన్నారు. కాంగ్రెస్ ప్రభు త్వం తెచ్చిన బిల్లులు, డిక్లరేషన్లు, ఆర్డినెన్స్‌లు చట్టపరంగా చెల్లుబాటు కానివి అన్నారు. ఈ ప్రభుత్వం చిత్తశుద్ధి లేని నిర్ణయాలతో బిసిల హక్కులను రాజ కీయ ప్రయోజనాల కోసం వాడుకుందని విమర్శించారు. జి.ఓ ఇచ్చి షెడ్యూల్ ప్రకటించడంలో లోగుట్టు ఏంటి? కోర్టు స్టేకు ప్రభుత్వానిదే బాధ్యత అన్నారు.

**రేవంత్ రెడ్డి చేతకానితనం వల్లే హైకోర్టు స్టే : కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి**

రేవంత్ రెడ్డి సర్కార్ చేతకానితనం వల్లే హైకోర్టు స్టే విధించిందని కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి అన్నారు. బిసి రిజర్వేషన్‌లపై రాష్ట్ర ప్రభుత్వానికి, కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేదని విమర్శించారు. ప్లాన్‌బి సిద్ధం చేసుకుని కోర్టులో తూతూమం త్రంగా వాదించారని ఆరోపించారు. కాంగ్రెస్ బిసిలను రాజకీయంగా వాడు కుందని, వాడుకుంటోందని, కేంద్రంలో కాంగ్రెస్ ఉన్నప్పుడే సుప్రీంకోర్టు 50 శాతం పరిమితి విధించిందనే కనీస అవగాహన లేకుండా రేవంత్ రెడ్డి సర్కార్ వ్యవహరించిందని కిషన్ రెడ్డి విమర్శించారు.

# సవరణతోనే సాధ్యం...

(మొదటి పేజీ తరువాయి)

ఎంఎల్‌సి దాసోజు శ్రవణ్‌తో కలిసి మాజీ మంత్రులు గంగుల కమలాకర్, శ్రీని వాస్‌గౌడ్ మాట్లాడారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చిన తర్వాతనే ఎన్ని కలను నిర్వహించాలని గంగుల కమలాకర్ చెప్పారు. రాహుల్ గాంధీ ప్రధాని అయ్యాకే బిసి రిజర్వేషన్లు పెంచుతామని చెప్పిన సిఎం రేవంత్ రెడ్డి ప్రస్తుతం ఎందుకు జిఒను జారీచేశారని ప్రశ్నించారు. 1992లో తమిళనాడు సిఎం జయ లలిత ఎంఎల్‌ఎలను ఢిల్లీకి తీసుకెళ్లి బిసి రిజర్వేషన్ల కోసం భీష్మించి కూర్చున్నా రని, అందుకే కేంద్రం దిగొచ్చి, రాజ్యాంగ సవరణ చేయడంతోనే తమిళనా డులో బిసిలకు రిజర్వేషన్లు పెరిగాయని వివరించారు. శ్రీనివాస్ గౌడ్ మాట్లా డుతూ రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రపతిని కలవకుండానే ఢిల్లీలో ధర్నా చేసి హంగామా చేసిందన్నారు. మంత్రులు కోర్టులకు వెళ్లడానికి అదేమైనా 'టగ్ ఆఫ్ వార్' ఆటనా అని ప్రశ్నించారు. రిజర్వేషన్ల విషయమై కెసిఆర్‌తో చర్చించి తమ భవిష్యత్ కార్యాచరణ ఖరారు చేస్తామన్నారు. వద్ది రాజు రవి చంద్ర మాట్లాడుతూ రిజర్వేషన్ల అంశంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆపరేషన్ సక్సెస్, పేషంట్ డెడ్ అనే తరహాలో వ్యవహరించిందని అన్నారు.

# నోబెల్ బహుమతి

(మొదటి పేజీ తరువాయి)

సమస్యలను ఇతివృత్తాలుగా తీసుకుని నమ్మదగని కథనాల ప్రయోగాత్మక సాహి త్యశైలిని కూడా ఆయన ఉపయోగిస్తారు. అల్ఫ్రెడ్ నోబెల్ వర్ధంతి సందర్భంగా డిసెంబరు 10వ తేదీన జరిగే కార్యక్రమంలో 10.20 లక్షల డాలర్లు బహుమతి తోపాటు 18 కేరట్ల బంగారు పతకం, డిప్లమో కూడా విజేతకు అందజేస్తారు. ఇప్పటివరకూ నోబెల్ కమిటీ 117 సార్లు సాహిత్య పురస్కారాలను అందజేసిం ది. ఉమ్మడిగా కూడా ఈ పురస్కారాలు కొందరు అందుకున్నారు. ఇలా మొత్తం 121 మంది ఈ సాహిత్య పురస్కారాలు స్వీకరించారు. గత ఏడాది దక్షిణ కొరియా రచయిత హాన్ కాంగ్‌కు సాహిత్య పురస్కారం లభించింది. ఈ ఏడాది వివిధ రంగాలకుగాను ఈ వారంలో ఇప్పటివరకూ నాలుగు పురస్కారాలు ప్రక టించారు. శుక్రవారం పదో తేదీన శాంతి బహుమతి ప్రకటిస్తారు. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ కూడా ఈసారి తనకే నోబెల్ బహుమతి వస్తుందన్న బలమైన ఆశాభావంతో ఉన్నారు. "ప్రతి ఒక్కరూ నాకే నోబెల్ బహుమతి వస్తుం దని చెబుతున్నారు" అని ట్రంప్ ప్రకటించుకున్నారు. అదేవిధంగా ఈనెల 13వ తేదీన చివరిగా ఆర్థికశాస్త్రంలో నోబెల్ బహుమతి విజేతను ప్రకటిస్తారు.

# కేంద్ర సర్కార్ వల్లే

(మొదటి పేజీ తరువాయి)

శక్తులు, ప్రజాస్వామికవాదులంతా కేంద్ర ప్రభుత్వాన్ని గద్దెదింపేందుకు పోరా టాలకు సన్నద్ధం కావాలని విజ్ఞప్తి చేసింది. 42 శాతం బిసి రిజర్వేషన్ల అమలు కు రాష్ట్ర ప్రభుత్వం న్యాయబద్ధమైన చర్యలను తీసుకోవాలని డిమాండ్ చేసింది. బిజెపి కులతత్వ, మనువాద పార్టీ కావడంతోనే కుల వ్యవస్థ, అసమానతలు ఉండాలని, మనుధర్మ శాస్త్రాన్ని అమలు చేయాలని కోరుకుంటూ ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ, మహిళలకు రావాల్సిన హక్కులన్నింటినీ కాలరాస్తోందని విమ ర్శించింది. బిసిలకు 42శాతం రిజర్వేషన్లు అమలు కావాలంటే బిజెపికి పుట్టగ తులు లేకుండా చేస్తేనే సాధ్యమని సిపిఐ(ఎం) రాష్ట్ర కమిటి వెల్లడించింది.

# మొక్కజొన్నలు కొనుగోలు

(మొదటి పేజీ తరువాయి)

జొన్న పంటను మద్ధతు ధర చెల్లించి కొనుగోలు చేసిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. రాష్ట్రంలో మొత్తం 6,24,544 ఎకరాల్లో మొక్కజొన్న సాగైందని, సాగు పరిస్థితులు మెరుగవ్వడంతో సగటున ఎకరాకు 18.50 క్వింటల్ దిగుబడి వచ్చి, మొత్తం 11.56 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న ఉత్పత్తి అవుతుందని అంచనా వేసినట్టు తెలిపారు. అదేవిధంగా ఈ సీజన్ లో 8.66 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్నలను కొనుగోలు చేయాల్సి ఉంటుందని అంచనా వేశామని మంత్రి వెల్లడించారు.సెప్టెంబర్ 3 వ వారం నుండే మార్కెట్లోకి భారీగా మొక్క జొన్న పంట రావడం వల్ల ధరలు తగ్గిపోయాయని తెలిపారు. ప్రస్తుత మార్కెట్ ధరలు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఎంఎస్‌పి (రూ2,400 క్వింటల్) కన్నా రూ.441 తక్కువగా రూ. 1,959 రూపాయలు ఉందని, దీంతో మొక్క రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారని అన్నారు. 8.66 లక్షల మెట్రిక్ టన్నులు మొక్క జొన్న పంటను కొనుగోలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వంపై రూ.2400 కోట్ల భారం పడుతుందని, అయినప్పటికి రాష్ట్ర రైతుల ప్రయోజానాలే ముఖ్యమని మద్ధతు ధర చెల్లించి కొనుగోలు చేయడానికి సిద్ధంగా ఉని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు.

# నిరాశకు గురిచేసింది

(మొదటి పేజీ తరువాయి)

కేంద్ర ప్రభుత్వం తక్షణమే పార్లమెంటును సమా వేశపర్చి ఆప్రక్రియను పూర్తి చేయాలని కూనం నేని సాంబశివరావు డిమాండ్ చేశారు. రిజర్వే షన్ 50 శాతం పరిమితి పేరుతో ఏళ్ళ తరబడి బిసిల రిజర్వేషన్ పెంపు అంశాన్ని నాన్చడం ఏ మాత్రం తగదని తెలిపారు. ఆర్థికంగా వెనుకబ డిన వర్గాల(ఇడబ్ల్యుఎస్) రిజర్వేషన్ వర్తింపులో ఈ పరిమితిని ఇప్పటికే దాటి పోయిన విష యాన్ని పరిగణలోకి తీసుకోవాలన్నారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లకు సిపిఐ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ. ఇప్పటికే శాసనసభలో బిల్లులకు మద్దతు తెలపడంతో పాటు స్థానిక సంస్థల ఎన్ని కల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించే జిఒ 9పై వేసిన రిట్ పిటిషన్ కొట్టివేయాలని కోరుతూ హైకోర్టులో దాఖలైన కేసుల్లో సిపిఐ తరుపున ఇంప్లీడ్ అయ్యామని తెలిపారు. హైకోర్టు తాజా స్టే నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తక్షణ కార్యాచ రణ చేపట్టాలని గవర్నర్ వద్ద పెండింగ్ ఉన్న బిల్లులు నిర్ణీత కాలపరమితి లోగా ఆమోదం లభించకపోతే, నోటిఫై చేయవచ్చని తమిళనాడు కేసులో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును పరిశీలిం చాలని, దాని ఆధారంగా మార్చిలో శాసనసభ ఏకగ్రీవ ఆమోదం పొంది ఆరు నెలలు దాటిన తెలంగాణ వెనుకబడిన తరగతుల (గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థల రిజర్వేషన్) చట్టం 2025 గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశాలపై నిపుణుల సలహా తీసుకోవాలని, ఇందుకు అవస రమైతే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని కూనంనేని సాంబశివరావు సూచించారు.

**బిసిలకు బిజెపి తీరనిద్రోహం : ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం**

బిసిలకు బిజెపి తీరని ద్రోహం చేసిందని సిపిఐ ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేష న్‌తో పాటు ఎన్నికల నోటిఫికేషన్ పై గురువారం హైకోర్టు ఇచ్చిన స్టేతో పాటు రిజర్వేషన్ అమలు జాప్యం కావడానికి కేంద్రంలోనీ బిజెపి ప్రభు త్వమే ప్రధాన కారణం అని ఆయన విమర్శిం చారు. ఇప్పటికే శాసనసభలో బిసి రిజర్వేషన్ 42 శాతానికి పెంచే బిల్లులను అన్ని పార్టీల మద్ద తుతో ఏకగ్రీవంగా ఆమోదించిందని, అలాగే రిజ ర్వేషన్ పెంచుతూ జారీ చేసిన ఆర్డినెన్స్ కూడా ఉందని అన్నారు.

ఈ బిల్లులతో పాటు ఆర్డినెన్స్ నెలల తరబడి కేంద్రం వద్ద నెలల తరబడి పెండింగ్‌లో ఉండడం తోనే స్థానిక సంస్థల ఎన్నికలపై హైకోర్టు స్టే విధించడానికి కారణమైందని సత్యం విమర్శించారు.

# దోహదపడేలా విధానాలు

(మొదటి పేజీ తరువాయి)

అనుసరిస్తే ప్రపంచానికి ఆదర్శవంతంగా ఉంటుంద న్నారు. తెలంగాణకు వచ్చిన అమెరికా ప్రతినిధుల బృందంతో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తన అభిప్రా యాలను పంచుకున్నారు. అమెరికా నుంచి వచ్చిన ప్రతి నిధులు గురువారం సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సమావేశమయ్యారు. రాష్ట్ర ఐటి పరిశ్ర మల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, సిఎం సలహా దారు వేం నరేందర్ రెడ్డి. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సంజయ్ కుమార్, ప్రిన్సిపల్ సెక్రెటరీ రిజ్వీ, సిఎంఓ ముఖ్య కార్యదర్శి శేషాద్రి, టిజిఐఐసి ఎండి, ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కమిషనర్ కె.శశాంక, ఇండస్ట్రిస్ డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి ఈ సమావేశంలో పాల్గొన్నారు. అమెరికాలోని హడ్సన్ ఇనిస్టిట్యూట్‌కు చెందిన ప్రతినిధులు 16 మంది ఈ సమావేశంలో పాల్గొ న్నారు. వివిధ రంగాలకు చెందిన మేధావులు, బిజినెస్ లీడర్లు ఈ బృందంలో ఉన్నారు. ఇండియా ఫౌండేషన్ సారథ్యంలో ఈ ప్రతినిధి బృందం భారత్‌లో పలు రాష్ట్రాల్లో పర్యటిస్తోంది. భారత్, అమెరికా మధ్య ద్వైపా క్షిక సంబంధాలు, వ్యాపార వాణిజ్య వ్యవహారాలు, విధానాలపై ఈ బృందం దేశంలోని వివిధ రాష్ట్రాల్లో పర్య టించి అభిప్రాయాలు స్వీకరిస్తోంది. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రైజింగ్ భవిష్యత్తు ప్రణాళికలను వివరించారు. పాల కులు మారితే విధానాలు మార్చుకోవాల్సిన అవసరం లేదని, రాష్ట్ర అభివృద్ధి విషయంలో ఉత్తమమైన విధానా లను ప్రభుత్వం ఇప్పటికీ కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఇప్పటికే ఐటి, ఫార్మా రంగాల పెట్టుబడులకు గమ్యస్థానంగా హైదరాబాద్ ప్రపంచ నగరంగా అంద రినీ ఆకర్షిస్తోందని, దేశ విదేశాల నుంచి పెట్టుబడులు పెట్టేందుకు ప్రపంచ దిగ్గజ కంపెనీలు ఇక్కడికి వస్తున్నా యన్నారు. హైదరాబాద్ ఇప్పుడు న్యూయార్క్, టోక్యో, దక్షిణ కొరియాతో పోటీ పడుతోందని, మన మౌలిక సదుపాయాలు, తయారీ సామర్థ్యాలను మెరుగుపరచ డంలో ప్రపంచ ప్రమాణాలకు సవాలుగా ఉందని ఆయన అన్నారు. సుమారు 30 వేల ఎకరాల్లో హైదరా బాద్‌లో అభివృద్ధి చేస్తున్న భారత్ ఫ్యూచర్ సిటీలో అమె రికా పరిశ్రమల భాగస్వామ్యాన్ని, మద్దతును ఆహ్వానిస్తు న్నామని అన్నారు. ఇప్పటికే ఫార్చ్యూన్ 500 కంపెనీల్లో 50 కంపెనీలు హైదరాబాద్‌లో ఉన్నాయని, మొత్తం 500 కంపెనీలు పెట్టుబడులకు ముందుకు రావాలని, ఫ్యూచర్ సిటీలో పాలుపంచుకోవాలనే ఆకాంక్షను వ్యక్తం చేశారు. జిఎస్‌డిపి, తలసరి ఆదాయంలో తెలం గాణ అనూహ్య పురోగతి సాధించిందని, 2034 నాటికి ఒక ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను తీర్చిదిద్దు తామని అన్నారు. 2047 నాటికి 3 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి సాధించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని ముఖ్యమంత్రి అన్నారు. హైదరాబాద్‌లో గేమ్ ఛేంజర్ ప్రాజెక్టులు చేపడుతున్నామని ముఖ్య మంత్రి వివరించారు.

భారత్ ఫ్యూచర్ సిటీతో పాటు రీజినల్ రింగ్ రోడ్, రీజి నల్ రింగ్ రైల్, మాన్యుఫాక్చర్ జోన్లు అభివృద్ధి చేస్తున్నా మని చెప్పారు. డ్రై పోర్ట్ ఏర్పాటు చేసి పొరుగున ఉన్న ఎపిలో మచిలీపట్నం పోర్ట్ వరకు 12 లేన్ గ్రీన్ ఫీల్డ్ హైవే, రైల్ కనెక్టివిటీ ఉండేలా రవాణా సదుపాయాలు విస్తరిస్తున్నట్లు చెప్పారు. హైదరాబాద్ నుంచి అటు చైన్నై వరకు, ఇటు హైదరాబాద్ నుంచి బెంగుళూరుకు బుల్లెట్ ట్రైన్ ఏర్పాటు చేసే ప్రతిపాదనలున్నాయని అన్నారు. హైదరాబాద్‌లో మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు అభివృద్ధి చేస్తామని, సిటీలో ఇప్పుడున్న మెట్రో రైలును అన్ని ప్రాంతాలకు విస్తరిస్తున్నట్లు చెప్పారు. మూసీ పున రుజ్జీవన ప్రాజెక్ట్ తెలంగాణ ఆర్థిక వ్యవస్థను ముందుకు తీసుకెళ్లడానికి కొత్త మార్గాలను తెరుస్తుందని ముఖ్య మంత్రి అన్నారు. 'చైనా+1' వ్యూహానికి తెలంగాణ అత్యు త్తమ ఎంపికగా నిలుస్తుందని, అటువంటి భవిష్యత్తు ప్రణాళికలను తమ ప్రభుత్వం అనుసరిస్తుందని ముఖ్య మంత్రి అన్నారు.

హైదరాబాద్‌లో ఎఐ సిటీతో పాటు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేసే ఆలోచనలు ఉన్నాయని మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. ఎఐ రంగంలో రాష్ట్రాన్ని దేశానికే స్కిల్ క్యాపిటల్‌గా తీర్చిది ద్దాలనే ప్రణాళికతో ప్రభుత్వం కార్యక్రమాలు చేపడు తుందని అన్నారు. ఇప్పటికే పేరొందిన కంపెనీలు హైద రాబాద్‌లో గ్లోబల్ కెపాసిటీ సెంటర్స్ ఏర్పాటు చేశా యని, వీటిని గ్లోబల్ వాల్యూ సెంటర్లుగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం తగిన ప్రోత్సాహం అందిస్తుందని అన్నారు. హైదరాబాద్ నుండి వచ్చే కంపెనీలు ప్రపంచ వ్యాప్తంగా కోవిడ్ వ్యాక్సిన్లలో ప్రధాన వాటాను సరఫరా చేశాయని, స్వదేశీ కంపెనీలను మరింతగా పెంపొందిం చడానికి ప్రయత్నాలు కొనసాగుతున్నాయని నొక్కి చెప్పారు.

హడ్సన్ ఇనిస్టిట్యూట్ ప్రతినిధి, వాల్ స్ట్రీట్ జర్నల్ కాల మిస్ట్ ప్రొఫెసర్ వాల్టర్ రస్సెల్ మీడ్, రేషనల్వేవ్ క్యాపి టల్ పార్టనర్స్ సిఈఓ మార్క్ రోసెన్‌బ్లాట్, క్రౌ హోల్డింగ్స్ చైర్మన్ హర్లాన్ క్రో, ఈగిల్ క్యాపిటల్ మేనేజ్‌మెంట్ వ్యవ స్థాపకులు రావెనెల్ కర్రీ, బిల్లింగ్స్ కంపెనీ భాగస్వామి హెన్రీ బిల్లింగ్స్‌తో పాటు మొత్తం 16 మంది అమెరికా ప్రతినిధి బృందంలో ఉన్నారు.

# వచ్చేదాకా పోరాడుతాం

(మొదటి పేజీ తరువాయి)

చిత్తశుద్ధి ఉందో, ఎవరికి లేదో ప్రజలు ఆలోచించాలని వారు కోరారు.

2018లో నాటి టిఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలో పంచాయతీరాజ్ సంస్థల్లో రిజర్వేషన్ 50 శాతం మించ కుండా చట్టం చేసిందని, అదూ నేడు రాష్ట్రంలో బిసిలకు ఉరితాడుగా తయారైందని విమర్శించారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలన్న సంకల్పబలం ప్రభు త్వానికి కాంగ్రెస్ పార్టీకి ఉందని వారు స్పష్టం చేశారు. గాంధీభవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్‌కుమార్ గౌడ్, రాష్ట్ర డిప్యూటీ ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్ర మార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి మాట్లాడారు.

డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క మాట్లాడు తూ బిఆర్ ఎస్, బిజెపి కలిసి బిసిల నోటి కాడి ముద్దను దూరం చేసి దయ్యాలు వేదాలు వల్లించినట్టు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ రెండు పార్టీలు కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వం చిత్తశుద్ధిని శంకించడం హాస్యస్పదమ న్నారు. బిసిలకు రిజర్వేషన్లు కల్పించాలంటే ఎంపిరికల్ డాటా , ఏ లెక్కల ప్రకారం రిజర్వేషన్లు అడుగుతున్నా రని ప్రశ్నిస్తారని, కాబట్టి కాంగ్రెస్ ప్రభుత్వం శాస్త్రీ యంగా అధ్యయనం చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బిసి గత ఏడాది ఏప్రిల్ 4వ తేదీన రిజర్వేష న్లపై మంత్రివర్గంలో తీర్మానం చేసి ఆ తీర్మానం ఆధా రంగా శాసనసభలో ఏకగ్రీవంగా బిల్లు ఆమోదించి గవ ర్నర్‌కు పంపామని, అంతా ఏడాది కాలంలోనే పూర్తి చేసామన్నారు.

బిసిలకు 42 శాతం రిజర్వేషన్ బిల్లును అసెం బ్లీలో ఆమోదించి పంపితే బిజెపి నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం బిల్లు చేయకుండా అడ్డుకుందని విమర్శిం చారు. స్థానిక సంస్థల్లో 50 శాతానికి రిజర్వేషన్ మించ కుండా 2018లో విఆర్ఎస్ చట్టం చేసిందన్నారు. 2019లో ఎన్నికలు జరిపిన వెంటనే ఆనాటి రాష్ట్ర ప్రభుత్వం బిసిలపై ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్న కుల గణన చేసి జీఓ ఇచ్చేదన్నారు. సెప్టెంబర్ 30వ తేదీ లోపు ఎన్ని కలు పెట్టాలని హైకోర్టు చెప్పిందని, ఎన్నికలు జరపడా నికి 42 శాతం బిసిలకు రిజర్వేషన్ ఇవ్వాలని ప్రయత్నం చేశామన్నారు. ఓబిసిలకు రిజర్వేషన్ ఇవ్వా లని ఆనాటి ప్రభుత్వం ప్రయత్నం చేయలేదన్నారు. ప్రజలు అమాయకులు కాదని, బిసి సంఘాల నాయ కులు అంతకంటే అమాయకులు కాదన్నారు. ఎంపిరి కల్ డాటా లేకుండా రిజర్వేషన్ ఎలా ఇస్తారని, ఆనాడు కోర్టు ప్రశ్నించిందని, ఇందు కోసం జిఓ 9 తేవడానికి సిపెక్ సర్వే చేశామని, సర్వేలో కూడా పాల్గొనని పార్టీలు నేడు మాట్లాడడం విడ్డూరమన్నారు. 'టిఆర్ఎస్ ప్రభు త్వంలో సర్వే ఎక్కడ జరిగింది, ఎప్పుడు జరిగింది? ఎవరు చేశారో తెలియదు ఎక్కడా డిక్లేర్ చేయలేదు. శాస నసభలో కూడా పెట్టలేదు.' అని డిప్యూటీ సిఎం అన్నా రు.

**బిసిలకు మేలు చేయడాన్ని బిఆర్ఎస్, బిజెపి తట్టుకో-లేకపోతున్నాయి**

బిసిల విషయంలో కాంగ్రెస్ పార్టీకి ఉన్న చిత్తశుద్ధి అందరికీ తెలుసునని మహేష్‌మార్ గౌడ్ పేర్కొన్నారు. బిసి సంక్షేమం కోసం చేస్తున్న కార్యక్రమాలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. బిసిలకు మేలు చేయడాన్ని బిఆర్ ఎస్, బిజెపి, నేతలు తట్టుకోలేకపోతున్నారని విమర్శిం చారు. ఈ వ్యవహారంలో బిఆర్ఎస్, బిజెపి నేతలు హైకోర్టులో ఇంప్లీడ్ కాలేదని, ఈ పార్టీల నేతలు చరిత్ర హీనులుగా మిగిలిపోతారని వ్యాఖ్యానించారు.

బీసీలకు రిజర్వేషన్లు ఇచ్చాకే స్థానిక ఎన్నికలకు వెళ్తామన్నారు. దేశంలోనే తొలిసారి కులగణన చేసింది తమ ప్రభుత్వమేనని చెప్పారు. బిసి రిజర్వేషన్లపై తమకు సంకల్పబలం ఉందని, అందుకే ఇక్కడివరకు చేరుకున్నా మన్నారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## బాలికల వసతిగృహం నుంచి ముగ్గురు విద్యార్థినులు అదృశ్యం

ప్రజాపక్షం/నిజామాబాద్ : నగరంలోని సంక్షేమ బాలికల వసతిగృహం నుంచి ముగ్గురు విద్యార్థినులు వెళ్లిపోయారు. ఈ సంఘటన గురువారం ఉదయం వెలుగు చూసింది. ఉదయం హాస్టల్ వార్డెన్ నాగలక్ష్మి స్థానిక 2వ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుతో పోలీసులు రంగప్రవేశం చేయటంతో విషయం ఆలస్యంగా బహిర్గతమైంది.
స్థానిక హాస్టల్‌లో ఉండి ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థిని (15), ఇద్దరు 9వ తరగతి విద్యార్థినిలు (14) గురువారం తెల్లవారుజామున హాస్టల్ నుంచి వెళ్లిపోయారు.
ఈ విషయం ప్రేయర్ సమయంలో గుర్తించిన అధికారులు ముందుగా బాలికల కుటుంబ సభ్యులకు సమాచారమందించారు. తర్వాత అధికారుల ఆదేశాల మేరకు పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

## ఉద్యాన సాగు విస్తరణే లక్ష్యం

తెలంగాణ రాష్ట్ర ఉద్యాన అభివృద్ధి ప్రణాళిక– 2035'ను ఆవిష్కరించిన సిఎం ఎ. రేవంత్ రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్రంలో ఉద్యాన సాగును మరింత విస్తరించడమే లక్ష్యంగా ప్రభుత్వం 'తెలంగాణ రాష్ట్ర ఉద్యాన అభివృద్ధి ప్రణాళిక–2035' విడుదల చేసింది. కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో డాక్టర్ డి. రాజి రెడ్డి , డాక్టర్ ఎ.భగవాన్ , డాక్టర్ జి.పి. సునందిని రూపొందించిన ప్రణాళిక–2035'ను గురువారం డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్‌చాన్సలర్ డి. రాజిరెడ్డి, పలువురుఅధికారులు పాల్గొన్నారు. రాష్ట్రంలో ఉద్యాన పంటల ఉత్పత్తిని పెంచేందుకు 2035 వరకు అనుసరించాల్సిన లక్ష్యాలు, 10ఏళ్లలో అనుసరించాల్సిన వ్యూహాలను ఈ ప్రణాళికలో పొందపర్చారు. రాబోయే 5 ఏళ్లలో 1.32 లక్షల ఎకరాల్లో పండ్ల తోటలు, 2.45 లక్షల ఎకరాల్లో కూరగాయల పంటల విస్తీర్ణం, దిగుబడులు, ఉత్పత్తిని పెంచడం లక్ష్యంగా ప్రణాళికలో నిర్ధేశించారు.
వచ్చే 5 సంవత్సరాల్లో రూ. 921.40 కోట్లు సాగు పెట్టుబడిగా, అలాగే రూ.942.50 కోట్లు డ్రిప్ కోసం పెట్టుబడిగా కేటాయిస్తే, ఒక్క రూపాయి పెట్టుబడికి నాలుగు రూపాయల లాభం పొందే అవకాశం ఉందని ప్రణాళిక పేర్కొంది. ఉద్యాన విశ్వవిద్యాలయం రూపొందించిన రకాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రస్తుత విస్తీర్ణంలో అమలు చేయడం వల్ల ఏటా రూ.1,341కోట్ల ఉత్పత్తి విలువను సాధించవచ్చని అంచనా వేశారు. వివిధ పంటల్లో మిగులు, ఉత్పత్తి లోటు ప్రాతిపదికగా కార్యాచరణను అమలు చేయాలని నిర్ణయించారు. మిగులు ఉత్పత్తి ఉన్న పంటలు, లోటు ఉత్పత్తి ఉన్న పంటలు గుర్తించి, వాటికి అనుగుణంగా విస్తీర్ణం పెంచడం, ఉత్పాదకత సామర్థ్యాన్ని అభివృద్ధి చేయడం, పంట యాజమాన్యం, మార్కెటింగ్ వంటి అంశాలను ప్రణాళికలో సమగ్రంగా వివరించారు.

**ప్రణాళికలోని ప్రధాన అంశాలు :**
పండ్లు, కూరగాయల సాగు విస్తీర్ణం పెంచడానికి అనువైన జిల్లాలను నేల స్వభావం, వాతావరణ పరిస్థితులను పరిగణలోకి తీసుకొని ఉద్యాన విశ్వవిద్యాలయం ఎంపిక చేసింది. పండ్ల పంటలలో జామ, బొప్పాయి, అరటి, సపోటా, దానిమ్మ, డ్రాగన్ ఫ్రూట్ (కమలం పండు). ద్రాక్ష, ఖర్జూరం అంజీర్, నేరేడు, ఉసిరి, సీతాఫలం 1.32 లక్షల ఎకరాలలో 2030 వరకు అనువైనవిగా నిర్ధారించిన జిల్లాలలో విస్తీర్ణం పెంచనున్నారు.
కూరగాయల సాగుకు సంబంధించి 2030కు 2.45 లక్షల ఎకరాలలో అనువైనవిగా నిర్ధారించిన జిల్లాలలో టమాటో, వంగ, క్యారెట్, క్యాబేజ్, దోస, కాలిఫ్లవర్, ముల్లంగి, ఉల్లి, ఆలుగడ్డ, ఆకు కూరలు, బీర, సొర, మిరప, బెండ, కాకర మరియు చిక్కుడు పంటల విస్తీర్ణం పెంచడానికి కృషి చేయనున్నారు. ఆఫ్ సీజన్ కూరగాయలు పెంపకంపై విశ్వవిద్యాలయం తయారు చేసిన ప్రణాళిక అమలుపర్చడంతో పాటు సంవత్సరం పొడుగునా కూరగాయల లభ్యతకు, వివిధ వ్యవధుల్లో కూరగాయల సాగు, షేడ్ నెట్లో, రక్షిత వసతులలో కూరగాయలు పెంచడం వంటి పద్ధతులను అవలంభినున్నారు.
**ఉత్పాదకత పెంచడం:** ఉద్యాన విశ్వవిద్యాలయం పెంపొందించిన సాంకేతికతను పండ్లు, కూరగాయలు, ఔషధ, సుగంధ ద్రవ్యాల పంటలలో అమలుపరిచి అధిక దిగుబడి పొందేందుకు ప్రయత్నం చేస్తారు. పంట నష్టాలను తగ్గించడానికి వాతావరణ ఆధారిత సూచనలు సమయానుకూలంగా విడుదల చేయడంతో పాటు ప్రతి మండలంలో వ్యవసాయ యంత్రాల కోసం కనీసం ఒక కస్టమ్ హైరింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నారు. త ద్వారా రైతులు సకాలంలో సాగు పనులు పూర్తి చేయగలిగి నష్టాలను తగ్గించుకోనున్నారు. ఉద్యాన అధికారులు, విస్తరణ అధికారులు, శాస్త్రవేత్తలు, రైతులు నైపుణ్యాలను పెంపొందించే కార్యక్రమాలను రూపొందించి అమలు చేస్తారు.
**కోతానంతర పంట యాజమాన్యం :**
కోత అనంతరం పంట నష్టం తగ్గించడానికి కావాల్సిన శీతల నిల్వ గిడ్డంగులు, పండ్లను మాగబెట్టే కేంద్రాలు, నిల్వ వసతులతో మార్కెటింగ్ యార్డ్ శీతల రవాణా వంటి మౌలిక వసతులు కల్పిస్తారు. ఉల్లి పండించే ప్రాంతాలలో తక్కువ ఖర్చుతో నిల్వ సదుపాయాలు కల్పించనున్నారు. ఎగుమతులు ప్రోత్సహించడానికి హైదరాబాదులోని అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలో తగిన మౌలిక సదుపాయాలతో సమీకృత ప్యాక్ హౌస్ ఏర్పాటు చేయడం, నాణ్యత పెంచడం, నిల్వ, కోతానంతర పంటల నిర్వహణ, పురుగుమందు అవశేషాలు లేని ఉత్పత్తి, నిల్వకాలం పెంచడం, విలువ జోడింపు పై విస్తృతంగా పరిశోధనలు నిర్వహించనున్నారు.
**మార్కెటింగ్ పెంచడం :**
రైతు ఉత్పత్తి సంఘాల ద్వారా సామూహిక క్రయ విక్రయాలను, పంట సాగు, కోతానంతర పంట యాజమాన్యంలో సామూహిక కార్యకలాపాలను ప్రోత్సహిస్తారు. తెలంగాణ ప్రభుత్వం మొదలుపెట్టిన వ్యవసాయ మార్కెట్ యార్డులో పండ్లు, కూరగాయల క్రయవిక్రయాలను సక్రమంగా అమలుపరిచేలా చర్యలు చేపట్టనున్నారు. ఉద్యాన పంటల ధరల ముందస్తు సూచనలపై మార్కెటింగ్ ఇంటలిజెన్స్ కేంద్రాన్ని ఉద్యాన విశ్వవిద్యాలయం, వ్యవసాయ మార్కెటింగ్ శాఖ కలిసి నిర్వహించేలా కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వ విద్యాలయంలో నెలకొల్పుతారు. ఈ సూచనలు రైతులకు సకాలంలో అందాలి.

## సోలార్ విద్యుత్ వినియోగంపై ఆసక్తిగా ఉన్నాం

డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క



ప్రజాపక్షం/హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలో విద్యుత్ రంగం బలోపేతంలో భాగంగా సోలార్ విద్యుత్తు ఉత్పత్తి, వినియోగంలో తెలంగాణ రాష్ట్రం ఆసక్తిగా ఉందని రాష్ట్ర డిప్యూటీ ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో గురువారం జర్మనీ ప్రతినిధులతో తెలంగాణ డిప్యూటీ సిఎం సమావేశమయ్యారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సోలార్ రంగంపై ఆసక్తిగా ఉందని తెలుసుకుని కొన్ని ప్రతిపాదనలతో వచ్చినట్టు జర్మనీ ప్రతినిధులు తెలిపారు. రాష్ట్రంలో 29 లక్షల వ్యవసాయ పంపు సెట్లు, 200 యూనిట్ల వరకు గృహజ్యోతి పథకం కింద ఉచితంగా విద్యుత్ సరఫరా చేస్తున్నామని డిప్యూటీ సిఎం జర్మనీ ప్రతినిధులకు వివరించారు.
రాష్ట్రంలోని వ్యవసాయ పంపు సెట్లతో పాటు గృహజ్యోతి లబ్ధిదారులకు సోలార్ విద్యుత్ అందించాలనే ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని తెలిపారు. ఈ ప్రక్రియలో భాగంగా రైతులు, గృహ జ్యోతి వినియోగదారులకు ప్రతి నెలా ఖచ్చితమైన ఆదాయం వచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేయాలనేది రాష్ట్ర ప్రభుత్వం ఆలోచన అని తెలిపారు.
జర్మనీ ప్రతినిధులు సూచించిన సోలార్ సాంకేతిక పరిజ్ఞానాన్ని తెలంగాణ రాష్ట్రంలో ఏ విధంగా అనుసంధానం చేసుకోగలం, తెలంగాణ విద్యుత్ రంగాన్ని ఆర్థికంగా, సాంకేతికంగా బలోపేతం చేసుకోవడానికి జర్మనీ బృందం ప్రతిపాదనలు ఏ మేరకు ఉపయోగపడతాయో అధ్యయనం చేసి నివేదిక రూపొందించాలని విద్యుత్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ నవీన్ మిట్టల్‌ను డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క ఆదేశించారు. సమావేశంలో ట్రాన్స్‌కో సిఎండి కృష్ణ భాస్కర్, ఎస్‌పిడిసిఎల్ సిఎండి ముషారఫ్ ఫారుకి, రెడ్కో సిఎండి అనిలా, జర్మనీ ప్రతినిధులు డాక్టర్ సెబాస్టియన్, డాక్టర్ రఘు చలిగంటి పాల్గొన్నారు.

### దశలవారీగా హ్యామ్ రోడ్ల నిర్మాణం చేపట్టాలి

రాష్ట్రంలో దశలవారీగా హ్యామ్ రోడ్ల నిర్మాణం త్వరితగతిన చేపట్టాలని డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు.
హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితో కలిసి హ్యామ్ రోడ్ల నిర్మాణంపై గురువారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. హ్యామ్ రోడ్ల నిర్మాణ క్రమంలో అన్ని శాసనసభ నియోజకవర్గాలకు ప్రాతినిధ్యం ఉండేలా చూడాలని, రోడ్ల నిర్మాణ క్రమంలో ట్రాఫిక్ సర్వేను పరిగణలోకి తీసుకోవాలని భట్టి విక్రమార్క సూచించారు. మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ మొదటి దశ పనులకు అతి త్వరలోనే టెండర్లు ఆహ్వానించాలని అధికారులను ఆదేశించారు.
ఈ సమావేశంలో ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్, ఆర్థిక శాఖ కార్యదర్శి హరిత, ఆర్ అండ్ బి అధికారులు, ఇంజనీర్లు పాల్గొన్నారు.

## రాష్ట్ర వ్యాప్తంగా నిబంధనలు ఉల్లంఘిస్తున్న ప్రైవేట్ డయాగ్నస్టిక్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలి

ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్ర వ్యాప్తంగా నిబంధనలు ఉల్లంగిస్తున్న ప్రైవేట్ డయాగ్నస్టిక్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలని, డిస్ ప్లే బోర్డులలో వ్యాధి నిర్ధారణ పరీక్షల రేట్లను పొందరుపర్చే విధంగా ఆదేశాలు జారీ చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) రాష్ట్ర సమితి నాయకులు వైద్య ఆరోగ్య శాఖను డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడువలి ఉల్లా ఖాద్రీ, కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్. బాలకృష్ణ, కాంపల్లి కళ్యాణ్ తదితరుల ప్రతినిధి బృందం



హైదరాబాద్, కోఠిలోని ప్రజా ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ అదనపు డైరెక్టర్ ఆర్.పుష్పకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వలి ఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్ర మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రైవేట్ డయాగ్నస్టిక్ సెంటర్లు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. అనుమతుల్లేకుండానే రోగ నిర్ధారణ కేంద్రాల నిర్వహణ, కనీస జాగ్రత్తలు పాటించకుండానే నమూనాలను సేకరిస్తున్నారని వారు తెలిపారు. క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్టు ప్రకారం ఏ వ్యాధి నిర్ధారణ పరీక్షకు ఎంత డబ్బు తీసుకోవాలో పెద్ద అక్షరాలతో బోర్డ్‌పైన ప్రదర్శించాలని, కానీ దీనిని ఎక్కడా పాటించడం లేదని వారు వివరించారు.హైదరాబాద్ నగరంలో పెద్ద బ్రాండ్లతో ఉన్న సంస్థలు కేవలం ఒక బ్రాంచ్ కు అనుమతి పొంది, పదుల సంఖ్యలో డియాగ్నోస్ సెంటర్లను నిర్వహిస్తున్నారని ఆరోపించారు.



## పల్లా వెంకట్ రెడ్డికి వికారాబాద్ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి అభినందనలు

ప్రజాపక్షం/హైదరాబాద్ : ఇటీవల చండీగఢ్‌లో జరిగిన సిపిఐ 25వ జాతీయ మహాసభలలో సిపిఐ జాతీయ కార్యదర్శిగా ఎన్నికైన పల్లా వెంకట్ రెడ్డికి సిపిఐ వికారాబాద్ జిల్లా కార్యదర్శి బి.విజయలక్ష్మి అభినందనలు తెలిపారు. గురువారం సిపిఐ రాష్ట్ర కార్యాలయంలో పల్లా వెంకటరెడ్డికి విజయలక్ష్మి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పల్లా వెంకట్ రెడ్డి మాట్లాడుతూ వికారాబాద్ జిల్లాలో సిపిఐ బలోపితానికి కృషి చేయాలని, ప్రజా సమస్యలపై విస్తృతంగా పోరాటాలు నిర్వహించాలని, అలాగే వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బలమున్నచోట్ల సిపిఐ అభ్యర్థులు పోటీచేసి సత్తా చాటాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆర్.అంజయ్య నాయక్, సిపిఐ నేత ఎ.రవీంద్ర చారి పాల్గొన్నారు.

## దేశవ్యాప్తంగా కేంద్రమే కులగణన చేయాలి

సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి




ప్రజాపక్షం/శంకరపట్నం : బిసిలకు 42 శాతం రిజర్వేషన్లపై హైకోర్టు రెండు వారాల గడువు స్టే విధిస్తూ ఇచ్చిన తీర్పుపై ఎన్నికల సంఘం తీసుకునే నిర్ణయంపై ప్రజల్లో ఉత్కంఠ నెలకొందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి అన్నారు. గురువారం శంకరపట్నం మండలం సిపిఐ మండల శాఖ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 73, 74 రాజ్యాంగ సవరణల ప్రకారం ప్రతి ఐదేళ్లకోసారి గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించాలని రాజీవ్‌గాంధీ 94లో తీసుకొచ్చిన చట్టాన్ని కొంతమంది తూట్లు పొడవడంతో పదవీకాలం ముగిసి ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతుండడంతో గ్రామ పంచాయతీలకు నిధులు లేక అభివృద్ధి కుంటుపడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.
పార్లమెంటు, శాసనసభకు ప్రతి ఐదేళ్లకు ఒకసారి ఎన్నికలు జరుగుతున్నాయని, స్థానిక సంస్థలకు మాత్రం పదవీకాలం ముగిసి ఏళ్లు గడుస్తున్నా ఎన్నికలు నిర్వహించకపోవడంతో గ్రామాల అభివృద్ధి కుంటుపడిందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం అన్ని కులాలకు రిజర్వేషన్ ప్రాధాన్యత కల్పించేందుకు కులగణన చేపట్టకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం కులగణన చేపట్టి బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించిందని పేర్కొన్నారు. స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని నోటిఫికేషన్ జారీ చేయగా హైకోర్టు ఇచ్చిన తీర్పుతో ప్రజల్లో ఉత్కంఠ నెలకొందన్నారు. కేంద్రమే కులగణన చేపడితే ఈ సమస్య ఉండేది కాదన్నారు.
బలమున్నచోట తాము అభ్యర్థులను నిలబెట్టి స్థానిక సంస్థల ఎన్నికల పోటీలో ఉంటామని పేర్కొన్నారు. అంబానీ, ఆదానీలు ప్రపంచ ధనవంతుల్లో అగ్రగామిగా ఉన్నారని, దేశంలో సామాన్యులు పేదరికంలో మగ్గుతున్నారని ఆవేదన చెందారు.
కూడు, గూడు, గుడ్డ కల్పించాలని ఉద్యమిస్తున్న ప్రశ్నించే గొంతుకలైన వామపక్ష నాయకులను ప్రధాని మోదీ అణచివేస్తున్నారని మండిపడ్డారు. మావోయిస్టులు తుపాకులు వీడి చర్చలకు వస్తామని ప్రకటించినా కేంద్ర మంత్రి వారిని అంతమొందించేందుకు కంకణం కట్టుకున్నారని ఆరోపించారు.
ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి, సిపిఐ మండల కార్యదర్శి పిట్టల సమ్మయ్య, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బత్తుల బాబు, ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు కటికరెడ్డి బుచ్చన్న యాదవ్, హుజురాబాద్, సైదాపూర్, వీణవంక, జమ్మికుంట, ఇల్లందకుంట మండల కార్యదర్శులు గోవిందుల రవి, లంకదాసరి కళ్యాణ్, గజ్జి బాలయ్య, రామ్‌గోపాల్, రత్నాకర్, ఎఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామారపు వెంకటేష్, ఉపాధ్యక్షుడు సాగర్, రాము, సిపిఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




## రాష్ట్రంలో చెరువుల పరిరక్షణ నీటి సంఘాలతోనే సాధ్యం

రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్రంలో చెరువుల పరిరక్షణ నీటి సంఘాలతోనే సాధ్యమని తెలంగాణ వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ ఛైర్మన్ ఎం.కోదండరెడ్డి అన్నారు. గత 10ఏళ్ల కాలంలో వేలాది చెరువులు అన్యాక్రాంతమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. చెరువుల రక్షణకు ప్రత్యేక చట్టం తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. గురువారం హైదరాబాద్‌లో రైతు సంక్షేమ కమిషన్ కార్యాలయంలో రిటైర్డ్ ఇంజనీర్లు, నిపుణులు, వ్యవసాయ అధికారులతో సమావేశం జరిగింది. నీటి సంఘాల నియామకం, విధివిధానాలు రూపకల్పనకు సంబంధించి కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కమిషన్ సభ్యులు కేవీఎన్ రెడ్డి, గడుగు గంగాధర్, భవానీ రెడ్డి, రాములు నాయక్ తోపాటు రిటైర్డ్ ఇరిగేషన్ ఇంజనీర్లు బి. నాగేంద్రరావు, జి. సురేందర్, రవీందర్ రెడ్డి (వాలంతరి), డా. వెంకట రాధా, సీనియర్ సైంటిస్ట్,ఇక్రిశాట్ , భీం ప్రసాద్, ఓ.ఎస్.డి. టు ఇరిగేషన్ మినిస్టర్, నర్సింహరావు వ్యవసాయ శాఖ అడిషనల్ డైరెక్టర్, కమిషన్ మెంబర్ సెక్రెటరీ గోపాల్, హరివెంకట ప్రసాద్, శ్రావణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోదండరెడ్డి మాట్లాడుతూ చెరువుల పరిరక్షణకుగాను కమిషన్ సూచన మేరకు ప్రభుత్వం నీటి సంఘాలను ఏర్పాటు చేస్తామని ప్రకటించడం హర్షించదగ్గ విషయమని తెలిపారు. రెవెన్యూ, ఇరిగేషన్ అధికారుల మధ్య సమన్వయం లేకపోవడం వల్ల కబ్జాదారులు రెచ్చిపోతున్నారని, మరోవైపు చెరువులు ఆక్రమించినా అధికారులు ఎన్ఓసిలు ఇవ్వడం విడ్డురమన్నారు. ఫలితంగా రాష్ట్రంలో 10 ఏళ్ల కాలంలో వేలాది చెరువులు ఆగమయ్యాయని తెలిపారు. శిఖం పట్టా భూములు కూడా కబ్జాకు గురయ్యాయని, చెరువులోనే పెట్రోల్ బంక్ లు ఏర్పాటు చేసినట్లు కమిషన్ దృష్టికి వచ్చిన విషయాన్ని ప్రభుత్వానికి నివేదించనున్నట్లు ఆయన తెలిపారు. చెరువుల పరిరక్షణలో క్యాచ్ మెంట్ ఏరియా కూడా ముఖ్యమేనని స్పష్టం చేశారు. చెరువులు బాగుంటేనే వ్యవసాయం బాగుంటదిని, మత్స్య సంపద కూడా వృద్ధి చెందుతదని గుర్తుచేశారు. నీటి సంఘాల కమిటీలో రెవెన్యూ, అగ్రికల్చర్ అధికారులతో పాటు ఆదర్శ రైతులు, చేపలపెంపకందారులు, యువకులకు కమిటీల్లో అవకాశం ఇవ్వాలని అధికారులు కమిషన్ కు సూచన చేసినట్లు కోదండరెడ్డి వివరించారు.



## తక్షణమే ఆర్‌టిసి బస్సు చార్జీలను ఉపసంహరించండి

ఆర్‌టిసి ఎండికి కెటిఆర్ వినతి

ప్రజాపక్షం/హైదరాబాద్ : పెంచిన ఆర్‌టిసి చార్జీలను తక్షణమే ఉపసంహరించుకోవాలని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఆర్‌టిసి కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చి, సంస్థ సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. 'మహిళలకు ఉచిత బస్సు'ను స్వాగతిస్తున్నామని, కానీ బస్సుల సంఖ్యను పెంచాలన్నారు. మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, గ్రేటర్ హైదరాబాద్‌కు చెందిన ఎంఎల్‌ఎలు సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, సుధీర్ రెడ్డి, ముఠాగోపాల్, పద్మారావు, కాలేరు వెంకటేష్, లక్ష్మారెడ్డి, ఎంఎల్‌సి సురభి వాణిదేవితో కలిసి కెటిఆర్ బస్‌భవన్‌లో ఆర్‌టిసి ఎండి నాగిరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా కెటిఆర్ మీడియాతో మాట్లాడుతూ హైదరాబాద్ నగర ప్రజలపై పెంచిన ఆర్‌టిసి చార్జీల భారాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆర్‌టిసి ఆస్తులను అమ్ముకోవాలని చూస్తూ, అంతిమంగా ఆ సంస్థను ప్రైవేటుపరం చేసే కుట్రకు కాంగ్రెస్ ప్రభుత్వం తెరలేపిందని కెటిఆర్ ఆరోపించారు. రెండు సంవత్సరాలుగా రాష్ట్రంలో ఉపాధి అవకాశాలు పూర్తిగా తగ్గిన నేపథ్యంలో మరోసారి టికెట్ల రూపంలో చార్జీలు పెంచి భారం మోపడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరసన కార్యక్రమంలో భాగంగా బిఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు బస్‌భవన్‌కు చేరుకున్నారు.

## సామాజిక పురోగతికి సోషలిజమే మార్గం : ఎఐవైఎఫ్



ప్రజాపక్షం/హైదరాబాద్ : సామాజిక పురోగతికి సోషలిజమే మార్గం మని అఖిలభారత యువజన సమాఖ్య(ఎఐవైఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర, జిల్లా అధ్యక్షులు ఆర్. బాలకృష్ణ, ప్రధాన కార్యదర్శి నెర్లకంటి శ్రీకాంత్ అన్నారు. గెరిల్లా పోరాట యోధుడు ఎర్నెస్టో చేగువేరా 58 వర్ధంతి సందర్భంగా ఎఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని సత్యనారాయణరెడ్డి భవన్‌లో గురువారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ధర్మేంద్ర మాట్లాడుతూగెరిల్లా పోరాట యోధుడు, ధైర్యశాలి,మూర్తీభవించిన మానవత్వం వంటి విలువలు కలిగిన మహనీయుడు ఎర్నెస్టో చేగువేరా అని కొనియడారు. ఈ సందర్భంగా ధర్మేంద్ర, ఆర్. బాలకృష్ణ, నెర్లకంటి శ్రీకాంత్ మాట్లాడుతూ క్యూబాలో జన్మించిన చేగువేరా కేవలం తన దేశానికే కాక అనేక దేశాలలో పర్యటించి పెట్టుబడి దారీ వ్యవస్థపై అలుపెరుగని పోరాటాలు నిర్వహించిన గొప్ప యోధుడు అన్నారు. వంద పండ్లను ఒక్కడే దాచుకోవడం క్యాపిటలిజం ఉన్నదాంట్లో అందరూ పంచుకోవడం కమ్యూనిజం అని చెప్పిన చేగువేరా మాటలు ప్రజా ఆకాంక్షలకు అద్దం పడుతుందని వారు వారు గుర్తు చేశారు. చేగువేరా అమెరికన్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా అనేక పోరాటాలు నిర్వహించి విప్లవ యోధుడున్నారు.. విప్లవం అనేది పక్వానికొచ్చినప్పుడు కింద పడే ఆపిల్ పండుకాదని, మనమే దాన్ని పోరాడి సాధించుకోవాలి అన్న చేగువేరా మాటలు నేటి ప్రపంచానికి పోరాట పటిమను చూపుతుంద తెలిపారు. ముఖ్యంగా స్థానిక ప్రజల్ని చైతన్యవంతుల్ని చేసి, వారిని విప్లవోద్యమం వైపు మళ్ళించకుండా విప్లవాన్ని విజయవంతం చేయడం అసాధ్యమని అనేక సందర్భాల్లో చెప్పారన్నారు. రైతాంగం, కార్మిక వర్గం అనే రెండు పట్టాలమీద విప్లవమనే రైలు ప్రయాణం చేయాల్సి ఉంటుందన్నారు. చేగువేరా తాను జీవితాంతం ఏ సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా పోరాడాడో అదే అతన్ని ఫ్యాషన్ ఐకాన్‌గా మార్చేసి, ఆయన పేరు మీద నేటికీ వందల కోట్ల వ్యాపారం చేయడం విషాదకరమని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడు కాంపల్లి కళ్యాణ్, అరుణ్, సుశాంత్, ప్రతిమ, రమ్య, శాంతి, ఫాతిమా, ప్రదీప్, నదీమ్, ప్రభాకర్, సంజీవ్ పాల్గొన్నారు.

**CHANGE OF NAME**

I, **MYADA JALENDHAR, S/O. BUCHILINGAM** (Old Name), H.No. 5-56/1, Potharam (V), Mallial (M), Jagtial Dist. here by declare that I have changed my name **MYADA JALENDHAR** (Old Name) to **NIMMA JALENDHAR, S/O. BUCHILINGAM** (New Name) for all purpose.

**సూపరింటెండెంట్ కార్యాలయం, ఉస్మానియా జనరల్ హాస్పిటల్, హైదరాబాద్.**

Rc. No. M2/Repairs/OGH/2025-26/1498 తేదీ: 29.09.2025

షార్ట్ టెండర్ నోటిఫికేషన్

విషయం : ఈ కార్యాలయం ద్వారా అవసరమైనప్పుడు పేషెంట్ మానిటర్లు, ఇసిజి మెషీన్లు, కాటరీ యంత్రాలు, ఇతర వైద్యపరికరాలు, అవసరమైన మరియు ప్రాణాలను రక్షించే ఉపకరణాల సేకరణ మొదలైనవి. వీటికి సంబంధించిన షార్ట్ టెండర్ నోటిఫికేషన్ జారీచేయడమైనది.
Ref : Approved office note Rc. No. M2/Repairs/ OGH/ 2025-26/ తేదీ: 29-09-2025.

NNNNN

ఈ కార్యాలయం ద్వారా అవసరమైనప్పుడు పేషెంట్ మానిటర్లు, ECG యంత్రాలు, కాటరీ యంత్రాలు మరియు ఇతర వైద్య పరికరాల కోసం సేకరణ లేదా అవసరమైన మరియు ప్రాణబూలాను రక్షించే ఉపకరణాల కోసం అధీకృత /డీలర్లు / ఏజెన్సీల సేవా ప్రదాతల నుంచి సీల్డ్ టెండర్లు ఆహ్వానించడమైనది.

01. టెండర్ ఫారం రుసుం రూ.5,000/=00 + 18 % GST (అయిదు వేల రూపాయలు మాత్రమే) 'ది సూపరింటెండెంట్, ఉస్మానియా జనరల్ హాస్పిటల్, హైదరాబాద్' పేరిట డిమాండ్ డ్రాఫ్ట్ రూపంలో.
02. టెండర్ ఫారముల అమ్మకం తేదీ. 09-10-2025 నుండి తేదీ.16-10-2025 వరకు, అన్ని పనివేళల్లో ఉదయం 10-30 గంటల నుండి సాయంత్రం 4: 00 గంటల మధ్య. హైదరాబాద్‌లోని ఉస్మానియా జనరల్ హాస్పిటల్, ఎన్‌పిఆర్ బ్లాక్, M2 సెక్షన్ వద్ద ప్రారంభించబడును.
03. సీల్డ్ టెండర్లను సమర్పించడానికి చివరి తేదీ 18-10-2025, దీనితో పాటు బయానా డబ్బు డిపాజిట్ (EMD) రూ.1,00,000=00 (ఒక లక్ష రూపాయలు మాత్రమే) 'సూపరింటెండెంట్, ఉస్మానియా జనరల్ హాస్పిటల్,హైదరాబాద్' పేరుతో తీసుకున్నడిమాండ్ డ్రాఫ్ట్ రూపంలో OGH ఇన్‌వార్డ్ సెక్షన్‌లో సమర్పించాలి.
04. సీల్డ్ టెండర్లు తేదీ 21-10-2025న మధ్యాహ్నం 3.00గంటలకు హైదరాబాద్ ఉస్మానియా జనరల్ హాస్పిటల్‌లోని సూపరింటెండెంట్ ఛాంబర్స్‌లో విక్రేతలు / ఏజెన్సీల అధికారిక ప్రతినిధుల సమక్షంలో తెరువబడతాయి.

ది సూపరింటెండెంట్, ఉస్మానియా జనరల్ హాస్పిటల్, హైదరాబాద్ ఎటువంటి నోటీస్ లేకుండా ఏదైనా లేదా అన్ని టెండర్లను అంగీకరించడానికి / తిరస్కరించడానికి / రద్దు చేయడానికి అన్ని హక్కులు ఉన్నాయి.

సం/- సూపరింటెండెంట్, ఉస్మానియా జనరల్ హాస్పిటల్, హైదరాబాద్.
DIPR R.O. No. : 8924-PP/CL/ADVT/1/2025-26, Date: 09-10-2025

## ఎల్‌ఓసి అందజేత



ప్రజాపక్షం/హాలియా: నిడమనూరుకు చెందిన వడ్డేపల్లి చంద్రశేఖర్ కుటుంబానికి స్థానిక సంస్థల ఎంఎల్‌సి మంకెన కోటిరెడ్డి రెండు లక్షల విలువగల ఎల్‌ఓసిని అందజేశారు. గురువారం ఎంఎల్‌సి చాంబర్లో నిడమనూరు చెందిన వడ్డేపల్లి చంద్రశేఖర్ ఇటీవల హైదరాబాదులోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స చేయించుకుంటున్నారు. దీంట్లో బాగానే ఆయన చికిత్స నిమిత్తం ఎమ్మెల్సీ మంకెన కోటిరెడ్డి 2 లక్షల రూపాయల విలువగల ఎల్‌ఓసిని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు వైద్యం చేయించుకునేందుకు ఆర్థిక ఇబ్బందులు తలెత్తినప్పుడు వారి స్థితిగతులను బట్టి బాధిత కుటుంబాలకు ఎల్ ఓ సి అందించనున్నట్లు అని చెప్పారు. దీని ద్వారా సంబంధిత రోగికి ఆర్థిక భారం తగ్గి పూర్తిస్థాయి వైద్యం చేయించుకునే అవకాశం ఉంటుందని ఆయన తెలిపారు. ఆయన వెంట చాపల సైదులు, అంజద్ ఖాన్, వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

## యోగాతోనే మానసిక వికాసం



ప్రజాపక్షం/నలగొండ(నకిరేకల్): యోగా ధ్యానం మానసిక వికాసానికి దోహదం చేస్తాయని ప్రముఖ యోగా గురువు మాదగాని శంకరయ్య అన్నారు. గురువారం నకిరేకల్ మండలంలోని తాటికల్ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా శంకరయ్య మాట్లాడుతూ యోగా ధ్యానం వ్యక్తిత్వ వికాసానికి తోడ్పడతాయన్నారు. విద్యార్థులలో ధారణ శక్తి పెంపొందడానికి, ఏకాగ్రత పెరగడానికి మెడిటేషన్ దోహదపడుతుందన్నారు. ఈ సందర్భంగా పలు యోగాసనాలను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. విద్యార్థుల చేత యోగా ధ్యానం అభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు డాక్టర్ సాగర్ల సత్తయ్య, నర్రా వెంకటరెడ్డి, నూకల జానయ్య, పద్మ పాల్గొన్నారు.



## మానసిక ప్రశాంతతకు క్రీడలు

ప్రజాపక్షం/నల్లగొండ టౌన్: క్రీడలు మానసిక, ఒత్తిడిని జయించి ప్రశాంతతకు దోహదపడతాయని యాదాద్రి సర్కిల్ అటవీ శాఖ సంరక్షణ అధికారి శివాల రాంబాబు అన్నారు. గురువారం పట్టణంలోని మేకల అభినవ్ స్టేడియంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో రీజినల్ స్పోర్ట్స్ మీట్ యాదాద్రి అండ్ జోగులాంబ సర్కిల్ క్రీడా పోటీలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శివాల రాంబాబు క్రీడలను ప్రారంభించి మాట్లాడుతూ అటవీ శాఖ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం జాతీయ స్థాయిలో క్రీడా పోటీలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అందులో భాగంగానే జాతీయస్థాయిలో క్రీడలలో పాల్గొనేందుకు క్రీడాకారులు ఎంపిక చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడడంతో పాటు స్నేహభావాన్ని పెంపొందిస్తాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సునీల్ హీరావత్, రాజశేఖర్ రెడ్డి, నాగభూషణం, మీసాల రాములు, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

## ఒడిశా నుండి తుర్కపల్లికి గంజాయి సరఫరా



ప్రజాపక్షం/తుర్కపల్లి : ఒడిశా నుండి తుర్కపల్లి మండలానికి గంజాయి రవాణా గుట్టుచప్పుడు కాకుండా జరుగుతుందని పకడ్బందీ సమాచారం మేరకు గంజాయి సరఫరా నిందితులు పట్టుబడిన సంఘటన యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సాయంత్రం సమయంలో ఇద్దరు వ్యక్తులు ఆటో టాటా ఏస్ వాహనంలో అక్రమంగా గంజాయిని కలిగి ఉన్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు తుర్కపల్లి ఎస్ఐ తక్యుద్దీన్ తన సిబ్బందితో కలిసి తుర్కపల్లి మండలంలోని ములకలపల్లి గ్రామ శివారులోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ వద్ద టాటా ఏస్ వాహనాన్ని TS08UB6841 ఆపి తనిఖీ చేయగా బ్రౌన్ టేప్ చేసిన రెండు కవర్లలో సుమారు1.460 కిలోల గంజాయి పట్టుబడిందని పోలీసులు తెలిపారు. నిందితులు ఒడిశా రాష్ట్రం నుండి రైలులో కాగేష్ అనే వ్యక్తి నుండి గంజాయిని సేకరించి అమ్ముతున్నారని తెలిపారు. నిందితులు A1మడావత్ చరణ్ నాయక్, A2 గూగులోతు తరుణ్ నాయక్ ఇద్దరిది తుర్కపల్లి మండలం బిల్యా నాయక్ తండ అని వారి వద్దనుంది1.460 కిలోల గంజాయి, టాటా ఏస్ వాహనం, రెండు మొబైలు ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. యాదాద్రి భువనగిరి జోన్ డీసీపీ ఐపీఎస్, అక్షాంశ్ యాదవ్,ఎసిపి పి శ్రీనివాస్ నాయుడు, పర్యవేక్షణలో తుర్కపల్లి ఎస్సై మహమ్మద్ తక్యుద్దీన్ పాల్గొన్నారు.

## ప్రమాదవశాత్తు రైలు నుంచి జారి కిందపడి వ్యక్తి మృతి



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : సుమారు 50సంవత్సరాల వయస్సు గల ఓ వ్యక్తి రైల్లో ప్రయాణిస్తూ నల్లగొండ, రాయనిగూడ రైల్వే స్టేషన్ల మధ్య ప్రమాదవశాత్తు జారీ కిందపడి మృతి చెందాడని ప్రభుత్వ రైల్వే పోలీస్ స్టేషన్ ఎస్ఐ బొడిగె రామకృష్ణ తెలిపారు. మృతుడు సికింద్రాబాద్ నుండి పార్వతిపురం మన్యం జిల్లా రైల్వే స్టేషన్ వరకు తీసుకున్న రైల్వే ప్రయాణపు జనరల్ టికెట్ ఉన్నదని మిగతా ఎలాంటి ఆధారాలు మృతుని వద్ద లభించలేదని తెలిపారు .దీనిపైన నల్లగొండ రైల్వే స్టేషన్ స్టేషన్ స్టేషన్ మాస్టర్ సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని మృతుని గురించి ఏమైనా ఆచూకీ తెలిస్తే ప్రభుత్వ రైల్వే పోలీస్ స్టేషన్ ఎస్ఐ ఫోన్ నెంబర్ 8712658595 కు సమాచారం ఇవ్వాలని కోరారు.

## సిజెఐపై దాడి పట్ల ఖండన



ప్రజాపక్షం/ మిర్యాలగూడ: సీజేఐ గవాయ్‌పై జరిగిన దాడి భారత సర్వోన్నత న్యాయస్థానంపై, రాజ్యాంగంపైన, ప్రజాస్వామ్యంపైన జరిగిన దాడిగా పరిగణించాలని జన విజ్ఞాన వేదిక జాతీయ కన్వీనర్ డాక్టర్ ముప్వా రామారావు అన్నారు. గురువారం పట్టణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సీజేఐపై కోర్టులో దాడి జరిగితే సామాన్య మానవుని పరిస్థితి ఏంటో ప్రతి ఒక్కరు అర్థం చేసుకోవాలన్నారు. అదేవిధంగా విద్యా వికాస వేదిక కన్వీనర్ కస్తూరి ప్రభాకర్ మాట్లాడుతూ అత్యున్నత న్యాయస్థానంలో సీజేపై దాడి సరైంది కాదన్నార. విద్యావంతుల వేది రాష్ట్ర అధ్యక్షుడు అంబటి నాగయ్య మాట్లాడుతూ వందేళ్ల సనాతన ధర్మం పేరుతో సీజేపై దాడి భారత ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసినట్లయిందన్నారు. భారత రాజ్యాంగాన్ని, భావ ప్రకటన స్వేచ్ఛను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్, భారత బచావో జిల్లా అధ్యక్షురాలు ఉదయ, కేవీపీఎస్ నాయకులు పరుశురాములు, జేవీవీ జిల్లా అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, డాక్టర్ రాజు, కందుకూరి సుదర్శన్, రవినాయక్, హరికృష్ణ, తరి ఎల్లయ్య, ఎంసీపీ ఐటీయూ నాయకులు కాశీ, కిరణ్మయి, దశరదనాయక్,రాజారత్నం, కోల సైదులు, స్వామి, మోహన్‌రావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## బహిరంగ వేలం

ప్రజాపక్షం/నలగొండ టౌన్: పట్టణ పరిధిలోని పానగల్ లో గల శ్రీ ఛాయా సోమేశ్వర స్వామి దేవస్థానం సహాయ కమిషనర్, దేవాదాయ శాఖ, అనుమతితో ఈనెల 17న దేవాలయ ప్రాంగణములో లడ్డు, పులిహోర ప్రసాదములు అమ్ముకొను హక్కుకై బహిరంగ వేలం ద్వారా ఇచ్చుటకు నిర్ణయించుట జరిగిందని కార్యనిర్వహణాధికారి, అర్చకులు రాపోలు బాలకృష్ణ తెలిపారు. ఈ విషయాన్ని సమస్త భక్తజనులందరికి తెలియజేస్తున్నామని పూర్తి వివరాల కోసం దేవాలయములో సంప్రదించాలని కోరారు.

# ప్రజల కోసం సిపిఐ ఉద్యమాలు

### సిపిఐ యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి



ప్రజాపక్షం/భువనగిరి రూరల్ : స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు జరిగిన నిత్యం ప్రజల కోసం పోరాటాలు ఉద్యమాలు నిర్వహించే ప్రజల గొంతుకగా నిలుస్తున్న సిపిఐ అభ్యర్థులను గెలిపించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం సిపిఐ జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సమావేశం ఉప్పల ముత్యాలు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా యానాల దామోదర్ రెడ్డి మాట్లాడుతూ అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల నుండి కాంగ్రెస్తో ఈ రాష్ట్రంలో అవగాహనతో ఉన్న నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికలలో కూడా కలిసి పనిచేయడానికి సిపిఐ సిద్ధంగా ఉందన్నారు. సిపిఐకి బలం ఉన్నచోట్ల జడ్పీటీసీలుగా, ఎంపీటీసీలుగా, సర్పంచులుగా, వార్డు మెంబర్లుగా పోటీ చేసే స్థానాలకు సీట్ల సర్దుబాటు చేసుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. కాంగ్రెస్తో పాటు సిపిఎం ఇతర వామపక్ష పార్టీలతో కలిసి స్థానిక సంస్థల ఎన్నికల్లో ముందుకు వెళ్తామని ఆయన అన్నారు. భారత ప్రధాన న్యాయమూర్తి బిఆర్ గవాయ్ పై జరిగిన దాడి ప్రజాస్వామ్య పునాదులపై జరిగిన దాడి అని, ఈ దాడిని భారతీయ సమాజం ముక్తకంఠంతో కండించాలని కోరారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి దేశ న్యాయవ్యవస్థకు ప్రతీక అని, ఆయనపై దాడి చేయడం అంటే ప్రజాస్వామ్య పునాదులపై దాడి చేయడమేనని అన్నారు. దాడికి పాల్పడిన న్యాయవాది రాకేష్ కిషోర్‌ను కఠినంగా శిక్షించాలని అయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శులు బోలగాని సత్యనారాయణ, చెడ చంద్రయ్య, రాష్ట్ర సమితి సభ్యులు గోద శ్రీరాములు, జిల్లా కార్యవర్గ సభ్యులు కొల్లూరి రాజయ్య, బండి జంగమ్మ, కళ్లెం కృష్ణ, ఎండి.ఇమ్రాన్, చెక్క వెంకటేష్, ఏశాల అశోక్, చిగుర్ల లింగం పెరబోయిన మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

### స్థానిక సంస్థల్లో పోటీకి సన్నద్ధమవ్వాలి పల్లా నర్సింహరెడ్డి

ప్రజాపక్షం/డిండి: స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ శాఖలు బలంగా ఉన్నటువంటి గ్రామాల్లో, గెలిచే స్థానాల్లో పోటీకి సిపిఐ శ్రేణులు సన్నద్ధమవ్వాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహా రెడ్డి అన్నారు. గురువారం సిపిఐ ప్రజా భవన్‌లో నిర్వహించిన డిండి మండల సిపిఐ కార్యవర్గ అత్యవసర సమావేశానికి ముఖ్య అతిథిగా సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహా రెడ్డి,జిల్లా కార్యవర్గ సభ్యులు తూం బుచ్చిరెడ్డి హాజరైనారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికలు ప్రస్తుతం బిసి రిజర్వేషన్లు 42 అమలు చేయాలనే అంశం కోర్టు పరిధిలో ఉండగా మళ్ళీ నాలుగు వారాలకు వాయిదా వేసినందున ఎన్నికలు ఎప్పుడొచ్చినా శ్రేణులు సిద్ధంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ బొడ్డుపల్లి వెంకటరమణ, మండల కార్యదర్శి శ్రీరామదాసు కనకాచారి, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎండి. మైనోద్దీన్, సిపిఐ మండల సహాయ కార్యదర్శులు బొల్లె శైలేష్, తిప్పర్తి విజేందర్ రెడ్డి,కార్యవర్గ సభ్యులు బొడ్డుపల్లి రవీంద్ర శర్మ,నూనె వెంకటేశ్వర్లు,ఎఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి నవీన్ పాల్గొన్నారు.



## నామినేషన్ల స్వీకరణకు నిబంధనలను పాటించాలి



ప్రజాపక్షం/నల్లగొండ: జిల్లాలో మొదటి విడత ఎంపిటిసి,జెడ్‌పిటిసి ఎన్నికల నామినేషన్ల ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా సాధారణ పరిశీలకురాలు కొర్ర లక్ష్మీ ఎంపీటీసీ, జడ్పిటిసి, గ్రామపంచాయతీ ఎన్నికల సందర్భంగా జిల్లా సాధారణ పరిశీలకురాలుగా రాష్ట్ర వేర్ హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్,అధికారి, కోర్ర లక్ష్మిని రాష్ట్ర ఎన్నికల సంఘం నియమించింది.ఈ మేరకు గురువారం ఆమె జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఇలా త్రిపాఠి తో సమావేశమై మొదటి విడత ఎన్నికలు జరగనున్న ఎంపిటిసి, జెడ్‌పిటిసి స్థానాల నామినేషన్ల నోటిఫికేషన్, నామినేషన్ల ఏర్పాట్లపై చర్చించారు. ఎంపిటిసి, జెడ్‌పిటిసి,గ్రామపంచాయతీ ఎన్నికల సందర్భంగా ఎన్నికల ప్రవర్తన నియమావళిని పక్కగా అమలు చేసేందుకు తీసుకున్న చర్యలు, పోలింగ్ కేంద్రాలలో మౌలిక సదుపాయాల కల్పన, తదితర వివరాలను జిల్లా కలెక్టర్ ను అడిగి తెలుసుకున్నారు.జిల్లాలో మొదటి విడతున నల్లగొండ, దేవరకొండ డివిజన్లలోని 18 మండలాలు, 196 ఎంపిటిసి, స్థానాలకు నోటిఫికేషన్ జారీ చేయడం జరిగిందని, నోటిఫికేషన్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసిందని, నామినేషన్ల స్వీకరణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, నామినేషన్ల సందర్భంగా పాటించవలసిన నియమ, నిబంధనలను ఇదివరకే రాజకీయ పార్టీల ప్రతినిధులకు తెలియజేయడం జరిగిందని తెలిపారు. ఇన్చార్జి డిఆర్ఓ,ఆర్‌డిఓ వై .అశోక్ రెడ్డి, గృహ నిర్మాణ శాఖ పీడి,స్థానిక సంస్థల ఎన్నికల శిక్షణ నోడల్ అధికారి రాజ్ కుమార్, జడ్‌పి సీఈవో శ్రీనివాసరావు, డిపిఓ వెంకయ్య, పరిశీలకుల నోడల్ ఆఫీసర్ పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి డాక్టర్ రమేష్ తదితరులు ఉన్నారు.

## ఓట్ చోర్‌తో అధికారంలోకి రావాలని బిజెపి ఆరాటం


### ఓటు చోర్ పై సంతకాల సేకరణను విజయవంతం చేయాలి: ఎమ్మెల్సీ శంకర్ నాయక్



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్: బిజెపి చేస్తున్న ఓటు చోర్ సంతకాల సేకరణ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులంతా పాల్గొని విజయవంతం చేయాలని డిసిసి అధ్యక్షుడు, ఎంఎల్‌సి కేతవత్ శంకర్ నాయక్ పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని 31వ వార్డులో ఓట్ చోర్ పై పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్మల మోహన్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డితో కలిసి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌సి శంకర్ నాయక్ మాట్లాడుతూ బిజెపి ఓట్ చోర్‌తో ఎన్నికలు జరిగే రాష్ట్రాలలో అధికారంలోకి రావాలని చూస్తుందని ధ్వజమెత్తారు. మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రంలో కూడా ఓట్ చోర్‌కు పాల్పడిందని విమర్శించారు. రాత్రికి రాత్రి 60 లక్షల ఓట్లు నమోదు చేసిందని ఆరోపించారు. దీనిని నిరసిస్తూ ఏఐసిసి అగ్ర నేత రాహుల్ గాంధీ పాదయాత్ర చేపట్టడం జరిగిందని తెలిపారు. ప్రతి గ్రామంలో 100కు పైగా సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించి రాష్ట్రపతికి, ఎన్నికల కమిషన్‌కు పంపించడం జరుగుతుందని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఈనెల 15 వరకు సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, పార్టీ శ్రేణులంతా ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మనిమద్దె సుమన్, పలువురు కాంగ్రెస్ పార్టీ మాజీ ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

### గంధం ఎత్తి ఉర్సు ఉత్సవాలు ప్రారంభం

కుల మతాలకు అతీతంగా నిర్వహించే హజరత్ సయ్యద్ లతీఫ్ షావలి దర్గా ఉత్సవాలు ప్రపంచ మానవాళికి ఆదర్శం అని ఎంఎల్‌సి శంకర్ నాయక్ అన్నారు. గురువారం హజరత్ సయ్యద్ లతీఫ్ షావలి దర్గా ఉర్సు ఉత్సవాల సందర్భంగా ఎంఎల్‌సి ముఖ్యఅతిథిగా హాజరై గంధం ఎత్తి ఉర్సు ఉత్సవాలను ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హజరత్ సయ్యద్ లతీఫ్ షావలి ఉర్సు ఉత్సవాలకు తెలంగాణ వ్యాప్తంగా భక్తులు తరలి వస్తారని మతసామరస్యానికి ప్రతిక గా ఉర్సు ఉత్సవాలు ఘనంగా జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గుమ్మల మోహన్ రెడ్డి జిల్లా అడిషనల్ ఎస్‌పి రమేష్, డిఎస్‌పి శివరాంరెడ్డి, వన్ టౌన్ సిఐ ఏమి రెడ్డి రాజశేఖర్ రెడ్డి,టూ టౌన్ సిఐ రాఘవరావు, ఎస్ఐ సైదులు పాల్గొన్నారు.



## గౌడ్స్ అభివృద్ధికి నిధులు కేటాయించాలి

ప్రజాపక్షం/ హాలియా: గౌడ్స్ సంక్షేమ అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం మరిన్ని నిధులు కేటాయించాలని జిల్లా గౌడ సంఘం అధ్యక్షులు కాకునూరి నారాయణ గౌడ్, మిర్యాలగూడ డివిజన్ గౌడ సంఘం అధ్యక్షులు గుండు శ్రీరాములు గౌడ్లు అన్నారు. గురువారం హాలియాలోని లక్ష్మీ నరసింహా ఫంక్షన్ హాలులో గౌడ సంఘం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రం లో గౌడ సంఘం సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం మరికొన్ని నిధులు కేటాయించి వారి అభ్యున్నతికి తోడ్పడాలని కోరారు. రానున్న మద్యం టెండర్లలో గౌడ్లకు ఇచ్చిన రెండు మద్యం దుకాణాలకు గౌడ్స్ మాత్రమే టెండర్లు వేయాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. హాలియా పరిధిలో ఉన్న నెంబర్ 122 కోట మైసమ్మ వద్ద ఒకటి, 127 వైన్స్ రిజర్వేషన్ కోటాలో గౌడ్లకు కేటాయించినట్లు చెప్పారు. గౌడ్లందరూ కలిసికట్టుగా ఒకే తాటిపై ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొమ్మనబోయిన రఘు గౌడ్, హనుమంతు గౌడ్, రమేష్ గౌడ్, నాగరాజుగౌడ్, నాగయ్య గౌడ్, జానయ్య గౌడ్, పెద్ద వెంకటయ్య గౌడ్, వెంకీ గౌడ్ పాల్గొన్నారు.

## ఘోర రోడ్డు ప్రమాదంలో హోంగార్డు ఉపేందర్ మృతి





ప్రజాపక్షం/ రామన్నపేట: మండలంలోని సిరిపురం గ్రామానికి చెందిన ఉపేందర్ చారి రామన్నపేట పోలీస్‌స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్నారు. రోజుమాదిరిగానే నైట్ వెహికిల్ చెకింగ్‌లో భాగంగా గురువారం ఉదయం 4.18 గంటలకు సుభాష్ సెంటర్ వద్ద ఉండి వాహనాలను తనిఖీ చేస్తుండగా ఒక లారీ ఆపకుండా అతనిపై దూసుకెళ్లడంతో ఉపేందర్ అక్కడికక్కడే మృతిచెందారు. మృతునికి ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఉపేందర్ తన ఉద్యోగాన్ని ఎంతో బాధ్యతాయుతంగా నిర్వర్తించేవాడని కుటుంబసభ్యులు, పలువురు కన్నీరుమున్నీరయ్యారు.
విధులు నిర్వహిస్తున్న హోంగార్డు ఉపేందర్ గురువారం ఉదయం రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న సీపీ సుధీర్ బాబు, రాచకొండ హోంగార్డు సంక్షేమం నుంచి రూ.10వేలను, భువనగిరి హెడ్ క్వార్టర్స్ తరుపున అడిషనల్ ఎస్పీ, ఆర్ఐ, ఆర్ఎస్ఐలు, హెచ్‌సీసీ, ఉమెన్ పీసీలు కలిసి రూ.4లక్షను అడిషనల్ ఎస్పీ వినోద్‌కుమార్, అడ్మిన్ ఆర్ఐ శ్రీనివాస్ హెడ్ క్వార్టర్స్ తరుపు వారి కుటుంబసభ్యులకు అందించారు. మృతిచెందిన హోంగార్డు ఉపేందర్ మృతదేహాన్ని ఎమ్మెల్యే వేముల వీరేశం సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించి అండగా ఉంటానని హామి ఇచ్చి రూ.20వేల ఆర్థిక సహాయాన్ని అందచేశారు. ఆయనతోపాటు సిరిపురం గ్రామశాఖ అధ్యక్షుడు సిరిగిరెడ్డి నర్సిరెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకులు జినుకల ప్రభాకర్, పూస బాలకిషన్, గోదాసు పృధ్వీరాజ్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు. రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కూరెళ్ల ఉపేందర్‌చారి మృతదేహాన్ని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ప్రభుత్వ ఆసుపత్రిలో సందర్శించి శ్రద్ధాంజలి ఘటించి కుటుంబసభ్యులను పరామర్శించారు. మృతిచెందిన ఉపేందర్‌చారి మృతదేహాన్ని సీపీఎం జిల్లా నాయకులు మేక అశోక్‌రెడ్డి సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబసభ్యులను పరామర్శించి, ఉపేందర్ కుటుంబాన్ని ప్రభుత్వం, పోలీసు శాఖ ఆదుకోవాలని కోరారు.



## ఆధిపత్యశక్తుల కుట్రలను తిప్పికొడతాం

ప్రజాపక్షం/నల్లగొండ టౌన్: ఈ దేశంలో ఈ రాష్ట్రంలో మేమెంతమందిమో మాకు అంత వాటా మా అణగారిన కులాల వర్గాలు అందరిదీ అదే బాట, జనాభా దామాషా ప్రాతిపదికన ఎస్‌సి,ఎస్‌టి,బిసిలకు రిజర్వేషన్లు కల్పించాలని ఈ దేశంలో వచ్చిన ఉద్యమాల ఫలితంగా కాంగ్రెస్ ప్రభుత్వం కామారెడ్డి బిసి డిక్లరేషన్ లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చిందని తెలంగాణ విద్యావంతుల వేదిక జిల్లా అధ్యక్షులు పందుల సైదులు, బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు అయితగోని జనార్ధన్ గౌడ్ అన్నారు.గురువారం స్థానిక పట్టణంలోని చౌరస్తా వద్ద ఉన్న పూలే విగ్రహం ముందు బిసిలకు 42శాతం రిజర్వేషన్ పట్ల ఆదిపత్య శక్తుల కుట్రలు నిరసిస్తూ బిసి విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రం లోపల బిసిలు చేసినటువంటి ఉద్యమాల ఫలితంగా తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీలో 42 శాతం రిజర్వేషన్‌పై రాష్ట్ర అసెంబ్లీ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపి గవర్నర్ వద్దకు పంపడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది జోగు నగేష్ ముదిరాజ్, కర్నాటి యాదగిరి గారు,మార్గం సతీష్ కుమార్,గడగోజు విజయకుమార్, చిన్నోజు రాజు,కన్నబోయిన రాజు యాదవ్ ,పొగాకు రవికుమార్ యాదవ్, శ్రీకాంత్ ,తరుణ్ యాదవ్ ,మహేష్ శివకుమార్ పాల్గొన్నారు.

## ప్లాస్టిక్‌తో పర్యావరణానికి ముప్పు




ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ : సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌తో పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని ప్రముఖ వ్యాపారవేత్త యామా ప్రభాకర్ తెలిపారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని బాలభవన్‌లో ప్లాస్టిక్ వాడకంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ క్లాత్ సంచులను పంపిణీ చేసి ఆయన మాట్లాడారు. ప్లాస్టిక్ వ్యర్థాలు సముద్రంలోని జీవరాసులకు హాని కల్గిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అనేక దేశాలు ఇప్పటికే ప్లాస్టిక్ సంచులు, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించాయని వివరించారు. ప్రపంచ వ్యాప్తంగా 9శాతం ప్లాస్టిక్ వ్యర్థాలను మాత్రమే రీసైకలింగ్ చేస్తున్నారన్నారు. చాలా వరకు ప్లాస్టిక్‌ను పూడ్చి పెట్టడం, కాల్చివేయడం చేయాలన్నారు. ప్రతి ఏటా దాదాపు 8 మిలియన్ టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు సముద్రంలోకి చేరుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఒక ప్లాస్టిక్ సంచి సగటున 12 నిమిషాలు ఉపయోగించబడుతుందని, కాని కుళ్లిపోవడానికి సుమారు 1000 సంవత్సరాలు పడుతుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారని చెప్పారు. 2050 నాటికి సముద్రంలో ప్లాస్టిక్ బరువు అన్ని చేపల బరువును మించిపోతుందన్నారు. బాధ్యత గల పౌరులు ఒకసారి ఉపయోగించే ప్లాస్టిక్‌లను తిరస్కరించాలని విజ్ఞప్తి చేశారు. పర్యావరణ అనుకూల ప్రత్యామ్నాయాలను ఎంచుకోవడం ద్వారా ప్లాస్టిక్ వినియోగం పూర్తిగా తగ్గిపోతుందన్నారు. ప్రతి ఒక్కరు పెండ్లిలకు, పుట్టినరోజు వేడుకలకు వచ్చిన వారికి చేతి సంచులను ఇవ్వడం వలన ఈ తరంతో పాటు వచ్చే తరాలను కాపాడుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి దేవరాజ్, బండి రాధాకృష్ణారెడ్డి, వీరు నాయుడు, అరుంధతి, విద్యార్థులు పాల్గొన్నారు.

## పెండింగ్‌లో ఉన్న బెస్ట్ అవైలబుల్ స్కీం నిధులు విడుదల చేయాలి



ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ : పెండింగ్‌లో ఉన్న బెస్ట్ అవైలబుల్ స్కీం రూ. 200 కోట్లు నిధులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని వివిధ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం ఎదుట బెస్ట్ అవైలబుల్ స్కూల్ విద్యార్థులు, తల్లిదండ్రులు, పిడిఎస్‌యు, కెవిపిఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు పుల్లూరి సింహాద్రి, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి కోట గోపిలు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ గత ఆరు రోజులుగా మూతపడ్డాయన్నారు. ఈ పాఠశాలల్లో చదువుతున్న బిఎస్ ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులు విద్యాబోధన ఆగిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలోని దాదాపు 1400 మంది విద్యార్థులు చదువులకు దూరమయ్యారన్నారు. గత మూడు సంవత్సరాలుగా చెల్లించకపోవడంతో ఈ పాఠశాలల మేనేజ్‌మెంట్‌లు విద్యార్థులను పాఠశాల నుంచి బయటికి పంపించడంతోని విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు అందించాల్సిన రియంబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలని తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. వెంటనే చెల్లించకపోతే ఉద్యమాలను తీవ్ర తరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, పిడిఎస్‌యు, కెవిపిఎస్ నాయకులు పిడమర్తి భరత్, లెనిన్ పాల్గొన్నారు.



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## ఇసిఐకి చిదంబరం ప్రశ్నల వర్షం

**న్యూఢిల్లీ:**బిహార్‌లో ఓటర్ల జాబితాల ప్రత్యేక ఇంటెన్సివ్ సవరణపై కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పి. చిదంబరం ఎన్నికల సంఘానికి ప్రశ్నలు సంధించారు. రాష్ట్ర వయోజన జనాభాలో ఎంత శాతం ఓటర్లు జాబితాలో చేరారని, నకిలీ ఎంట్రీల సంఖ్య దాదాపు 5.2 లక్షలు ఉందా ప్రశ్నించారు. ఎన్నికల కమిషన్ తప్పు చేసినట్లు తాను రోపించడం లేదని, కానీ బీహార్ ఓటర్ల జాబితాలోని కింది ప్రశ్నలకు సమాధానాలు పొందే హక్కు భారత ప్రజలకు, బిహార్ ఓటర్లకు ఉందన్నారు. బిహార్ వయోజన జనాభా అంచనా ఎంత, బీహార్ ఓటర్ల జాబితాలో వయోజన జనాభాలో ఎంత నిష్పత్తి చేర్చబడింది, అది 90.7 శాతం కాదా అని చిదంబరం నిలదీశారు. మిగిలిన 9.3 శాతం వయోజన జనాభా సంగతేంటి? వారిని ఓటర్ల జాబితాలో ఎందుకు చేర్చలేదు?ఓటర్లజాబితాలోఎన్ని పేర్లు అర్థరహితంగా ఉన్నాయి? ఆ సంఖ్య దాదాపు 24,000 ఉందా? ఓటర్ల జాబితాలో ఎన్ని ఇళ్ల సంఖ్యలు ఖాళీగా ఉన్నాయా లేదా స్పష్టంగా చెల్లనివిగా ఉన్నాయా? ఆ సంఖ్య 2,00,000 కంటే ఎక్కువగా ఉందా?అని చిదంబరం ఎక్స్‌లో ప్రశ్నించారు. ఓటర్ల జాబితాలో ఎన్నిపేర్లుచేర్చబడ్డాయి ఆ సంఖ్య డబుల్ లేదా డూప్లికేట్ ఎంట్రీలుగా ఉందా అంటూ ఆ సంఖ్య దాదాపు 5,20,000 అని ఆయన అన్నారు.



స్టార్‌మర్‌తో చర్చల్లో మోదీ ఉద్ఘాటన

### ప్రపంచ అస్థిరత మధ్య

# భారత్—బ్రిటన్ భాగస్వామ్యం కీలకం

**ముంబై:** ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అస్థిరత, అనిశ్చితి మధ్య భారత్—బ్రిటన్ దేశాల వాణిజ్య భాగస్వామ్యం ఒక ముఖ్యమైన మూలస్తంభం అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. భారత్‌లో పర్యటిస్తున్న బ్రిటన్ ప్రధాన మంత్రి కీర్ స్టార్‌మర్‌తో గురువారం ముంబైలో విస్తారమైన అంశాలపై సంభాషణలు జరిపారు. కీలకమైన ఖనిజవనరులపై సహకారానికి ఒక సరఫరా వ్యవస్థ, ఒక ఇండస్ట్రియల్ గిల్డ్‌ను కూడా ఏర్పాటు చేయాలని, స్థిరమైన అభివృద్ధి లక్షాలకు కట్టుబడి ఉండాలని, వాతావరణం, ఇంధనం వంటి కీలకరంగాలలో రెండు దేశాల మధ్యా సహకారం చాలా అవసరమని రెండు దేశాలూ నిర్ణయించాయి. ఈ సందర్భంగా పశ్చిమాసియాలో పరిస్థితులు, ఉక్రేన్‌లో యుద్ధం గురించి కూడా నాయులిద్దరూ చర్చించారు. ఉక్రేన్‌లో చిరకాల శాంతి మాత్రమే కాకుండా ఇండో—పసిఫిక్ ప్రాంతంలో కూడా భద్రత, స్థిరత్వం చాలా అవసరం అని మోదీ అన్నారు.

ఇండో—పసిఫిక్ ప్రాంతంలో చాలా శక్తిమంతమైన భద్రతా సహకారం ఉండాలని వారిద్దరూ గట్టిగా నిర్ణయించుకున్నారు. ఇండో—పసిఫిక్ చొరవ సముద్రాల ఇనీషియేటివ్ కింద ఒక ప్రాంతీయ సముద్రతల భద్రతా కేంద్రాన్ని ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఉందని వారు అభిప్రాయపడ్డారు. రెండు దేశాల వైమానిక దళాల సిబ్బంది మధ్య శిక్షణా సహకారంపై కూడా వారిద్దరూ హర్షం ప్రకటించారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ, యావత్ ప్రపంచం అనిశ్చితిలో కొట్టుమిట్టాడుతున్న తరుణంలో భారత్—బ్రిటన్ వాణిజ్య భాగస్వామ్యం ప్రపంచ స్థిరత్వం, ఆర్థిక ప్రగతి అనే ముఖ్యమైన స్తంభంగా నిలబడిందన్నారు. నాయకులిద్దరి సమావేశం తర్వాత భారతదేశ సైన్యానికి బహుముఖంగా ఉపయోగపడే తేలికపాటి క్షిపణుల వ్యవస్థలను సరఫరా చేసే ప్రణాళికలను ప్రకటించారు. దీంతోపాటు భారతదేశ నావికాదళానికి ఉపయోగపడే సముద్రతల ఎలక్ట్రిక్ ప్రొపల్షన్ వ్యవస్థలను ఉమ్మడిగా అభివృద్ధి చేసే అంతర్—ప్రభుత్వ ఒప్పందాన్ని ఖరారు చేసే చర్యలను కూడా వారు ప్రకటించారు.దీనివల్ల భారతదేశ రక్షణ వ్యవస్థ మరింత బలోపేతం అవుతుంది. ప్రతినిధులస్థాయిలో కూడా ఈ చర్చలు జరిగాయి. గడచిన జులైనెలలో రెండు దేశాల మధ్యా చరిత్రాత్మకమైన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం జరిగింది. దీంతో సరికొత్తగా ఇంధన ప్రయోజనాలు కలుగుతాయి. రెండు దేశాలమధ్యా వాణిజ్య సంబంధాలు కూడా ఈ ఒప్పందంవల్ల విస్తరిస్తాయి. ''భారత్—బ్రిటన్ రెండూ సహజసిద్ధమైన భా గస్వామ్యదేశాలు , ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ, చట్ట నిబంధనలు వంటి ఉమ్మడి విలువల ఆధారంగా నిర్మితమయ్యాయి'' అని స్టార్‌మర్ సమక్షంలో మీడియాకు నరేంద్రమోదీ తెలియజేశారు. ''ఈనాడు ప్రపంచవాణిజ్యంలో అనిశ్చితి నెలకుని ఉంది, మన రెండు దేశాలమధ్యా వాణిజ్య భాగస్వామ్యం పెరుగుతోంది, ఆర్థిక ప్రగతికి ఇదే ఒక కీలకాంశం, భారతదేశ ఉద్ధృత కార్యకలాపాలు, ప్రగతి, బ్రిటన్ నైపుణ్యం రెండు కలిసి ఒక విభిన్న అసాధారణ ఫలితాలను సాధిస్తాయి, తద్వారా ద్వైపాక్షిక సంబంధాలు మరింత ద్విగుణీకృతమవుతాయి'' అని మోదీ చెప్పారు. వాతావరణ సాంకేతిక పరిజ్ఞానంపై కూడా ఒక అంకురసంస్థల నిధి ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. నవకల్పలకు, ఔత్సాహికవేత్తలకు ఇది దోహదపడుతుందన్నారు.

''మన భాగస్వామ్యం ఎంతో విశ్వసనీయమైనది, నైపుణ్యం, టెక్నాలజీ ప్రాతిపదికగా ఉంటుంది, ఈనాడు ప్రధానమంత్రి స్టార్‌మర్, నేను కలిసి ఈ వేదికపైన ఇక్కడ నిలబడ్డాం, రెండు దేశాల ప్రజలకు ఒక దివ్యమైన భవిష్యత్తును నిర్మించేందుకు చేయి చేయి కలిపి కలిసి పనిచేయాలనే కృతనిశ్చయం మా మధ్య ఉంది'' అని మోదీ అన్నారు.

#### మార్కెట్లు విస్తరించి ఉద్యోగాలు పెరుగుతాయి : స్టార్‌మర్

బ్రిటన్ ప్రధానమంత్రి స్టార్‌మర్ మాట్లాడుతూ, భారత్—బ్రిటన్ మధ్య సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందంపై సంతకాలు చేయడం ఒక బ్రహ్మాండమైన ముందంజగా అభివర్ణించారు. ఈ ఒప్పందంవల్ల రెండు దేశాల మార్కెట్లూ బ్రహ్మాండంగా పురోగమిస్తాయని చెప్పారు. మార్కెట్లు విస్తరిస్తే ఉద్యోగావకాశాలు కూడా బాగా పెరుగుతాయన్నారు. ''ఈరోజున మేం ఇద్దరం ముంబైలో కలుసుకున్నాం, భారత ఆర్థిక రాజధాని ముంబై, ఎందుకంటే భారత వృద్ధికథ ఎంతో కీలకమైనది, నరేంద్రమోదీ నాయకత్వాన్ని నేను అభినందిస్తున్నాను, 2028 నాటికి భారత దేశాన్ని ప్రపంచంలో మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ఆయన ముందుకు వెళుతున్నారు'' అన్నారు. వాణిజ్య ఒప్పందాన్ని ఉపయోగించుకోవడం, దాని పాలనావిధానం,వాణిజ్య పెట్టుబడుల భాగస్వామ్యాన్ని ముందుకు తీసుకువెళ్ళడానికి ఉద్దేశించిన ఉమ్మడి ఆర్థిక, వాణిజ్య కమిటీ (జెఇటిసిఓ)ను తిరిగి ఏర్పాటు చేయడంపట్ల నాయకులిద్దరూ హర్షం ప్రకటించారు.

## సీట్లు ఖరారు.. త్వరలో అభ్యర్థుల ప్రకటన

### బిహార్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజేష్ కుమార్



**పాట్నా :** బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పోటీ చేసే సీట్లను పార్టీ ఖరారు చేసిందని, ఇండియా కూటమి భాగస్వాముల నుంచి అనుమతి లభించిందని రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు రాజేష్ కుమార్ తెలిపారు. ఢిల్లీ నుండి తిరిగి వచ్చిన తర్వాత కుమార్ గురువారం పాట్నాలో జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీ కూడా అభ్యర్థుల జాబితాను ఆమోదించిందని, ఒకటి లేదా రెండు రోజుల్లో అధికారిక ప్రకటన వెలువడుతుందన్నారు. కూటమి భాగస్వాములతో చర్చల తర్వాత సీట్లను గుర్తించామని, తాము ప్రతిపాదించిన అభ్యర్థుల పేర్లను కేంద్ర ఎన్నికల కమిటీ ఆమోదించిందని బిపిసిసి చీఫ్ చెప్పారు. అయితే, మరిన్ని వివరాలను వెల్లడించడానికి ఆయన నిరాకరించారు. ఇండియా కూటమిలో కొంతమంది కొత్త అభ్యర్థులకు అవకాశం కల్పిస్తామని, ఈ ప్రక్రియ చివరి దశలో ఉందన్నారు. ఒకటి లేదా రెండు రోజుల్లో పూర్తి చేసి అధికారిక ప్రకటనతో ముందుకు వస్తామని చెప్పారు. కాగా, బిహార్‌లో ఇండియా కూటమికి ఆర్‌జెడి నాయకత్వం వహిస్తుంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో కలిసి పోటీ చేసిన మూడు వామపక్ష పార్టీలు సిపిఐ, సిపిఐ(ఎంఎల్) లిబరేషన్, సిపిఐ(ఎం)లు కూడా కూటమిలోనే ఉన్నాయి. గత సంవత్సరం లోక్‌సభ ఎన్నికల సమయంలో ప్రతిపక్ష సంకీర్ణంలో చేరిన మాజీ రాష్ట్ర మంత్రి ముఖేష్ సాహ్ని వికాస్‌శీల్ ఇన్సాన్ పార్టీ (విఐపి) కూడా ఈ కూటమిలో భాగస్వామిగా ఉంది. అదే విధంగా జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌కు చెందిన జెఎంఎం, మాజీ కేంద్ర మంత్రి పశుపతి కుమార్ పరాస్ నేతృత్వంలోని రాష్ట్రీయ లోక్ జనశక్తి పార్టీ (ఆర్‌జెఎల్‌పి)లను కూడా కలుపుతుందని భావిస్తున్నారు.

## 51 మంది అభ్యర్థులను ప్రకటించిన పికె జన్ సూరాజ్ పార్టీ



**పాట్నా :** బిహార్ అసెంబ్లీ ఎన్నికలకు జన్ సూరాజ్ పార్టీ గురువారం 51 మంది అభ్యర్థులతో కూడిన తొలి జాబితాను విడుదల చేసింది. అయితే పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిషోర్ ఎన్నికల్లో పోటీ చేస్తారా లేదా అనేది స్పష్టం చేయలేదు. గురువారం పాట్నాలో జరిగిన విలేకరుల సమావేశంలో పార్టీ జాతీయ అధ్యక్షుడు ఉదయ్ సింగ్ మాట్లాడుతూ కిషోర్ అక్టోబర్ 11న ఆర్‌జెడి నాయకుడు తేజస్వి యాదవ్ నియోజకవర్గం రాఘోపూర్ నుండి ప్రచారంలోకి దిగే అవకాశం ఉందని అన్నారు. త్వరలో ఇతర స్థానాలకు అభ్యర్థుల జాబితాను విడుదల చేస్తామని, జాబితాలో కిషోర్ జీ పేరు కనిపిస్తే, ఆయన పోటీ చేస్తున్నట్లేనన్నారు. కిషోర్ జీ 11న రాఘోపూర్ నుండి పార్టీ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభిస్తారని సింగ్ అన్నారు. పార్టీ ప్రకటించిన ప్రముఖ అభ్యర్థులలో కార్గహర్ అసెంబ్లీ స్థానం నుండి పోటీ చేయనున్న ప్రముఖ భోజ్‌పురి గాయకుడు రితేష్ రంజన్ పాండే, గోపాల్‌గంజ్‌లోని భోరే స్థానం నుండి పోటీ చేయనున్న థర్డ్ జెండర్ కమ్యూనిటీకి చెందిన ప్రీతి కిన్నార్ ఉన్నారు.

# బడా వ్యాపారులకే లోన్లు మాఫీనా?



### వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడిన బాధితులను పట్టించుకోరా..!

### కేంద్రంపై ప్రియాంకగాంధీ ధ్వజం

**న్యూఢిల్లీ :** కేరళలోని వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడిన బాధితుల రుణాలను మాఫీ చేయకపోవడంపై కాంగ్రెస్ ఎంపి ప్రియాంక గాంధీ వాద్రా కేంద్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పెద్ద వ్యాపారుల రుణాలను మాత్రం ఎలాంటి సందేహాలు లేకుండా మాఫీ చేస్తున్నారని విమర్శించారు. వయనాడ్ కొండచరియలు విరిగిపడిన బాధితుల రుణాలను మాఫీ చేయలేమని కేరళ హైకోర్టులో వెల్లడించిన కేంద్ర ప్రభుత్వం వైఖరిపై ప్రియాంక ఒక ప్రకటనలో స్పందించారు. బాధితులకు అవసరమైన సమయంలో కేంద్రం సాయం చేయడంపై విఫలమైనట్లుగా హైకోర్టు పరిశీలనతో తాను పూర్తిగా ఏకీభవిస్తున్నానని వయనాడ్‌కు చెందిన కాంగ్రెస్ ఎంపి చెప్పారు. 2024లో వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడిన బాధితులు పొందిన రుణాలను మాఫీ చేయడంలో కేంద్ర ప్రభుత్వం తన అధికారాలను వినియోగించుకోకపోవడంలో పూర్తుగా విఫలమైందని కేరళ హైకోర్టు బుధవారం తీవ్ర వ్యాఖ్యలు చేసింది. కేంద్రం వైఖరిని విభేదిసూ కేరళ అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడు విడి సతీశన్ ఇది తప్పుడు చర్యగా అభివర్ణించారు. కొండచరియలు విరిగిపడిన బాధితులకు అన్ని రకాల రుణాలు ఉన్నాయని, కానీ ఆదాయ వనరులు లేదా ఆస్తులు లేవని ఆయన అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లోనే రుణాలు మాఫీ చేయాల్సి వచ్చిందన్నారు. కేరళ అసెంబ్లీ గత సంవత్సరం కొండచరియ బాధితుల రుణాలను మాఫీ చేయాలని ఏకగ్రీవంగా తీర్మానం చేసిందని, ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం ఈ విషయంలో నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని ఆయన అన్నారు. అయితే, గుజరాత్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తర భారతదేశంలోని వివిధ రాష్ట్రాలతో పోలిస్తే కేరళ విషయంలో కేంద్రం భిన్నమైన వైఖరిని తీసుకుందని ఆయన పేర్కొన్నారు. ఇది కేంద్రం తప్పుడు వైఖరి అని ఆయన వాదించారు. హైకోర్టు పరిశీలనలు ఉన్నప్పటికీ, వయనాడ్ కొండచరియలు విరిగిపడిన బాధితులకు సహాయం చేయాలని కేంద్రాన్ని అభ్యర్థిస్తున్నామని ఆయన అన్నారు. గత సంవత్సరం జులై 30న ముందక్కై, చూరల్‌మల ప్రాంతాలలో పెద్ద ఎత్తున కొండచరియలు విరిగిపడి, రెండు ప్రాంతాలు దాదాపు పూర్తిగా నాశనమయ్యాయి. ఈ విపత్తు 200 మందికి పైగా ప్రాణాలను బలిగొంది. వందలాది మంది గాయపడ్డారు.

## 'ఎఐ'ని దుర్వినియోగం చేయొద్దు

### రాజకీయ పార్టీలకు ఎన్నికల సంఘం హెచ్చరిక

**న్యూఢిల్లీ :** బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో డీప్‌ఫేక్‌లను సృష్టించడానికి లేదా సమాచారాన్ని వక్రీకరించడానికి ఎఐ (ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్)ని దుర్వినియోగం చేయవద్దని ఎన్నికల కమిషన్ రాజకీయ పార్టీలను హెచ్చరించింది. పార్టీలు తమ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌ల ద్వారా లేదా ప్రకటనల రూపంలో ప్రచారం కోసం పంచుకునే ఎఐ జనరేటెడ్ లేదా సింథటిక్ కంటెంట్‌ను ప్రముఖంగా ప్రచురించాలన్న తమ సూచనలను ఒక ప్రకటనలో ఎన్నికల సంఘం గుర్తు చేసింది. ఒకవేల తమ వద్ద ఉన్న కంటెంట్ ఎఐ జనరేటెడ్, డిజిటిల్ లేదా సింథటిక్ అయితే పార్టీలు, స్టార్ క్యాంపెయినర్లు, అభ్యర్థులు ప్రముఖంగా ప్రకటించాలని స్పష్టం చేసింది. ఎన్నికల ప్రక్రియపై ప్రభావం పడకుండా ఉండేందుకు సోషల్ మీడియా పోస్ట్‌లపై కఠినమైన నిఘా పెట్టామని హెచ్చరించింది. ఎన్నికల ప్రక్రియ సమగ్రతను నిలబెట్టుకోవాల్సిన అవసరాన్ని ఈ సందర్భంగా నొక్కి చెప్పింది. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లపై సమాచారాన్ని వక్రీకరించే లేదా తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేసేందుకు ఎఐ ఆధారిత సాధనాలను దుర్వినియోగం చేయవద్దని ఎన్నికల కమిషన్ పార్టీలకు సూచించింది. తప్పుడు సమాచారం వ్యాప్తి చెందకుండా నిరోధించడానికి కృత్రిమ మేధస్సు దుర్వినియోగానికి వ్యతిరేకంగా పార్టీలకు ఇసి కొన్ని ఆదేశాలను జారీ చేసింది. బిహార్‌లో నవంబర్ 6, 11 తేదీల్లో రెండు దశల్లో ఎన్నికలు జరగనుండగా, నవంబరు 14న ఓట్ల లెక్కింపు జరుగుతుంది.

## 47 మంది భారత మత్స్యకారులు అరెస్టు

**కొలంబో :** శ్రీలంక ఉత్తర ప్రాంతంలోని తలైమన్నార్ వద్ద గురువారం 47 మంది భారతీయ మత్స్యకారులను అరెస్టు చేసి, వారి ఐదు ట్రాలర్లను స్వాధీనం చేసుకున్నట్లు నేవీ పేర్కొంది. మన్నార్, డెల్ఫ్ట్ సముద్ర ప్రాంతాలలో నిర్వహించిన సంయుక్త గస్తీ సందర్భంగా అరెస్టులు జరిగాయి. అరెస్టు అయిన 47 మంది మత్స్యకారులను, వారి పరికరాలను ఉత్తరంలోని ఫిషరీస్ ఇన్స్పెక్టరేట్‌కు అప్పగిస్తామని నేవీ తెలిపింది. వారిని అరెస్టు చేయడానికి నావల్ కమాండ్ బుధవారం రాత్రి ఆలస్యంగా ఆపరేషన్ ప్రారంభించగా, అది గురువారం తెల్లవారుజాము వరకు కొనసాగిందని నేవీ ప్రతినిధి కమాండర్ బుద్ధిక సంపత్ పిటిఐకి తెలిపారు. భారత—శ్రీలంక ద్వైపాక్షిక సంబంధాలలో మత్స్యకారుల సమస్య వివాదాస్పదంగా ఉంది. శ్రీలంక నేవీ సిబ్బంది పాల్క్ జలసంధిలో భారతీయ మత్స్యకారులపై కాల్పులు జరిపి, శ్రీలంక ప్రాదేశిక జలాల్లోకి అక్రమంగా ప్రవేశించారని ఆరోపించిన అనేక ఘటనలలో వారి పడవలను స్వాధీనం చేసుకున్నారు. గత నెలలో ఉత్తర శ్రీలంకలోని జాఫ్నా సమీపంలో 12 మంది భారతీయ మత్స్యకారులను అరెస్టు చేసి, వారి పడవను స్వాధీనం చేసుకున్నారు.

## మణిపూర్‌లో సాధారణ పరిస్థితులు రావాలి : కాన్రాడ్ సంగ్మా

**ఇంఫాల్:**మణిపూర్‌లో శాంతి, సాధారణ పరిస్థితులు తిరిగి వచ్చేలా చూడటం చాలా ముఖ్యమని మేఘాలయ ముఖ్యమంత్రి, ఎన్‌పిపి అధ్యక్షుడు కాన్రాడ్ సంగ్మా అన్నారు. మణిపూర్‌లో రెండు రోజుల పర్యటన కోసం ఇంఫాల్ విమానాశ్రయానికి చేరుకున్న సంగ్మా విలేకరులతో మాట్లాడారు. మనం అట్టడుగు వర్గాలు, ప్రజలతో అనుసంధానం అవ్వకపోతే ఎక్కడో ఒక విషయాన్ని కోల్పోతున్నామన్నారు. అందువల్ల ప్రజలను చేరుకోవడం, వారి గళాన్ని వినడమే తమ ఆలోచన అని అన్నారు. ప్రజలను చేరుకుని వారి గళాని విని, వారి సూచనలు తీసుకోవాలనుకుంటున్నామని చెప్పారు. పార్టీ నాయకులు, సంబంధిత వ్యక్తులు, వివిధ వర్గాలు (ప్రతినిధులు), మణిపూర్ ప్రజలను కలుస్తానని చెప్పారు. 60 మంది సభ్యుల మణిపూర్ అసెంబ్లీలో ఎన్‌పిపికి ఏడుగురు ఎమ్మెల్యేలు ఉన్నారు. మణిపూర్‌లో సాధారణ స్థితి తిరిగి రావాలని తాము కోరుకుంటున్నామని, ఆ సాధారణ పరిస్థితిలో ఒక భాగంమణిపూర్‌లోప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన ప్రభుత్వాన్ని చూడటం కూడా అని అన్నారు.

### జనవరి 2022కు ముందు ప్రక్రియ ప్రారంభమైతే...

# సరోగసీ చట్టం-2021 కింద 'వయోపరిమితి' వర్తించదు

### సుప్రీంకోర్టు స్పష్టీకరణ

### న్యాయమూర్తులు జస్టిస్ బి.వి.నాగరత్నం, కె.వి.విశ్వనాథన్ ధర్మాసనం తీర్పు



**న్యూఢిల్లీ :** జనవరి 25, 2022 నుండి చట్టం అమలులోకి వచ్చిన తర్వాత పిండాలను ఉద్దేశపూర్వకంగా ఫ్రీజింగ్ చేయ డం వంటి ప్రకియను ప్రారంభించిన జంటలకు 20 21 సరోగసీ చట్టం ప్రకారం వయోపరిమితులు వర్తించవని గురువారం సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. సరోగసీ చట్టం2021 ప్రారంభానికి ముందు ఉద్దేశించిన జంట పిండాలను సృష్టించే దశలో గామెట్‌లను ఘనీభవించే దశలో ఉంటే సరోగేట్ తల్లి గర్భాశయానికి పిండాలను బదిలీ చేసే దశలో ఉంటే వయోపరిమితి వర్తించదని అత్యున్నత న్యాయస్థానం తెలిపింది.ఉద్దేశించిన జంట సరోగేట్ గర్భధారణకు వయోపరిమితులను నిర్ణయించింది. చట్టం ప్రకా రం ఉద్దేశించిన తల్లి వయస్సు సర్టిఫికేషన్ రోజున 23 నుండి 50 సంవత్సరాల మధ్య ఉండాలి. ఉద్దేశించిన తండ్రి వయస్సు 26నుండి 55 సంవత్సరాల మధ్య ఉండాలి. మూడు జం టలు దాఖలు చేసిన పిటిషన్లపై న్యాయమూర్తులు జస్టిస్ బి.వి.నాగరత్నం, జస్టిస్ కె.వి.విశ్వనాథన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఈ తీర్పునిచ్చింది. చట్టం అమలులోకి రాకముందు అంటే జనవరి 25, 2022 నాటికి ఒక జంట సరోగసీ ప్రక్రియను ప్రారంభించి, పిండాలను సృష్టించే దశలో ఉండి బీజకణాల సంగ్రహణ తర్వాత ఘనీభవం చెంది ఉంటే, పిండాలను సరోగసీ తల్లి గర్భాశయానికి బదిలే చేసే దశలో ఉంటే..ఆ సందర్భంలో, వయోపరిమితి వర్తించదని ధర్మాసనం తన ఆదేశాలను వెలువరిస్తూ స్పష్టం చేసింది. వయోపరిమితి మునుపు వర్తించదని ధర్మాసనం తెలిపింది. జనవరి 25, 2022కి ముందు సరోగసీని పొందాలనుకునే జంటలకు వయోపరిమితులకు సంబంధించి ఎటువంటి కట్టుబడి ఉండే చట్టా లు లేవని బెంచ్ స్పష్టం చేసింది.'కాబట్టి చట్టం ప్రకా రం చట్టబద్ధమైన వయోపరిమితిన దాటిన జంటలు సరోగసీని పొందే హక్కు లేదా సరోగసీకి వారి అర్హత వారి వయస్సుపై షరతులతో కూడకున్నదని, అమలులో ఉన్న చట్టం ప్రకారం జంటలకు ఉచితంగా అందుబాటులో ఉంటుంది' అని ధర్మాసనం తెలిపింది. చట్టం కింద వయోపరిమితులను సూచించడంలో పార్లమెంట్ వివేకాన్ని కోర్టు ప్రశ్నించడం లేదని, దాని చెల్లుబాటు పై తీర్పు ఇవ్వడం లేదని సుప్రీంకోర్టు ద్విసభ్య ధర్మాసనం స్పష్టం చేసింది. 'మా ముందున్న కేసులు చట్టం అమలుకు ముందు సరోగసీ ప్రక్రియను ప్రారంభించిన జంటలకు మాత్రమే పరిమితం చేయబడ్డాయి. మేము మా పరిశీలనను వాటికే పరిమితం చేస్తు న్నాం' అని ధర్మాసనం స్పష్టం చేసింది. ఇదే విధంగా నియమించబడిన మరే ఇతర కోర్టుకూ వయోపరిమితికి సంబంధించి ఇలాంటి ఫిర్యాదు ఉంటే, చట్టం అమలుకు ముందు సరోగసీ ప్రక్రియను ప్రారంభిస్తే, వారు నేరుగా సుప్రీంకోర్టును సంప్రదించే బదులు అధికార పరిధిగల హైకోర్టును ఆశ్రయించవచ్చునని ధర్మాసనం సూచించింది. దీనిపై వివరణాత్మక తీర్పు కోసం వేచిచూడాల్సి ఉంది. భారతదేశంలో వాణిజ్య సరోగసీ నిషేధించబడినందున, దోపిడీని నిరోధించడానికి బలమైన వ్యవస్థ అవసరాన్ని గమనిస్తూ, అద్దె తల్లుల ప్రయోజనాలను కాపాడటానికి సంబంధించిన ప్రాముఖ్యత గురించి సుప్రీంకోర్టు గతంలో తెలిపింది.

## నోటిఫికేషన్‌పై స్టే

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వానికి ఇచ్చిందన్నారు. దేశంలో తొలిసారిగా తెలంగాణ ప్రభుత్వం బీసీల గణన చేసిందని, ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా చేయాలనే నిర్ణయానికి వచ్చిందన్నారు. జనాభా ప్రాతిపదికగా మొత్తం పరిస్థితులను బేరీజు వేశాక రాష్ట్రంలో బీసీలు 57.6 శాతం ఉన్నట్లుగా తేలిందన్నారు. రాష్ట్ర జనాభాలో రెండు శాతం మాత్రమే సర్వే పత్రాలను పూర్తి చేయలేదన్నారు. బీసీల పరిస్థితులపై కమిషన్ అధ్యయనం చేశాక ఆయా జిల్లాల్లోని పరిస్థితులకు అనుగుణంగా రిజర్వేషన్లను అమలు చేయాలనే వాదన తెలంగాణ రాష్ట్రానికి వర్తించదన్నారు. దాదాపుగా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా బీసీల సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులు ఒకే తరహాలో ఉన్నాయని, అందుకే రాష్ట్ర వ్యాప్తంగా బీసీలకు రిజర్వేషన్లను 25 శాతం నుంచి 42 శాతానికి పెంపుదల చేయాలనే నిర్ణయానికి ప్రభుత్వం వచ్చిందన్నారు. కమిషన్ నివేదిక ద్వారా రాష్ట్రంలో బీసీ జనాభా నిర్దిష్టంగా తేలిన తరువాత 42 శాతం స్థానిక సంస్థల ఎన్నికల్లో, విద్య, ఉపాధి రంగాల్లో రిజర్వేషన్లు కల్పించాలని కమిషన్ ప్రభుత్వానికి సిఫార్సు చేసిందన్నారు. కమిషన్ నివేదికను తొలుత మంత్రివర్గం, ఆ తర్వాత రాష్ట్ర శాసన సభ ఆమోదించాయన్నారు. అసెంబ్లీలో అన్ని పార్టీలకు చెందిన సభ్యులు బిల్లుకు ఏకగ్రీవంగా ఆమోదం చెప్పారన్నారు. బిల్లును ఆగస్టు 31న అసెంబ్లీ ఏకగ్రీవ తీర్మానం తర్వాత గవర్నర్‌కు నివేదిస్తే ఇప్పటి వరకు ఆమోదం లభించలేదన్నారు. అప్పటికే ప్రభుత్వం జారీ చేసిన ఆర్డినెన్స్‌ను కూడా గవర్నర్‌కు పంపితే నేటికీ ఆమోదం రాలేదన్నారు. బీసీ కమిషన్ రిపోర్టు అందుబాటులోనే ఉందన్నారు. నివేదికను శాసనసభ ఆమోదించాక గత మార్చి 30న గవర్నర్‌కు పంపితే ఇప్పటికీ ఆమోదం చెప్పలేదన్నారు. గత ప్రభుత్వంలో రిజర్వేషన్లు 50 శాతానికి మించరాదంటూ 285—ఎ చట్ట సవరణ చేస్తే దానికి గవర్నర్ ఆమోదించారన్నారు. ఎంత మేరకు రిజర్వేషన్లు ఉండాలో నిర్ధేశించకుండా రిజర్వేషన్ల వ్యతిరేక ధోరణితో 2018 డిసెంబర్ 15న ప్రభుత్వం తీర్మానం చేసిందన్నారు. ప్రభుత్వం గత జులై 10న ఆర్డినెన్స్ జారీ చేసి గవర్నర్‌కు నివేదిస్తే దానిని అదే నెల 26న గవర్నర్ రాష్ట్రపతికి పంపారన్నారు. ఇది కూడా పెండింగ్‌లోనే ఉందన్నారు. గత ఆగస్టు 31న అసెంబ్లీ తీర్మానం చేసిందని, దీనిని గవర్నర్‌కు పంపితే ఆమోదించడమో తిరస్కరించడమో చేయలేదన్నారు సెక్షన్ 284—ఎ ప్రకారం 50 శాతానికి మించి రిజర్వేషన్లు ఉండరాదన్న నిబంధనను ప్రభుత్వం సవరించిదానికి గవర్నర్ నుంచి అనుమతి లేదన్నారు. అయితే, తాజాగా తమిళనాడు కేసులో సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గవర్నర్‌కు పంపిన బిల్లులు లేదా ఆర్డినెన్స్‌లకు నిర్దిష్ట వ్యవధిలోగా ఆమోదించడమో, తిరస్కరించడమో చేయకపోతే అవి ఆమోదం పొందినట్లుగా పరిగణించాలన్న తీర్పు ఇక్కడ వర్తిస్తుందన్నారు. ఆటోమేటిక్‌గా గవర్నర్ ఆమోదించినట్లుగా ప్రభుత్వం పరిగణించిన తరువాతే స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుకు ప్రభుత్వం విధాన నిర్ణయం తీసుకుందన్నారు. గవర్నర్ ఆమోదించలేదు కాబట్టి ప్రభుత్వం విడిగా నోటిఫై చేయాల్సిన అవసరం లేదని హైకోర్టు అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. అయినా, ఇప్పటికే ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిందని, అది షెడ్యూల్ మాత్రమేనన్న పిటిషనర్ల వాదన వాస్తవం కాదని చెప్పారు. ఎన్నికల నోటిఫికేషన్ జారీ అయ్యాక కోర్టులు జోక్యం చేసుకోరాదని, ఇదే విషయాన్ని సుప్రీం కోర్టు పలు తీర్పులను వెలువరించిందని గుర్తు చేశారు. రాజ్యాంగంలోని 243 ఓ ప్రకారం ఎన్నికల నోటిఫికేషన్ వెలువడ్డాక ఎన్నికల ప్రక్రియలో కోర్టుల జోక్యానికి వీల్లేదన్నారు. పిటిషనర్లు జీవో 9ని మాత్రమే సవాల్ చేశారని, ఎన్నికల నోటిఫికేషన్‌ను సవాల్ చేయలేదని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో ఎన్నికల ప్రక్రియను యథాతథంగా కొనసాగాలని, ఎలాంటి మధ్యంతర స్టే ఆదేశాలు జారీ చేయవద్దని కోరారు.

**15 శాతం ఓసీలకు 50 శాతం సీట్లా..**

ప్రభుత్వం తరఫున సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాది రవి వర్మ కుమార్ వాదనలు వినిపిస్తూ, పెంచిన బీసీ రిజర్వేషన్లతో కలిపి మొత్తం రిజర్వేషన్లు 67 శాతానికి చెరడం వల్ల ఎవరికీ ఎలాంటి నష్టం జరగదన్నారు. రాష్ట్రంలో ఎస్టీలు 10.43 శాతం, ఎస్సీలు 17.42 శాతం, బీసీలు 57.6 శాతం చొప్పున ఉన్న జనాభా రిజర్వేషన్ల మొత్తం 50 శాతానికి మించరాదనే వాదన అన్యాయమన్నారు. ఈ మూడు వర్గాల జనాభాకు 67 శాతం రిజర్వేషన్లు అమలు చేశాక మిగిలిన 33 శాతం పదవులను కేవలం 15 శాతం ఉన్న ఉన్నత కులాలకు దక్కడం అనేది కూడా అన్యాయమేనన్నారు.

**స్టే ఇవ్వండి—పిటిషనర్ల వాదన**

పిటిషనర్ల తరపు సీనియర్ న్యాయవాదులు మయూర్‌రెడ్డి, జె.ప్రభాకర్, కె. వివేక్‌రెడ్డి ఇతరులు వాదనలు వినిపిస్తూ.. పంచాయతీరాజ్ చట్ట నిబంధనలను ఉల్లంఘిస్తూ ఆ శాఖ కార్యదర్శి జీవో 9ని జారీ చేయడంతో మొత్తం రిజర్వేషన్లు 67 శాతానికి చేరిందన్నారు. ఇది రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన సొంత చట్టానికి, సుప్రీం కోర్టు తీర్పునకు విరుద్ధమన్నారు. కోర్టు తీర్పుల ప్రకారం రిజర్వేషన్లు 50 శాతానికి మించరాదన్నారు. షెడ్యూలు ప్రాంతాల్లో ఎస్టీలకు రిజర్వేషన్లను పెంచవచ్చని మినహాయింపు ఇచ్చిందని, ఆపరిస్థితులు తెలంగాణలో లేవన్నారు. మహారాష్ట్ర రిజర్వేషన్లు కల్పించినపుడు కృష్ణమూర్తి కేసులో చెప్పినట్లుగా ట్రిపుల్ టెస్ట్ చేయకపోవడాన్ని సుప్రీం కోర్టు ఆక్షేపించిందన్నారు. రిజర్వేషన్లు 50 శాతం దాటినట్లయతే రాష్ట్ర ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ వెలువరించకూడదన్నారు. ఇరుపక్షాల వాదనల అనంతరం హైకోర్టు, జీవో 9, అందుకు అనుగుణంగా వెలువడిన ఎన్నికల నోటిఫికేషన్ల అమలును నిలిపివేస్తూ స్టే ఆదేశాలిచ్చింది. ప్రభుత్వానికి, రాష్ట్ర ఎన్నికల సంఘానికి నోటీసులు ఇచ్చింది. తదుపరి విచారణను ఆరు వారాలకు వాయిదా వేసింది.

## ఒంటరిగానే పోటీ చేస్తాం

### పొత్తులకు ఎలాంటి తావులేదు : మాయావతి

**లక్నో :**ఉత్తరప్రదేశ్‌లో రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బిఎస్‌పి ఒంటరిగానే పోటీ చేస్తుందని, ఎలాంటి పొత్తులకు తావు లేదని ఆ పార్టీ అధినేత్రి మాయావతి స్పష్టం చేశారు. లక్నోలో గురువారం జరిగిన ఒక ర్యాలీలో ఆమె ప్రసంగించారు. గతంలో పొత్తులు భాగస్వామ్య పార్టీలకు మాత్రమే సహాయపడ్డాయని, బిఎస్‌పి సొంత ఓటు స్థావరానికి పరస్పర మద్దతు లభించలేదని మాయావతి అన్నారు. తన అనుభవం మేరకు ఇప్పటివరకు కూటమిలో భాగస్వామిగా ఉండి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసినప్పుడల్లా ముఖ్యంగా ఉత్తరప్రదేశ్‌లో ఎటువంటి గణనీయమైన ప్రయోజనం పొందలేదని స్పష్టం చేయాలనుకుంటున్నానన్నారు.తమ పార్టీ ఓట్లు కూటమి భాగస్వామికి ఏకపక్షంగా బదిలీ అవుతాయని, కానీ వారి కులతత్వ మనస్తత్వం కారణంగా అగ్ర కులాల ఓట్లు బిఎస్‌పి అభ్యర్థులకు బదిలీ కావన్నారు. దీని ఫలితంగా తమ అభ్యర్థులు తక్కువ సీట్లు గెలుస్తారని, ఓట్ల వాటా తగ్గుతుందన్నారు. బిఎస్‌పి భాగస్వామిగా ఉన్న సంకీర్ణ ప్రభుత్వాలు తమ పూర్తి పదవీకాలం ఎప్పుడూ కొనసాగలేదని మాయావతి గుర్తు చేశారు. తాము (యుపిలో) సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినప్పుడల్లా, అది దాని పదవీకాలం పూర్తి కాకముందే కూలిపోయిందని, పొత్తుల ద్వారా ఎన్నికల్లో పోటీ చేసినప్పుడు, తమ ఓట్ల శాతం తగ్గుతుందని వాపోయారు. చారిత్రక ఉదాహరణలను ఉటంకిస్తూ, మాయావతి గత పొత్తులు, వాటి ఫలితాలను గుర్తు చేశారు. 1993లో, బిఎస్‌పి సమాజ్ వాదీ పార్టీతో పొత్తు పెట్టుకుని అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసినప్పుడు, తాము కేవలం 67 సీట్లు మాత్రమే గెలుచుకున్నామని, మళ్ళీ 1996లో కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకున్నప్పుడు కేవలం 67 సీట్లు మాత్రమే గెలుచుకున్నామన్నారు. 2002లో ఒంటరిగా పోటీ చేయాలని నిర్ణయించుకున్నప్పుడుపార్టీఅదృష్టంమెరుగుపడిందన్నారు. 2002లో ఒంటరిగా అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసినప్పుడు, బిఎస్‌పి దాదాపు 100 సీట్లు గెలుచుకుందని, సకాలంలో పార్టీ గుర్తును పొందలేకపోయిన ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులు కూడా ఉన్నారన్నారు. ప్రదర్శన పార్టీ కార్యకర్తల మనోధైర్యాన్ని పెంచిందన్నారు.

ప్రజాపక్షం
శుక్రవారం, 10 అక్టోబరు

## ఆర్టీసీపై తిరోగమన నిర్ణయాలు

రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది సమయంలోనే తీసుకున్న సానుకూల ప్రజారంజక నిర్ణయాలు ప్రజలపై భారాలను తగ్గించాయి. వాటిలో తెలంగాణ రాష్ట్ర రహదారి రవాణ సంస్థ(టిజిఆర్టిసి) బస్సుల్లో ఉచిత ప్రయాణం ముఖ్యమైనది. మహాలక్ష్మి పేరు పెట్టిన ఈ పథకం ద్వారా మహిళలు ఎక్స్ప్రెస్ సహా దిగువన ఉండే అన్ని రకాల బస్సులలో పైసా ఖర్చు లేకుండా రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడికైనా వెళ్ళొచ్చు. ఇది అనతికాలంలోనే రాష్ట్ర ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావడమే కాక, గత ప్రభుత్వం ప్రైవేటీకరణ బాట పట్టించేందుకు సిద్ధం చేసిన ఆర్టిసికి ఆర్థిక ఊతం లభింపజేసింది కూడా. తెలంగాణ సగటు కుటుంబ ఖర్చు సైతం తగ్గినట్లు జాతీయ స్థాయి సర్వేలో వెల్లడైంది. ఇప్పటి వరకు సుమారు రూ.7వేల కోట్ల మేర మహిళలకు ప్రయాణ ఖర్చులు ఆదా అవ్వగా, ఆర్టిసికి ఆదాయం సమకూరింది.

ఆర్టిసి విషయంలో ఇటీవల తీసుకున్న రెండు నిర్ణయాలు ప్రజలకు, సంస్థకు ప్రయోజనకారిగా లేవు. అందులో ఒకటి సిటీ బస్సు చార్జీల పెంపు, మరొకటి విజయవంతమైన ఆర్టిసి కార్గో సేవలు ప్రైవేటుకు అప్పగింత. హైదరాబాద్, సికిందరాబాద్‌లో ప్రయాణించే సిటీ బస్సు చార్జీల పెంపు సామాన్యుని జేబుపై భారాన్నే మోపుతున్నాయి. కనీస చార్జీని రూ.10 నుంచి రూ.15కు, నాలుగవ స్టేజీ నుంచి ప్రస్తుత టిక్కెట్ ధరకు రూ.10 అదనంగా పెంచారు. విద్యార్థుల బస్సు పాసులు సైతం అంతకుముందే భారీగా పెరిగాయి. ఎలక్ట్రిక్ బస్సులు నడుపుతున్నందన ఛార్జింగ్ స్టేషన్‌ల ఏర్పాటుకు బస్సు చార్జీలను సవరించినట్లు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చెబుతున్నారు. ఒక్కో ఛార్జింగ్ స్టేషన్‌కు రూ.10 కోట్లు అవుతుందంటున్న ప్రభుత్వానికి, ప్రజా రవాణా కోసం ఆ మాత్రం మౌలిక సదుపాయాలు కల్పించటం పెద్ద కష్టమేమీ కాదు. చార్జీల పెంపు నిర్ణయం ద్వారా ప్రజల్లో వ్యతిరేకతకు ప్రభుత్వమే అనవసరంగా అవకాశం ఇచ్చినట్లవుతుంది. దీనికి తోడు దసరా పండుగ సందర్భంగా స్పెషల్ సర్వీసుల పేరుతో 50 శాతం అదనంగా వసూలు చేయడాన్ని ప్రజలు మరిచిపోలేదు. ప్రజలపై భారం మోపకుండా, సంస్థను లాభాల బాట పట్టించేందుకు అనేక ఇతర మార్గాలు ఉన్నాయి. ముఖ్యంగా అవసరాలకు తగిన సంఖ్యలో బస్సులు లేకపోవడం ప్రధాన సమస్య. ఎలక్ట్రికల్ బస్సులు సమకూర్చుకుంటున్నప్పటికీ సరిపడ సంఖ్యలో లేవు.

మంచి పేరొచ్చిన ఆర్టిసి కార్గో సర్వీసును ప్రైవేటుకు అప్పగిస్తుండడం ఏ మాత్రం సబబు కాదు. ఏటా సుమారు రూ.100 కోట్ల రాబడి తీసుకువస్తున్న ఈ సేవలను గంపగుత్తగా ప్రైవేటు సంస్థకు అప్పగించేందుకు ఇటీవలే టెండర్ల ద్వారా ప్రైవేటు సంస్థకు పదేళ్ళ కోసం అప్పగించారు. ప్రస్తుతం వస్తున్న నికర లాభానికి అనుగుణంగా ఆర్టిసికి నెలకు రూ.3 కోట్లు చెల్లించాల్సి ఉంటుంది. అమిత జనాదరణ పొందిన ఈ పథకాన్ని డ్రైవర్లు, కండక్టర్లు ఆసక్తి ప్రదర్శించనందుకే ప్రైవేటుకు అప్పగిస్తుండటమనేది కుంటి సాకు మాత్రమే. ఈ సేవలను మరింత విస్తృత పరచడం ద్వారా ప్రైవేటు కార్గో, కొరియర్ సంస్థలకు దీటుగా విస్తరించి, లాభాలను పెంచుకునే అవకాశాలను వదిలేసుకుంది సంస్థ.

గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఆర్టిసి ఉద్యోగులపై ఉక్కుపాదం మోపి, 55 రోజుల సమ్మెను నిర్దాక్షిణ్యంగా అణిచి వేసిన అప్రదిష్టను మూటగట్టుకున్నది. సంస్థను ప్రైవేటీకరిస్తామని మునుపటి ప్రభుత్వాధినేత ఘీంకరించారు కూడా. నాటి సమ్మె సందర్భంగా రేవంత్ రెడ్డి కార్మికులకు సంఘీభావంగా ముఖ్యమంత్రి అధికార నివాసం ప్రగతిభవన్‌కున్న కట్టుదిట్టమైన పోలీసు వలయాలను ఛేదించుకొని, మోటార్ సైకిల్ మీద అక్కడకు చేరుకున్న విషయం ప్రజల స్మృతిపథంలో ఇప్పటికీ నిలిచే ఉంది. కాబట్టి, సంస్థకు, ప్రజలకు నష్టదాయకమైన తాజా నిర్ణయాలను ఉపసంహరించుకొని, ఆర్టిసి లాభాలను పెంచుకునేందుకు ఆర్టిసి కార్మిక సంఘాలు అనేక సంవత్సరాలుగా చేస్తున్న సూచనలను పరిగణలోకి తీసుకోవాలి. అన్నిటికంటే ముఖ్యంగా ఆర్టిసిలో గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించి కాంగ్రెస్ ప్రభుత్వం మాట నిలబెట్టుకోవాలి.

# రేవంత్ ఓటమికి పికె వ్యూహం ఫలించేనా?



ఎస్.కె. జకీర్

"టిఆర్ఎస్ పాలన బాగా లేదని ప్రజలు భావిస్తే మమ్మల్ని ఎవరూ కాపాడలేరు. టిఆర్ఎస్ పాలన బాగానే ఉంది, మరో ఒక టి, రెండు పనులు చేస్తే ఇంకా బాగుంటుంది అనుకుంటే, అప్పు డు సలహాలివ్వడానికి, చిన్న చిన్న కరెక్షన్లు చేసుకోవడానికి పికె సంస్థలు సహకరించగలవు" అని కెటిఆర్ రెండేండ్ల కిందట అన్నారు. "టిఆర్ఎస్, కాంగ్రెస్ అనే కాదు, ఏ పార్టీనైనా ఎవరూ ఎన్నికల్లో గెలిపించలేరు. వాళ్లే గెలవాలి. ఐప్యాక్ లాంటి సంస్థలు మనకు కొంత బలాన్ని చేకూర్చగలవు తప్పితే ఎన్నికల్లో గెలిపించలేవు" అని కెటిఆర్ వివరించారు.

ఏ రాజకీయ పార్టీ అయినా తన సొంత బలంతోనే ఎన్నికల్లో గెలుస్తుంది. 2014, 2018లలో వ్యూహకర్తలు ఎవరూ లేరు. కెసిఆర్‌ను మించిన వ్యూహకర్త లేదని పార్టీ శ్రేణుల నమ్మకం. మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో కొత్త తరానికి సామాజిక మాధ్యమాల ద్వారా సమాచారాన్ని చేరవేయడానికి ఐప్యాక్ లాంటి సంస్థలు సహకరిస్తాయి. ఆ దిశలో కొంత బలాన్ని చేకూర్చగలవు. అంతే తప్ప, ఎన్నికల్లో గెలుపు ఓటములు నిర్దేశించే స్థాయిలో ఏ వ్యూహకర్త లేదా సంస్థ ఒక పార్టీకి తోడ్పాటునివ్వలేవు. "ప్రస్తుత సమాజంలో 18 నుంచి 35 ఏళ్ల పిల్లలకు, సామాజిక మాధ్యమాలను ఎక్కువగా ఉపయోగిస్తున్న యువతరానికి మా పార్టీని దగ్గరగా తీసుకెళ్లడానికి, వారి మధ్య బలం పుంజుకోవడానికి, మా సిద్ధాంతాలను వారికి అర్థమయ్యేలా చెప్పడానికి కచ్చితంగా ఈ సంస్థల సహాయం అవసరం" అని 2023 ఎన్నికలకు ముందు బిబిసి ఇంటర్వ్యూలో కెటిఆర్ చెప్పారు.

ప్రశాంత్ కిషోర్ బిహార్ ముఖ్యమంత్రి కాగల అవకాశాలు లేవు. వివిధ రాష్ట్రాలలో పార్టీలను అధికారంలోకి తీసుకురావడానికి పని చేసే పికెకు సొంత రాష్ట్రంలో భవిష్యత్తు ఆశాజనకంగా లేనందున తిరిగి 'వ్యూహకర్త' అవతారం ఎత్తనున్నట్టు కనిపిస్తోంది. ఆయన ప్రకటనలే ఇందుకు సాక్ష్యం.

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఓడించేందుకు తాను హైదరాబాద్ వస్తానని శపథం చేశారు. ఈ శపథం వెనుక ఏ 'రాజకీయ శక్తి' ఉన్నదో అంచనా వేయడం కష్టం కాదు. ఆ 'రాజకీయశక్తి'కి ఎలాంటి మాయోపాయాలు అందించాలో మూడేండ్ల ముందు నుంచే పికె కసరత్తు చేస్తున్నట్టు బిహార్ రాజధాని పట్నా నుంచి సమాచారం అందుతోంది.

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా పికె టీమ్ ఒక రిపోర్టు రూపొందించనున్నట్టు తెలుస్తోంది. ఇందుకోసం తెలంగాణ వ్యాప్తంగా ఆ బృందం పర్యటించనుంది. కెసిఆర్ హయాంలోనే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ముమ్మరంగా జరిగాయని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు ప్రశాంత్ కిషోర్ టీమ్ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు తెలిసింది. తనకు తానే గొప్ప వ్యూహకర్తగా, రాజకీయ దురంధరుడుగా భావించే కెసిఆర్ తెలంగాణలో ఎలాగైనా హ్యాట్రిక్ కొట్టాలని లక్ష్యంతో ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్‌ను ఆశ్రయించడం ఒక వింత.

నాటి ముఖ్యమంత్రి కెసిఆర్‌తో ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో తెలంగాణ రాజకీయ పరిస్థితులపై చర్చించారు. గోవా లో ఎన్నికలు ముగియడంతో ఐప్యాక్ టీమ్ తెలంగాణ చేరుకున్న తర్వాత ప్రశాంత్ కిషోర్ టీమ్‌తో కలిసి పనిచేయనున్నట్టు కెసిఆర్ అప్పట్లో ప్రకటించిన సంగతి తెలిసిందే. ప్రశాంత్ కిషోర్ తో ఇటీవల కెసిఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కాంట్రాక్ట్ కుదుర్చుకున్నా రు. "కేవలం తెలంగాణ ఎన్నికలే కాదు.. జాతీయ రాజకీయాలపైనా పీకేతో కలిసి పనిచేస్తాం. దాంట్లో తప్పేమున్నది" అని కెసిఆర్ బహిరంగంగానే వ్యాఖ్యానించారు. చెప్పినట్టే చాలాసార్లు పికెతో, కెసిఆర్ చర్చలు జరిపారు. చివరకు పికెతో కెసిఆర్‌కు చెడింది. దీంతో ఆయన టిఆర్ఎస్‌కు గుడ్ బై చెప్పారు. ఇదంతా 2022 సెప్టెంబర్, అక్టోబర్ లలో జరిగిన సన్నివేశం.

తెలుగు రాష్ట్రాల రాజకీయాలతో ప్రశాంత్ కిషోర్‌కు సంబంధం ఉంది. 2019 ఎన్నికల్లో ఎపిలో జగన్ కోసం పనిచేశారు. 2024 లో చంద్రబాబు నాయుడు కోసం పనిచేశారు. తెలంగాణలో అనేక సర్వేలలో అప్పటి బిఆర్ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యేలపై వ్యతిరేకత ఉన్నట్టు ప్రశాంత్ కిషోర్ అప్పట్లో కెసిఆర్ కు తెలిపారని ప్రచారం జరిగింది. ఈ సమాచారంతో కెసిఆర్ విబేధించారని దాని వలన ఇరువురి మధ్య సంబంధాలు దెబ్బతిన్నవి. పికె చేయించిన సర్వేల్లో కెసిఆర్ వారసుడు కెటిఆర్‌కు రాజకీయ భవిష్యత్తు బాగా లేదని తేలినట్టు వార్తలు వైరల్ అయ్యాయి. ఈ సర్వేలపై అటు కెటిఆర్ కూడా సీరియస్ అయినట్టు ప్రచారం జరిగింది. దీంతో పికె టీం తెలంగాణ నుంచి మకాం మార్చేశారు. పికెతో కలిసి పనిచేసే విషయాన్ని బహిరంగంగా చెప్పిన కెసిఆర్, గ్యాప్ గురించి మాత్రం ఎప్పుడూ ప్రస్తావించలేదు. అటు పికె టీం కూడా టిఆర్ఎస్ కోసం తాము పనిచేయడం లేదని గానీ, చేస్తున్నామని గానీ చెప్పలేదు.

జన్ సురాజ్ పార్టీ అధినేతగా ప్రశాంత్ కిషోర్ బిహార్ ఎన్నికల్లో సత్తా చాటేందుకు రెడీ అవుతున్నారు. సరిగ్గా ఇదే టైమ్‌లో సిఎం రేవంత్ టార్గెట్‌గా వరుసగా ప్రకటనలు చేస్తున్నారు. రేవంత్‌కు గడచిన ఏడాది కాలంగా జాతీయ స్థాయిలోనూ ఎక్స్‌పోజర్ వచ్చింది. యువనాయకుడు కావడంతో ఆయన క్యాంపెయిన్ చేస్తే కాంగ్రెస్‌కు కొంతలో కొంతైన అడ్వాంటేజ్‌గా మారే ఛాన్స్ ఉందని కాంగ్రెస్ పార్టీ హైకమాండ్ భావిస్తోంది. అందుకే రేవంత్ టార్గెట్‌గా పీకే బాణాలు వదులుతున్నారని తెలుస్తోంది. ప్రశాంత్ కిశోర్ వ్యాఖ్యలు ప్రస్తుతం తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. పీకే ఓ ఇంగ్లీష్ ఛానల్‌తో మాట్లాడుతూ చేసిన వ్యాఖ్యలను బిఆర్ఎస్ సోషల్ మీడియా హైలెట్ చేస్తున్నది. పికె వ్యాఖ్యాల్ని తమకు అనుకూలంగా బిఆర్ఎస్ మలచుకుంటున్నది. త్వరలో జూబ్లీహిల్స్ ఉపఎన్నిక జరగనున్న నేపథ్యంలో ప్రశాంత్ కిశోర్ వ్యాఖ్యలు రాజకీయ వాతావరణాన్ని వేడెక్కిస్తున్నాయి.

రేవంత్‌ను ఓడిస్తానని పీకే సవాల్ చేస్తుండటంతో అది బిఆర్ఎస్ అస్త్రంగా మార్చుకుంటుంది. రేవంత్‌ను ఓడిస్తానంటున్నారంటే 2028 నాటికి కెసిఆర్ తో జతకట్టాలని పికె నిర్ణయించుకున్నట్టు తెలుస్తోంది. తెలంగాణలో బిఆర్ఎస్ ఇప్పుడు ప్రతిపక్షంలో ఉండటంతో పీకే సూచనల ప్రకారం నడుచుకోవచ్చన్న ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అధికారంలో ఉన్నప్పుడే పీకే వ్యూహాలను అమలుచేయాలనుకున్న కెసిఆర్, ప్రతిపక్షంలో ఉన్నవేళ ఆయన 'మాటలు' బుద్ధిగా వినవచ్చు.

ఒక ఒరలో రెండు కత్తులు ఇమడనట్లే, ఇద్దరు వ్యూహకర్తలు 'ఏకాభిప్రాయానికి' ఎలా వస్తారన్నది అందరికీ వచ్చే సందేహం. తాను చెప్పేది మిగతా వాళ్ళు వినాలన్నది 2014 నుంచి కెసిఆర్ పక్కాగా అనుసరిస్తున్న పంథా. తనకంటే మించిన వ్యూహకర్త లేదని భావించిన కారణంగానే పికెతో 'ఒడంబడిక' బెడిసికొట్టింది. కనీసం 30 నుంచి 40 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలను మార్చాలని ప్రశాంత్ కిషోర్, కెసిఆర్ కు సూచించారని అందుకు కెసిఆర్ ఒప్పుకోలేదని 2022 లో ప్రచారం సాగింది. "ఈ కొద్దిరోజుల్లో ఎలా వ్యూహాలు రచిస్తావో.. ఏం చేస్తావో అవన్నీ తెల్వదు గెలవాల్సిందే" ఇదొక్కటే పికెకు పదేపదే కెసిఆర్ చెప్పారు. 2023 నవంబర్ మొదటి వారానికే కాంగ్రెస్ విజయం వైపు దూసుకెళ్తోందని క్షేత్ర స్థాయిలో కెసిఆర్ నిర్వహించిన కొన్ని సర్వేల్లో తేలిపోయింది. పికెని హుటాహుటిన హైదరాబాద్‌కు రప్పించారు. మొదట కెసిఆర్ తర్వాత కెటిఆర్, హరీష్ రావు, కవిత కూడా ప్రత్యేకంగా పికెతో భేటీ అయ్యి పలు విషయాలు చర్చించారు. పికె ఊహించిన దానికన్నా భారీ ఆఫర్ చేయడంతో ఆయన పనిచేయడానికి ఒప్పుకున్నట్టు అప్పట్లో ఒక ప్రచారం నడిచింది. సాధారణంగా ఏ పార్టీకి పికె వ్యూహకర్తగా ఉంటారో ఆ పార్టీ అధికారంలోకి వచ్చిన రాష్ట్రాలే ఎక్కువ. దీంతో బిఆర్ఎస్ కూడా తమకు సేవలు అందించాలని పికెను కోరింది. అయితే ఆ మధ్య ఏం జరిగిందో తెలియదు ప్రశాంత్ కిశోర్ డ్రాప్ అయ్యారు.

2023 అసెంబ్లీ ఎన్నికలకు కొన్ని నెలల ముందు వరకు బిఆర్ఎస్ ముందంజలో ఉండింది. సోషల్ మీడియా, యూట్యూబ్ యాడ్స్, గూగుల్ యాడ్స్, డిజిటల్ యాడ్స్, పేపర్ యాడ్స్, టివి యాడ్స్, బిల్ బోర్డులు, హోర్డింగులు సహా ఏ మార్గాన్నీ విడిచిపెట్టలేదు. క్రికెట్ వరల్డ్ కప్ ఫైనల్స్ మ్యాచ్ సందర్భంగా హాట్‌స్టార్‌లోనూ యాడ్స్ గుప్పించారు. కెసిఆర్, కెటిఆర్,హరీశ్ రావు, కవిత స్టార్ క్యాంపెయినర్స్ గా బరిలోకి దిగారు. సమ్మేళనాలు, సభలు, గెట్ టుగెదర్స్ బాగా ఆర్గనైజ్ చేశారు. విపరీతంగా డబ్బు ఖర్చు చేశారు. తెలుగు మీడియా యావత్తూ కెసిఆర్ భజనకు పూనుకున్నది. వాళ్లతో పోల్చితే కాంగ్రెస్ పార్టీ ప్రచారకాండ బలహీనంగా కనిపించింది. రేవంత్ రెడ్డి రాష్ట్రమంతా చుట్టి వచ్చారు. ప్రజల్లో కెసిఆర్ కుటుంబం పైనా, బిఆర్ఎస్ పార్టీ పైనా పెల్లుబుకుతున్న వ్యతిరేకతను కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా మలచడంలో రేవంత్ సక్సెస్ అయ్యారు. ప్రజలు ముఖ్యమంత్రిగా కెసిఆర్‌కు ప్రత్యామ్నాయంగా రేవంత్ రెడ్డిని ఆమోదిస్తూ తీర్పునిచ్చారు.

నిజానికి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాతే ఫోన్ ట్యాపింగ్ కుట్ర బయటపడింది. "కెసిఆర్ హ్యాట్రిక్ సిఎం కావాలన్న సంకల్పంతోనే బిఆర్ఎస్ ప్రత్యర్థులందరి ఫోన్లు విన్నామని, రికార్డు చేశామని, కాంగ్రెస్, బిజెపి అభ్యర్థులకు డబ్బు చేరకుండా నిలువరించాము"ని ఈ కేసులోని నిందితులయిన పోలీసు అధికారులు 'సిట్' ఎదుట అంగీకరించినట్టుగా ప్రచారం జరుగుతోంది. అంటే తాము మళ్ళీ అధికారంలోకి రావడానికి ఎన్ని మాయోపాయాలు చేయాలో, ఎన్ని కుట్రలు చేయాలో .... అన్నీ పకడ్బందీగా చేసినా రేవంత్ రెడ్డి అత్యంత సాహసోపేతంగా, వీరోచితంగా ఛేదించి కాంగ్రెస్‌ను గెలిపించినట్లు అర్థం చేసుకోవాలి.

కాగా ప్రశాంత్ కిశోర్ తన పార్టీ 'జన్ సురాజ్' తరఫున బిహార్ ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. మూడేళ్లగా దీనికోసం ఆయన సన్నాహాలు చేసుకుంటున్నారు. బిహార్ బదలావ్ (బిహార్‌లో మార్పు) ఆయన నినాదం. "ఈ ఎన్నికల ఫలితాల్లో జన్ సురాజ్ అగ్రస్థానంలో ఉంటుంది లేదా అట్టడుగున ఉంటుంది. మధ్యేస్థాయిలో ఫలితాలు మాత్రం రావు"అని ప్రశాంత్ కిశోర్ వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి కావాలనే కోరిక ఆయనలో బలంగా ఉన్నది. అధికారంలోకి రావడమంటే ఉత్తర భారతదేశ రాజకీయాల్లో కొత్త చరిత్ర సృష్టించినట్లే. ఓ వ్యక్తి పార్టీని స్థాపించిన రెండు, రెండున్నర సంవత్సరాలలో బిహార్ వంటి రాష్ట్రాన్ని గెలుచుకోవడం ఎప్పుడూ జరగలేదు." మా పోరాటం నేరుగా ఎన్డీఏతోనే ఉంటుంది.

ఆర్జేడీకి 30 శాతం మద్దతు ఉంటే మిగిలిన 70 శాతం అంతా ఎన్డీఏనే. మేం ఎన్డీఏనే ప్రత్యర్థిగా భావిస్తాం అని కూడా పికె అన్నారు. కానీ ఆయన పరోక్షంగా బిజెపికి మేలు జరిగేలా పనిచేస్తున్నారని, మహా ఘట్‌బంధన్ ఓట్లకు తూట్లు పొడిస్తే అంతిమంగా నితీష్ కు ప్రయోజనం చేకూరుతుందని పీకే కార్యకలాపాలను విశ్లేషిస్తున్న వారు అంటున్నారు. పైగా "ఆయన నిలకడ లేని మనిషి. గతంలో కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు గట్టి ప్రయత్నాలు చేశారు. అయితే ఎఐసిసి పదవుల్లో తనకు కీలకమైన పదవినివ్వాలని షరతు పెట్టడంతో ప్రియాంక గాంధీ అడ్డుకున్నారు" అని ఢిల్లీ మీడియా వర్గాలు చెబుతున్నవి.

# అందరికీ భూమి అందేనా?


దున్నేవాడికి భూమినినాదం ఎలా ఉన్నా అందరి కీ భూమి సమానంగా దక్కాలి. భూమి అనేది ఆత్మగౌరవానికి ప్రతీక. రాజ్యాంగంలో పేర్కొన్నట్టుగా అందరికీ భూమి సేద్యం చేసుకుని ఉపాధి పొందాలని, నిర్దేశించినప్పటికీ అమలు అవుతోందా అనేది అవలోకనం చేసుకోవాలి. ఎన్ని ఉద్యమాలు జరిగి నా భూమి చుట్టే ఆ పోరాటాలు సాగుతున్నాయి. భూ నినాదమే ఉద్యమాలకు ఊపునిస్తున్నాయి. పేదలను కదిలిస్తున్నాయి. భారత రాజ్యాంగ నిర్మాత భారతరత్న డా॥బి.ఆర్.అంబేద్కర్ చెప్పిన మాటలను మనం.. .మననం చేసుకోవాలి. భూమిని జాతీయం చేయాలని ఏళ్లక్రితం అంబేద్కర్ చెప్పా రు. ఇది నిజం అవుతోందా? అని...బుద్ధిజీవులు, శ్రమజీవులు, ఆలోచనాపరులు, శ్రామికులు, విశ్లేషణ చేసుకోవాలి. ఎవరికి భూమి దక్కాలి? ఎందుకు దక్కాలి? 'నా భూములు నాకు. నేనే జమీందారుని, నేనే భూ స్వామిని, కష్టజీవులు అలానే ఉండాలి' అనే మానవనైజాన్ని ఎవరు మార్చగలరు? భూమి అందరికీ ఉండాలి. వ్యవసాయం పంటలకు గిట్టుబాటు ధర ప్రభుత్వాలు చెల్లించాలి.

రైతులు పండించిన పంటపై 50శాతం అదనంగా చెల్లించాలని పద్మ విభూషణ్ డాక్టర్ ఎంఎస్. స్వామినాథన్ చేసిన సిఫార్సులు ఎంతవరకు అమలు అవుతున్నాయన్న అంశాన్ని ఆలోచించాలి. రాష్ట్రంలో, దేశంలో, ప్రపంచంలో ఏ పోరాటాలు జరిగినా 'భూమి' కేంద్రంగా సాగుతున్నా యి. ఎస్‌సిలు, ఎస్‌టిలు, గిరిజనులు, ఆదివాసు లు, గొండులు, ఇతర వర్గాలు భూమిని నమ్ముకుని బ్రతుకుబండి లాగిస్తున్నారు. ఒక మనిషికి సగటు గా ఎంత భూమి ఉండాలి అన్నదే ప్రశ్న. ఆసియా, ఐరోపా, ఆఫ్రికా, అమెరికా లాటిన్, అంటార్కిటికా, తదితర ఖండాల్లో సగటున ఒక వ్యక్తి 8.7 ఎకరాల భూమి ఉండగా భారతదేశంలో సగటు వ్యక్తికి 0.58 ఎకరాల భూమి మాత్రమే ఉంది. సంపన్నులు, భూస్వాములు చేతుల్లో వందలు, వేల ఎకరాల్లో భూమి ఉంది. సామాన్యుల చేతుల్లో గుంట, రెండు గుంటలు, 5గుంటలు, 10, 20, 30 గుంటలు, మహా అంటే ఒక ఎకరం, 2 ఎకరాలు తప్పా భూమి ఏది? అన్న ప్రశ్నలు ఉదయిస్తున్నాయి. రష్యాలో ఒక వ్యక్తి 7.5 ఎకరాలు, బ్రెజిల్‌లో 7 ఎకరాలు, చైనాలో 6.5 ఎకరాలు, జర్మనీలో 5.6ఎకరాలు, జపాన్‌లో 5 ఎకరాలు, భూమి ఉంటే భారతదేశంలో సగటు మనిషికి 0.58 ఎకరాల భూమి మాత్రమే ఉంది. అంటే ఇది దేన్ని సూచిస్తుందో...విజ్ఞానులు ఆలోచించాలి. అసలు భూమి ఎందుకు అందరికి సమానంగా లేదు?0 దీనికి కారణం ఎవరు? రాజకీయ పక్షా లు ఎన్నికల ముందు భూమిలేని పేదలకు భూములు పంచుతాం..అని వల్లిస్తారు. కానీ ఆచరణలో రూపం దాల్చిన దాఖలాలు లేవు. తెలంగాణలో ఒక కోటికి పైగా ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్నారు. పేదలు సేద్యం చేసే భూములు తక్కువే. 96 శాతం వరి, 34 శాతం పత్తి పండిస్తుండగా సగటున పేదలు ఒక ఎకరం, అర ఎకరం, 5 ఎకరాలకు మించి లేదు. 40 నుంచి 60 లక్షల ఎకరాల అటవీ, దేవాదాయ, ప్రభుత్వ బంజరు భూములు తెలంగాణలో ఉన్నప్పటికీ ఈ భూము లు సంపన్నుల చేతుల్లోనే ఉన్నాయి. తెలంగాణలో ఒక ప్రజా ప్రతినిధికి ఏకంగా 800 ఎకరాల భూమి ఉంది. ఈ ప్రజాప్రతినిధి '500 సంవత్సరాలు గడచినా నా ఆస్తి తరగదు.. తరతరాలు అనుభవిస్తారు' అని వ్యాఖ్యానిస్తాడు. ఇలాంటి భూ స్వాములు ఎంతోమంది ఉంటారు. రాష్ట్రంలో 3.6 ఎకరాలు, కర్నాటకలో 4.3 ఎకరాలు, కేరళలో 2.6 ఎకరాలు, ఒడిస్సాలో 3.5 ఎకరాలు, బెంగాల్‌లో 4.3 ఎకరాలు, బీహార్‌లో 1.5 ఎకరాలు, జార్ఖండ్‌లో 1.3 ఎకరాలు, బిజెపి పాలిత రాష్ట్రాల్లో 1.5 ఎకరాల భూమి సగటు రైతుకు ఉంది. 'సబ్ కా వికాస్' అని నినాదం వల్లిస్తున్న పాలకులు ఎవరి వికాసం కోసం పనిచేస్తున్నారన్నదే ప్రశ్న. రిలయన్స్ అధినేత చేతుల్లో వేల ఎకరాలు.

దేశంలోనే అతి పెద్ద మామిడితోట ఆయన చేతుల్లోనే ఉంది. ప్రపంచ మార్కెట్‌ను శాసిస్తుంది. 'మన్‌కీ బాత్' పేరుతో గొప్పగా ప్రసంగాలు చేస్తున్న ప్రధాని పేదరికం పెట్టుబడిగా వచ్చినప్పటికీ పెట్టుబడిదారులు కోసం పనిచేస్తున్న మాట నిజం కాదా? భూమికోసం కార్మికులు, రైతులు, పీడితులు, భూమి కోసం ఏకంగా పోరుసాగిస్తున్నప్పటికీ పాలకులు ఎన్నికల నినాదాల వరకు పరిమితం అవుతున్నారు తప్ప సగటు బడుగు జీవి ఆత్మగౌరవం అయిన భూమిని అందరికీ పంచడం లేదు. ఏ పోరాటం చేసినా భూమి ప్రధాన ఎజండాగా నిలిచింది. సంపన్నులు పెట్టుబడిదారులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు పాలకులు అప్పనంగా ప్రభుత్వ భూమిని అప్పగిస్తున్నారు తప్ప పేదవాడి గుండె చప్పుడు వినిపించడం లేదు. సగటు మనిషికి ఆస్తులు, అంతస్తులు లేకున్నా, భూమి ఉంటే ఆత్మగౌరవాన్ని ప్రతిబింబిస్తుందన్న విషయం వాస్తవంకాదా "మా భూమి మాకు కావాలని తొలినాళ్ల లో పోరాటాలు చేసి విజయం సాధించారు. సగటు జీవికి భూమి ఇవ్వాల్సిన బాధ్యత పాలకులపై లేదా అన్న ప్రశ్నలు వెలుగు చూస్తున్నాయి.

గుర్రం రాంమోహన్ రెడ్డి,
7981018644

## ప్రజా యుద్ధాల గళం..
# సుద్దాల హనుమంతు కలం



'ఓ పాలబుగ్గల జీతగాడ పాలు మరిచి ఎన్నాళ్ళయిందో' అంటూ ఆ కన్నీటి వెతలను తడిమిందా కలం, పల్లెటూరి పిల్లవాని ఆర్ద్రత,ఆవేదనలను వినిపించిందా గళం 'వెట్టిచాకిరి విధానమో రైతన్న, ఎంత చెప్పినా తీరదు కూలన్న' అంటూ ప్రజల దీనగాథలు రాసిందా కలం, సామాజిక అసమామతలను ప్రశ్నించిందా గళం. 'ఎత్తరుగులపై పెత్తందారులు, అన్ని విధాలుగా దోచుకుని, అందలమెక్కిన మహానుభావులు' అంటూ వ్యవస్థను నిలదీసిన కలం, జాగరతోయ్ జాగరత అంటూ జనానికి కర్తవ్య బోధన చేసిందా గళం. 'నిజాంలో ప్రతి బజారులో మా ధ్వజం ఎర్రని జెండా ఎగరేస్తాం' అంటూ నిజాం ప్రభువుపై పాటల తూటా గురిపెట్టిందా కలం, ప్రజా ప్రభుత్వం సాధిస్తామంటూ ఎలుగెత్తి చాటిందా గళం. 'వెయ్ దెబ్బకు దెబ్బ వెయ్ 'అంటూ నిజాం సైన్యంపై తిరగబడిందా కలం, అచేతన వ్యవస్థను జాగృత పరచిందా గళం. ఆ కలం, గళం సమ్మేళనమే ప్రజాకవి సుద్దాల హనుమంతు. అర్థవంతమైన ఆవేశం, అవగాహనతో కూడిన పరిపక్వ ఆలోచనాభావాలు, సామాజిక స్పృహ అతని కవిత్వంలో పాల పొంగులా ఉప్పొంగుతూనే ఉంటాయి. ప్రజా ఆవేదనలను రాసి, పాడి, ఆడి వారిలో చైతన్యాన్ని నింపిన దివిటి సుద్దాల. ఒక చేత పెన్ను మరో చేత గన్ను పట్టి నిజాం ముష్కరుల వెన్నులో వణుకు పుట్టించిన ధీరుడు.

పాత నల్గొండ జిల్లా మోత్కూరు మండలం పాలడుగు గ్రామంలో నిరుపేద చేనేత కుటుంబంలో బుచ్చి రాములు లక్ష్మీ నరసమ్మ దంపతులకు సుద్దాల జన్మించాడు. వారికి ఆరుగురు సంతానం. వారందరిలో చివరగా జన్మించిన హనుమంతు అసలు ఇంటి పేరు గుర్రం. జీవన పోరాటంలో ఆ కుటుంబం గుండాల మండలం సుద్దాల గ్రామంలో స్థిరపడటంతో ఆ ఊరి పేరు ఆయన ఇంటిపేరుగా మారింది. చిన్నతనంలో చదువుకునే అవకాశాలు లేక వీధిబడిలో ఉర్దూ, తెలుగు భాషలు నేర్చుకున్నాడు. శతకాలు, కీర్తనలు, సీస, కంద పద్యాలు కంఠస్థం చేశాడు. బాల్యంలోనే యక్షగానాలు, కీర్తనలు, భజనలు లాంటి కళారూపాలు అంటే ఆసక్తి మెండుగా ఉండేది. తన గ్రామంలో హరికథలు చెప్పే అంజనదాసుకు శిష్యుడిగా ఆయన బృందంలో చేరాడు. చిన్న వయసులోనే బ్రతుకుతెరువు కోసం ఉద్యోగానికి హైదరాబాద్ చేరాడు. ప్రభుత్వ కార్యాలయంలో అటెండర్‌గా పనిచేశాడు. కానీ సమాజ చైతన్యం లక్ష్యంగా ఉన్న సుద్దాల స్వల్ప కాలం మాత్రమే ఉద్యోగం చేసాడు. ఆర్య సమాజం వైపు ఆకర్షితుడై కార్యకర్తగా పనిచేశాడు.

1944లో భువనగిరిలో రావి నారాయణరెడ్డి అధ్యక్షతన జరిగిన ఆంధ్ర మహాసభలో స్వచ్ఛంద కార్యకర్తగా తన కార్యాచరణ మొదలు పెట్టాడు. ఆ మహాసభ ప్రభావంతో సుద్దాల గ్రామంలో సంఘం స్థాపించాడు. ఆ సంఘం ఆధ్వర్యంలో ఆందోళనలు, తిరుగుబాటు పోరాటాలు మొదలైనాయి. సంఘం పెట్టి, పాటలు కట్టి ప్రజల్ని ఉద్రేక పరుస్తున్నాడని సుద్దాల పై నిజాం ప్రభుత్వం అరెస్ట్ వారెంట్ జారీ చేసింది. అప్పుడే హనుమంతు అజ్ఞాతవాసంలోకి వెళ్లాల్సి వచ్చింది. కొంతకాలం తరువాత అనారోగ్య కారణంగా బయటకు వచ్చి బాల్యంలో తనకున్న సాంప్రదాయ హరికథలు జానపద గేయాలు సభలలో పాడి అందరి మన్ననలు పొందేవాడు. తన కలం,గళం కలగలిపి ప్రజలని ఉద్యమాని కి కార్యోన్ముఖులను చేయడంలో సుద్దాల పాత్ర కీలకం గా మారింది. నిజాం దౌర్జన్యాలను పాటల రూపంలో వివరిస్తూ పల్లెపల్లెనా సమావేశాలు నిర్వహణకు సుద్దాల పాటలే ఆయువు పట్టయ్యాయి. చెప్పాలనుకు న్న విషయాన్ని సూటిగా ప్రజల గుండెల్లోకి తీసుకు వెళ్ళేది పాటే కాబట్టి పాటే పోరాట రూపం దాల్చేది. ఆ పాటల ప్రవాహానికి బలాన్ని బలగాన్ని సమకూర్చిన వాగ్గేయకారుడు సుద్దాల హనుమంతు. 'నీ బాంచన్ కాల్ మొక్కుతా' అన్నవారితో బందూకులు పట్టించిన పాటలు ఆయనవి. హరికథ, బుర్రకథ, యక్షగామాలతో బూజు పట్టిన నిజాం నిరంకుశ పాలకుల దొరల దేశ్‌ముఖ్‌ల కోట గోడలను కూల్చివేసిన జనగీతం సుద్దాల. వెట్టి చాకిరీ విధానాన్ని వ్యతిరేకిస్తూ దొరల దౌర్జన్యాలను నిరసిస్తూ అనేక పాటలు రాశాడు. ఇవన్నీ వీర తెలంగాణ పేరుతో అచ్చయ్యాయి. అపారమైన ఆత్మగౌర వం అలుపెరుగని వీరావేశం అతని పాటకు బలాన్ని సమకూర్చినవి. అంతేకాదు సుద్దాల బుర్రకథ చెపితే గడ్డి పూచకూడా కరవాలంగా మారేదని నానుడి. అతని బుర్రకథ కోసం ప్రజలు ఎన్ని గంటలైనా ఎదురుచూసే వాళ్లంటే అతిశయోక్తి కాదు. దీన్నిబట్టి ఆయన ఎంత గొప్ప కళాకారుడో మనం అర్థం చేసుకోవచ్చు. గొల్ల సుద్దులు, లత్కోర్ సాబ్, బుడబుక్కలు, ఫకీర్ వేషం, సాధువు మొదలైన కళారూపాల ద్వారా పీడిత వర్గాల బాధల్ని భావాలని వ్యక్తీకరించాడు. తన కళారూపాల తో సభికులను విశేషంగా ఆకట్టుకునేవాడు. జానపద కళారూపాలకు జీవంపోసి అనేక పాటలను ప్రజలకు అందించాడు. క్యాన్సర్ వ్యాధితో 1982 అక్టోబర్ 10న సుద్దాల కలం, గళం శాశ్వతంగా మూగపోయాయి.

*(సుద్దాల హనుమంతు వర్థంతి సందర్భంగా)*

**ములక సురేష్**

# మనసు బాగుంటేనే...మనిషి బాగుంటాడు

ప్రతి మనిషీ తనదైన ప్రత్యేక రీతిలో ఉంటాడు. ఆలోచనలూ, చేష్టలూ, అలవాట్లూ అందరివీ ఒకే విధంగా ఉండవు. ఇదే మనిషి వ్యక్తిత్వం – మన ప్రత్యేకత. కొందరు మాట్లాడే తీరు, ప్రవర్తన, ఎదుటివారితో వ్యవహరించే విధానం చూసి మనం వారిని మంచివాళ్లని అనుకుంటాం. మరికొందరిని మాత్రం తట్టుకోలేం. కానీ నిజానికి 'ఇది మంచిది', 'అది చెడ్డది' అని ఖచ్చితంగా చెప్పటం కష్టం. ఎందుకంటే ప్రతి వ్యక్తిలో మంచి చెడు రెండూ ఉంటా యి. కానీ కొన్ని లక్షణాలు ఎక్కువైపోతే మాత్రం సమస్యలు మొదలవుతాయి. మనకే కాదు, మన చుట్టుపక్కల వాళ్లకీ ఇబ్బందులు కలిగిస్తాయి. ఇలాంటివి వ్యక్తిత్వ సమస్యలు అంటారు.

**వ్యక్తిత్వం ఎక్కడి నుంచి వస్తుంది?**

చిన్నప్పటి నుంచి మనం చూసే వాతావరణం, కుటుంబం, స్నేహితులు, స్కూలు, పెద్దల ప్రవర్తన — ఇవన్నీ మన ఆలోచనా విధానాన్ని తీర్చిదిద్దుతాయి.కొన్ని గుణాలు తల్లిదండ్రుల నుంచి వస్తాయి, మరికొన్ని మనం నేర్చుకుంటాం.

ఇలా మన మనసు, అలవాట్లు, విలువలు, ప్రవర్తన ఇవన్నీ కలిపి మన వ్యక్తిత్వంగా మారుతాయి.

**వ్యక్తిత్వ సమస్యల రకాలు**

1. అనుమానం: ఎవరినీ నమ్మని మనస్తత్వం. ప్రతీ ఒక్కరినీ అనుమానంతో చూడటం. ఇవాళ నన్ను చూసి నవ్వింది ఎందుకో?, అతను నాతో చెడుగా మాట్లాడాడు అని చిన్న విషయాన్నీ పెద్దదిగా చేసుకుంటారు. ఇలాంటివారు స్నేహాలు, బంధాలు నిలబెట్టుకోలేరు.

2. ఒంటరితనం: ఇలాంటివాళ్లు ఒంటరిగా ఉండటం ఇష్టపడతారు. ఎవరితోనూ కలవరు, మాట తక్కువ. ఆనందం, బాధ అన్నా భావోద్వేగాలు తక్కువగానే ఉంటాయి.

3. విచిత్ర ప్రవర్తన: ప్రతీ విషయంలో నేను భిన్నంగా ఉండాలి అనుకునేవారు. దుస్తులు, మాట, చేష్టల్లో తేడా. కొందరు నాకు ప్రత్యేక శక్తులు ఉన్నాయి అని కూడా నమ్ముతారు.

**రెండో వర్గం – ఇతరులకు ఇబ్బంది కలిగించే స్వభావాలు**

1. నేర స్వభావం: నైతిక విలువలు లెక్క చేయరు. అబద్ధం, మోసం, గొడవలు – ఇవన్నీ సాధారణం గా భావిస్తారు. ఇలాంటి వారిలో పశ్చాత్తాపం ఉండ దు. నాకిష్టం వచ్చిందే చేస్తా అనేది వీరి నడవడి.


2. ఊగిసలాట: ఒక క్షణం ప్రేమ, మరో క్షణం ద్వేషం. భావోద్వేగాలు క్షణాల్లో మారిపోతాయి. సంబంధాలు నిలవవు. నిర్ణయాలు తొందరపాటుగా తీసుకుని తరువాత బాధపడుతుంటారు.

3. దురభిమానం: నేనే గొప్ప అన్న భావన ఎక్కువ. ఇతరులను చిన్న చూపు చూడటం, వారి విజయాన్ని తట్టుకోలేకపోవడం. ఎవరూ మెచ్చుకోకపోతే కుంగిపోవడం.

4. ప్రదర్శన ప్రియులు: ఎక్కడ ఉన్నా అందరి దృష్టి తనపైనే ఉండాలని కోరుకునేవారు. అతిశయంగా మాట్లాడటం, చిన్న విషయాన్నీ పెద్దదిగా చెప్పటం వీరి లక్షణం.

**మూడో వర్గం – భయం, ఆందోళనలతో కూడిన స్వభావాలు**

1.అతి భయం: భయంతో కొత్త పనులకు దూరంగా ఉండటం. తప్పు చేస్తామేమో, వాళ్లు తిరస్కరిస్తారేమో అనే




ఆలోచనలతో బాధపడుతుంటారు. ఫలితంగా ఆత్మవిశ్వాసం తగ్గిపోతుంది.

2.అతి చాదస్తం: ప్రతిదీ పర్ఫెక్ట్‌గా ఉండాలనుకోవడం. తప్పు జరిగితే తీవ్ర ఆందోళన. చిన్న తప్పుకీ బాధపడటం. ఇలాంటి వారు తమకూ, చుట్టుపక్కల వాళ్లకూ ఒత్తిడి తెచ్చిపెడతారు.

**ఇది సమస్యా? లేక వ్యక్తిత్వ లోపమా?** : భిన్నంగా ఉండటం తప్పు కాదు. కానీ ఆ ప్రవర్తన మనకే గానీ, ఇతరులకీ నష్టం కలిగిస్తే అది వ్యక్తిత్వ సమస్య అవుతుంది. అంటే మన గుణా లు మాలాడాప్టివ్ స్థాయికి వెళ్లినప్పు డు చికిత్స అవసరం.

**చికిత్స – జాగ్రత్తలు** : వ్యక్తిత్వ సమస్యలకు ప్రత్యేక మందులు లేవు. కానీ కౌన్సెలింగ్, సైకోథెరపీ, బిహేవియర్ థెరపీ వంటి పద్ధతులు చాలా సహాయపడతాయి. భయం, ఆందోళన, ఒత్తిడిని నియంత్రించడానికి వ్యాయామం, యోగా, ధ్యానం చాలా ఉపయోగం. మద్యం, మాదకద్రవ్యాలు దూరంగా ఉంచాలి. కుటుంబ సభ్యులు, స్నేహితులతో సాన్నిహిత్యంగా ఉండటం అవసరం.

**ముప్పు ఎక్కువగా ఎవరికి?** : చిన్నతనంలో ప్రేమ, శ్రద్ధ తక్కువగా దక్కినవారికి, తల్లిదండ్రుల తగాదాలు, ఘర్షణల మధ్య పెరిగినవారికి, బాల్యం లో వేధింపులు ఎదుర్కొన్నవారికి, కుటుంబంలో మానసిక సమస్యల చరిత్ర ఉన్నవారికి, మెదడులో రసాయన సమతుల్యత లోపం ఉన్నవారికి ముప్పు ఎక్కువగా ఉండే అవకాశం ఉంటుంది. సైకాలజిస్టులను సంప్రదించండి: మనసులో తేడా అనిపించినప్పుడు దాచిపెట్టకండి. చిన్న లక్షణాలు పెద్ద సమస్యలుగా మారకముందే గుర్తించండి. సైకాలజిస్టులను సంప్రదించండి. మనసు ఆరోగ్యంగా ఉంటేనే జీవితం సుఖంగా ఉంటుంది. వ్యక్తిత్వం మన గుర్తింపు కానీ అది మన బాధకు కారణం కాకూడదు.

**డా.అట్ల శ్రీనివాస్ రెడ్డి**
9703935321

## రోగులకు దాహం తీర్చరా...

-ఏళ్లు గడుస్తున్న మరమ్మతులకు నోచుకోని మంచినీటి పథకం

**ప్రజాపక్షం/చంద్రుగొండ:** స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ఆర్వో ప్లాంట్ మూలనపడి ఏళ్లు గడుస్తున్న ఇప్పటి వరకు సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో తాగునీరు లేక రోగులు వారి వెంట వచ్చిన సహాయకులు సిబ్బంది అనునిత్యం అవస్థలు పడుతున్నారు. సంబంధిత అధికారుల దృష్టికి అనేకసార్లు తీసుకెళ్లిన పట్టించుకోవడం లేదని ఆసుపత్రి సిబ్బంది సైతం వాపోతున్నారు. ఎవరికి వారు తమ వెంట మంచినీళ్ల బాటిలను తెచ్చుకుంటున్నామని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరి కొందరు వాటర్ బాటిలను కొనుక్కొని దాహం తీర్చుకుంటున్నారు.ఆర్వో ప్లాంట్ పని చేయకపోయినా అధికారులు పట్టించుకున్న పాపానపోలేదు. రోగులు వారి సహాయకులు పడుతున్న ఇబ్బంది స్థానిక ప్రజాప్రతినిధులకు అధికారులకు ఎన్ని సార్లు మొరపెట్టుకున్న వారు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా ప్రభుత్వ వైద్య అధికారులు దాహార్తాలను సందర్శిస్తున్న దీనిపై దృష్టి సారించకపోవడంపై రోగులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దృష్టి సారించి వాటర్ ప్లాంట్‌ను వినియోగంలోకి తేవాలని కోరుతున్నారు.

## ఆర్యవైశ్యులకు స్థానిక సంస్థల ఎన్నికల్లో సీట్లు కేటాయించాలి



**ప్రజాపక్షం/వైరా:** స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆర్యవైశ్యులకు సీట్లు కేటాయించి సముచిత స్థానం ఇవ్వాలని ఆర్యవైశ్య కార్పొరేషన్ జిల్లా ఇంచార్జి గంధి ప్రవీణ్‌కుమార్ అన్నారు. గురువారం గంధి ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తొలిసారి ఆర్యవైశ్యులను గుర్తించి కార్పొరేషన్ ఏర్పాటు చేసిన కార్పొరేషన్ చైర్మన్‌గా కల్వ సుజాతను నియమించడం జరిగిందని అన్నారు. ప్రస్తుతం జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎంపిటిసి, జెడ్పిటిసి, సర్పంచ్ వార్డు మెంబర్ల సీట్లను ఆర్యవైశ్యులకు కొన్ని కేటాయించాలని రిజర్వేషన్ ప్రకారం ఆయన అన్నారు. అదేవిధంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజాపాలన ప్రభుత్వాన్ని దీవించి కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను ముందుకు తీసుకొచ్చి ప్రజల అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తుందని తెలిపారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఐ సత్తా చాటుతాం:కే సారయ్య




**ప్రజాపక్షం/ఇల్లందు:** స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఐ సత్తా చాటుతుందని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కే సారయ్య అన్నారు. పట్టణంలోని విట్టల్ రావు భవన్ నందు జరిగింది. కే సారయ్యరాష్ట్ర జిల్లా కమిటీ ఎన్నికల ఒడంబడిక ఆధారంగానే 16 ఎంపీటీసీ స్థానాలకు, ఒక జెడ్‌పిటిసి స్థానానికి పోటీ చేయాలని నిర్ణయించుకున్నామన్నారు.స్థానిక సమస్యలపై పోరాటం చేసి, ప్రజల్లో అభిమానం చూరగొన్న కార్యకర్తలకే పార్టీ భీ ఫామ్ ఇవ్వడం జరుగుతుందని, ప్రతి ఒక్క కార్యకర్త సిపిఐ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేయాలన్నారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దేవరకొండ శంకర్, మండల కార్యదర్శి బొప్పిశెట్టి సత్యనారాయణ, సిపిఐ నాయకులు బసిపాక రవి, మోజెస్, గుగులోత్ కృష్ణ, ఉడుత ఐలయ్య, వద్ల శ్రీను, మంచాల వెంకటేశ్వర్లు, రాము, అలెం రాఘవేంద్రరావు, తాండ్ర లక్ష్మీ నారాయణ, బొల్లి కొమరయ్య, సదానందం, రాందాస్, పాల్గొన్నారు.

## మద్యం షాపుల దరఖాస్తుల స్వీకరణ

**ప్రజాపక్షం/పాల్వంచ :** 2025, 2027 సంవత్సరాలకు గాను మద్యం దుకాణాలకు ధరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 18వ, తేదీ వరకు మాత్రమే అవకాశం ఉందని పాల్వంచ ఎక్సైజ్ సిఐ ప్రసాద్ గురువారం ఒక ప్రకటలో తెలిపారు. ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో మొత్తం 13 షాపులు ఉన్నాయన్నారు. వాటిలో పాల్వంచ పట్టణంలో 8, పాల్వంచ గ్రామీణ ప్రాంతం కేపి జగన్నాధపురంలో ఒకటి, ములకలపల్లిలో నాలుగు ఉన్నాయని అన్నారు. వాటిలో ములకలపల్లిలో గల నాలుగు, పాల్వంచ మండలంలోని ఒకటి మొత్తం ఐదు షాపులను షెడ్యూల్ తెగలకు ( ఎస్టి ) రిజర్వేషన్ చేసినట్లు పేర్కొన్నారు. పాల్వంచ పట్టణంలోని ఎనమిది షాపులకు ధరఖాస్తు చేసుకోవచ్చని అన్నారు. ఒక్కరు తన పేరు మీద పలు షాపులకు ధరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ధరఖాస్తు చేసుకొనేందుకు ప్రభుత్వం సులభతరం చేసిందన్నారు. మూడు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు,మూడు లక్షల డిడి లేదా చలాన్, ఆధార్ కార్డు, పాన్ కార్డ్ జీరాక్స్ కాఫీ ఉంటే ఎవరైనా ధరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు తమ ధరఖాస్తులను ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు జిల్లా ఎక్సైజ్ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. మరింత సమాచారం కోసం 8712658852 కు ఫోన్ చేసి తెలుసుకోవాలన్నారు.

## అక్రమ రేషన్ బియ్యం పట్టివేత

**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండల పరిధిలోని ఎర్రబోయినపల్లి గ్రామంలో గల రేషన్ షాప్ నంబర్ 223 20 20 గల దుకాణంలో అక్రమంగా నిల్వ ఉన్న 13 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని గురువారం వరంగల్ రీజినల్ విజిలెన్స్, ఎన్ఫోర్స్మెంట్ వారు పలు రేషన్ దుకాణాలలో దాడులు నిర్వహించగా ఎర్రబోయినపల్లి గ్రామంలో గలదుకాణంలో 13 కింటాల అక్రమ రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. సివిల్ సప్లై డ్యూటీని వివరణ కోరగా ఆదుకాణం డీలర్ పై సిక్స్ ఏ కేసు నమోదు చేసినట్లు పక్కనే ఉన్న రేషన్ డీలర్‌కు అప్పుజెప్పినట్లు సివిల్ సప్లై డిటి నరేష్ తెలిపారు.

## సింగరేణి ఉచిత వైద్య శిబిరం



**ప్రజాపక్షం/మణుగూరు:** సింగరేణి డిజిఎం (పర్సనల్) ఎస్ రమేష్, సింగరేణి సేవా సమితి, సింగరేణి వైద్య, ఆరోగ్య విభాగం ఆధ్వర్యంలో మణుగూరు మండల పరిధిలోని తిర్లాపురం గ్రామాంలో గురువారం సింగరేణి ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో మొత్తం 134 మందికి సాధారణ వ్యాధులకు ఉచితంగా మందులు ఇవ్వడంతో పాటు బిపి, షుగర్, వ్యాధి గ్రస్తులను పరీక్షించి వారికి కూడా వ్యాధి నియంత్రణ మందులు ఇవ్వడం జరిగింది. వ్యాధుల బారిన పడకుండా గృహ, వ్యక్తిగత పరిశుభ్రత తప్పక పాటించవలసిన ఆవశ్యకత పై సింగరేణి వైద్యులు తిర్లాపురం గ్రామస్తులకు అవగాహన కల్పించడం జరిగిందని డిజిఎం (పర్సనల్) ఎస్ రమేష్ తెలిపారు. సింగరేణి వైద్యులు డా. సౌజన్య, స్టాఫ్ నర్స్ అనంతలక్ష్మి , సింగరేణి సేవా సమితి కోఆర్డినేటర్ కె. వి. మారేశ్వరరావు, శ్రీ రాము, శ్రీ బాలు, తిర్లాపురం గ్రామస్తులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు సర్వీస్ నౌ సర్టిఫికేషన్స్

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రముఖ బహుళ జాతి సాఫ్ట్‌వేర్ సంస్థ సర్వీస్ నౌ నిర్వహించే సర్టిఫైడ్ సిస్టం అడ్మినిస్ట్రేటర్ (సిఎస్ఏ) పరీక్షల్లో ఎస్‌బిఐటి కళాశాలకు చెందిన 33 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించి సర్టిఫికేషన్స్ పొందారని కళాశాల ఛైర్మన్ గుండాల కృష్ణ గురువారం తెలిపారు. అమెరికా కేంద్రంగా ఆటోమేటెడ్ బిజినెస్ వర్క్ ఫ్లో, ఐటి సంబంధిత సేవలు అందిస్తున్న సర్వీస్ నౌలో తమ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చడం ద్వారా ప్రపంచ స్థాయి సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు పొందగలరని గుండాల కృష్ణ ఆశాభావం వ్యక్తం చేశారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించి అభినందించారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డా॥ జి. ధాత్రి మాట్లాడుతూ సిస్టం అడ్మినిస్ట్రేటర్ ఉద్యోగాలకు ప్రముఖంగా సర్వీస్ నౌ వారి సర్టిఫైడ్ సిస్టం అడ్మినిస్ట్రేటర్‌నే అన్ని కంపెనీలు ప్రామాణికంగా పరిగణిస్తున్నాయన్నారు. సాఫ్ట్‌వేర్ రంగంలో గత ఐదేండ్లుగా ఈ సర్టిఫికేషన్ పొందిన వారి కొరత ఉందని ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ఇట్టి విషయాన్ని గ్రహించి తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ మాట్లాడుతూ అమెజాన్‌తో పాటు వివిధ ఫార్చ్యూన్ 500 కంపెనీలు క్లయింట్‌గా కలిగిన సర్వీస్ నౌ సంస్థ తమ కళాశాలను గుర్తించి తమ విద్యార్థులకు సర్టిఫికేషన్‌కు అవకాశం కల్పించిందన్నారు. తమ విద్యార్థులకు సర్టిఫికేషన్స్ సాధించడంలో తోడ్పాటునందించిన లాజిక్ వైల్ ట్రైనింగ్ సంస్థకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అకాడమిక్ డైరెక్టర్స్ గుండాల ప్రవీణ్‌కుమార్, గంధం శ్రీనివాసరావు, ఎవివి శివప్రసాద్, జే. రవీంద్రబాబు, టిపివో ఎన్. సవిత, కో ఆర్డినేటర్ జి. ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



# 'అవాక్కైన' ఆశావహులు..!

ఉదయం నుండి నామినేషన్ల సాయంత్రం కోర్టు స్టే

రాజకీయ నాయకుల్లో గందరగోళం

మొత్తం 17 నామినేషన్ల స్వీకరణ

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** స్థానిక ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఎన్నికల కమీషన్ మార్గదర్శకాల ప్రకారం గురువారం ఉదయం నుండి నామినేషన్ల ప్రక్రియ యదాతథంగా ప్రారంభమైంది. బుధవారం కోర్టు తీర్పును గురువారం నాటికి వాయిదా వేయడంతో బిసి రిజర్వేషన్ వియంలో అంతా ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు వెలువడే అవకాశం ఉందని భావించారు. జిల్లా కలెక్టర్ సైతం ఎన్నికల ప్రక్రియకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి నామినేషన్లు స్వీకరించారని ఆదేశాలు జారీ చేశారు. దీంతో జిల్లాలోని ఉదయం నుండి నామినేషన్ల పర్వం కొనసాగుతూ వచ్చింది. కాగా సాయంత్రానికి కోర్టు తీర్పు వెలువరుస్తూ 42శాతం బిసి రిజర్వేషన్ జిఓతో పాటు ఎన్నికల నోటిఫికేషన్ పై కూడా స్టే విధించి, తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. దీంతో స్థానిక ఎన్నికల ప్రక్రియకు నెల రోజుల పాటు బ్రేక్ పడింది. అంతా సజావుగా ఉంటే జిల్లాలో ఈనెల 23వ తేదిన తొలి విడత ఎన్నికలు జరగాల్సి ఉంది. ఈ విడతలో 113 ఎంపిటిసి స్థానాలకు, 11జెడ్పిటిసి స్థానాలకు గాను ఎన్నికల ప్రక్రియను అధికారులు పూర్తి చేశారు. అశ్వాపురం మండలంలో 11 ఎంపిటిసి స్థానాలు, భద్రాచలం 14, బూర్గంపాడు 17, చర్ల 12, దుమ్ముగూడెం 13, కరకగూడెం 5, మణుగూరు 11, పినపాక 9, ఆళ్లపల్లి 5, గుండాల 5, జూలూరుపాడు 10 కలిపి మొత్తం 113 స్థానాలు ఉండగా 3,21,202 మంది ఓటు వేయాల్సి ఉంది. రాజకీయ నాయకుల్లో గందరగోళం : హైకోర్టు స్థానిక ఎన్నికల పై స్టే విధించడంతో రాజకీయ నాయకుల్లో గందరగోళ పరిస్థితి నెలకొంది. కోర్టు తీర్పు వెలువడకుండానే ఎన్నికలకు పోవడం ప్రభుత్వం చేసిన తప్పని పలువురు వాదిస్తున్నారు. ఇదిలా ఉండగా నెలరోజుల పాటు స్టే విధించడంతో మార్పులు చేర్పులు జరిగే అవకాశం ఉందని, బిసి రిజర్వేషన్ల షెడ్యూల్‌లో తేడాలు వచ్చే ప్రమాదం ఉందని ఆశా వాహులు మదన పడుతున్నారు.

**జిల్లాలో మొత్తం 17 నామినేషన్లు :** జిల్లాలో తొలివిడత ఎన్నికల్లో భాగంగా మొత్తం 17 నామినేష్ల పడ్డాయి. అందులో అశ్వాపురం 2, భద్రాచలం 7, దుమ్ముగూడెం 8 నామినేషన్ల దాఖలయ్యాయి. ఇందులో కాంగ్రెస్ పార్టీ నుండి 1, సిపిఎం నుండి 7, బిఆర్ఎస్ నుండి 9 నామినేషన్లు దాఖలయ్యాయి. కాగా దాఖలైన నామినేషన్ల వివరాలను టిపోల్ లో అప్‌లోడ్ చేయాలని సిబ్బందికి ఆదేశాలు అందాయి. ఎన్నికల ప్రక్రియ వాయిదా వడటంతో ఆయా ఎంపిడీఓ కార్యాలయల వద్ద ఏర్పాటు చేసిన టెంట్లను తొలగిస్తున్నారు. మరో ప్రక్క సామాగ్రి మొత్తాన్ని భద్రపరచనున్నారు. ఈ స్థానిక ఎన్నికల పుణ్యమా అని జిల్లా వ్యాప్తంగా సుమారు రూ.20 నుండి రూ.30 లక్షల ప్రజా ధనం వృధా అయ్యింది.



## నిలిచిపోయిన నామినేషన్ల ప్రక్రియ



**ప్రజాపక్షం/ మధిర :** స్థానిక ఎన్నికల నోటీఫికేషన్‌పై గురువారం హైకోర్టు స్టే విధించడంతో నామినేషన్ల ప్ర క్రియ నిలిచిపోయింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల నామినేషన్లను స్వీకరించేందుకు మధిర పట్టణంలోని ఎంపిడిఓ కార్యాలయంలో పోలీసులు, మండల అధికారుల ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేసి బందోబస్తు నిర్వహించారు. నామినేషన్ల ప్రక్రియలో భాగంగా రాజకీయ పార్టీల నాయకులు అభ్యర్థుల ఎంపికలో మల్లగుల్లాలు పడుతూ చర్చల అనంతరం పొత్తులు పెట్టుకుని అభ్యర్థులను నిర్ణయించి నామినేషన్లు వేసేందుకు వారి వారి పార్టీల కార్యాలయాల్లో ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. నామినేషన్ల ప్రక్రియలో భాగంగా మధిరలో నాయకులు హడావుడి కన్పించింది. కాని స్థానిక ఎన్నికలకు బ్రేక్ పడటంతో పార్టీల శ్రేణుల్లో, నాయకుల్లో కొంత ఆందోళన నెలకొంది. తెలంగాణ హైకోర్టులో బిసి రిజర్వేషన్‌పై విచారణ అనంతరం ఎన్నికల నోటీఫికేషన్‌పై స్టే విధించి నాలుగు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని హైకోర్టు ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. కౌంటర్ దాఖలు చేసేందుకు పిటిషనర్లకు రెండు వారాల సమయం ఇవ్వడంతో స్థానిక ఎన్నికల నిర్వహణకు కొంతకాలం బ్రేక్ పడింది. హైకోర్టు ఆర్డర్ పరిశీలించిన తర్వాత స్థానిక ఎన్నికలపై నిర్ణయం తీసుకుంటామని ఎన్నికల కమీషన్ తెలిపింది.

## యువతకు విప్లవాన్ని పరిచయం చేసిన 'చె గువేరా'

**ప్రజాపక్షం/పాల్వంచ :** విప్లవాన్ని యువతకు పరిచయం చేసిన గొప్ప విప్లవ వీరుడు చెగువేరా అని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గుండాల సుజన్ అన్నారు. అంతర్జాతీయ శ్రామిక వర్గ పోరాటాలకు ఊపిరులూదిన చెగువేరా సాయుధ పోరాటమే మార్గంగా పయనించారన్నారు. ఆయన తల్లి దండ్రులు చిన్నప్పటి నుండే విప్లవకారుల జీవిత గాథలను వినిపించేవారని తెలిపారు. దీనితో చెగువేరా అన్యాయాలు, అక్రమాలపై పోరాటం చేశారని అన్నారు. క్యూబా, రష్యా, ఉక్రేయిన్, రొమేనియా, బల్గేరియా, చైనా వంటి కమ్యూనిస్టు దేశాలకు చెగువేరా పోరాటం స్ఫూర్తినిచ్చిందని తెలిపారు. ఆయన పోరాటం ఆదర్శమైనదన్నారు. ఆయా దేశాలు చెగువేరా జీవిత చరిత్రను పాఠ్య పుస్తకాల్లో చేర్చాయని అన్నారు. బోలివియా సైనిక నియంతకు వ్యతిరేకంగా పోరాడుతూ ప్రాణాలర్పించిన చెగువేరా యువతకు ఆదర్శం కావాలని శ్రామిక వర్గాల పట్ల శ్రమ దోపిడి పట్ల చైతన్యవంతమైన నాయకులుగా యువకులు గా సమాజాన్ని అధ్యయనం చేయాలని సూచించారు. చెగువేరా పోరాట స్పూర్తిని ఆదర్శంగా తీ సుకొని యువత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. నాయకులు, జిల్లా సమితి సభ్యులు రాజ్ కమల్, గణేష్, వర్షిత్,భార్గవ్, లిథిన్, గీతిక, భవాని, శైలజ, స్నేహ, కళ్యాణి, వనిత, పూజిత, సింధు, మహేష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/కారేపల్లి:** ప్రపంచ యూత్ ఐకాన్‌గా, ప్రజా సమస్యలపై పోరాడుతూ యువత ఎదుర్కొనే సమస్యలకు పోరాటమే మార్గమని జీవితాంతం సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడి ప్రాణం అర్పించిన విప్లవ వీరుడు నిత్య స్ఫూర్తి ప్రధాత చేగువేరా అని డివైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆదేర్ల వినయ్ కుమార్ కొనియాడారు. గురువారం డివైఎఫ్ఐ సింగరేణి మండల కమిటీ ఆధ్వర్యంలో చేగువేరా 59వ వర్ధంతిని కారేపల్లిలో నిర్వహించారు. ప్రపంచ యూత్ ఐకాన్ యంగ్ డైనమిగ్ లీడర్, ప్రవహించే ఉత్తేజం భయపడటం ఎప్పుడైతే మానేస్తామో అప్పుడే మన జీవితం మొదలైనట్లు అని, ఒకరి కాలికింద బానిసలా బ్రతికే బదులు లేచి నిలబడి ప్రాణం వదిలేయడం మేలు, ప్రపంచంలో ఎప్పుడు, ఎవరికీ అన్యాయం జరిగిన స్పందించడానికి సిద్ధంగా ఉండు అన్న చే మాటల కట్టుబడి చే గువేరా స్ఫూర్తితో ముందుకు నడవమే నేటి యువత సమాజంలో ఎదుర్కొంటున్న నిరుద్యోగం, యువతపై ప్రభావం చూపుతున్న విష సంస్కృతి, ఉపాధికై ఉద్యమించాలని యువతకు పిలుపునిచ్చారు. ఈసందర్భంగా జస్టిస్ బిఆర్ గవాయ్ పై జరిగిన దాడి భారత రాజ్యాంగంపై ప్రజాస్వామ్యంపై జరిగిన దాడిలా భావించాలని ఖండించాలని పిలుపునిచ్చారు.గడ్డం దిలీప్ కుమార్, ఎర్నాగి సంపత్, ఎస్‌కే సలీం, చిలుముల కమలాకర్, ఆదెర్ల వెంకటేష్, పాల్గొన్నారు.





## రెవెన్యూ భూముల సరిహద్దుల గుర్తింపు జరిగేనా..!



**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** మండల పరిధిలోని రామన్నగూడెం గ్రామరెవెన్యూ లంకాలపల్లి భూముల సరిహద్దులు జాయింట్ సర్వే ప్రక్రియను గత నాలుగు రోజులుగా రెవెన్యూ, అటవీ శాఖ అధికారులు జాయింట్ సర్వే బౌండరీల గుర్తింపు కోసం తీవ్ర కసరత్తు చేస్తున్నారు. గత 40 సంవత్సరాల కాలంగా ఈ భూములు మాకు సంబంధించినవి అని రామన్నగూడెం గిరిజనులు పోరాటం చేస్తున్నారు. 1971లో లంకాలపల్లి రెవెన్యూ పూర్తిగా ఫారెస్టు గెజిట్ అయ్యి రెవెన్యూ గ్రామంలో ఉన్న సుమారు 1623 ఎకరాల భూమిని ఫారెస్టుకు అప్పగించి రెవెన్యూలో పూర్తిగా డీలిట్ చేశారు. రామన్నగూడెం గ్రామ రెవెన్యూలో సర్వే నెంబర్ 30, 36, 39లలో సుమారు వెయ్యి ఎకరాల వరకు గిరిజనులు పట్టాలు కలిగి ఉన్నారు. 650 ఎకరాలకుపైగా అటవీశాక అధీనంలో ఉంది. పూ ర్వం దానిలో అటవీ అభివృద్ధి అధికారులు కొంత భూమిలో వెదురు ప్లాంటేషన్, మరికొంత భూ మిలో ప్లాంటేషన్ వేశారు. అప్పటిలో ఉమ్మడి జిల్లా కలెక్టర్ సిద్దార్థ జైన్ ఆదేశాలతో ఫారెస్టు రెవెన్యూ అధికారులు జాయింట్ సర్వే చేపట్టారు. దీంతో జిల్లా కలెక్టర్ వారి సమస్యను పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చి ధర్నాను విరమింప చేసి ఫారెస్టు రెవెన్యూ అధికారులు సర్వే చేపట్టి గ్రామ రెవెన్యూ బౌండరీల కార్యక్రమం ముమ్మరం చేశారు. దానిలో భాగంగా నాలుగురోజుల నుంచి సర్వే నిర్వహిస్తున్నారు.రామన్నగూడెం గ్రామ రెవెన్యూ లో మొత్తం సుమారు భూమి 1124 ఎకరాలు ఉండాల్సి ఉంది. కాని గిరిజనులచేతిలో కేవలం 300 ఎకరాలులోపే ఉంటుందని మిగిలిన సుమారు 800ఎకరాల భూమి ఫారెస్టు అధికారుల స్వాధీనంలో ఉంటుందని అని గిరిజనులు వాదిస్తున్నారు. ఇప్పటికీ అనేకసార్లు సర్వే చేసినప్పటికీ రామన్నగూడెం గ్రామ సరిహద్దులు గుర్తించటంలో రెండుశాఖల అధికారులు ప్రత్యేక చొరవ చూపలేదని ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా సమగ్ర సర్వే చేసి తమ భూములు తమకు అప్పగించాలని గిరిజనులు డిమాండ్ చేస్తున్నారు. విలువైన అటవీ సంపద భూముల్లో ఉండటం వలననే ఆ భూ సమస్యను పరిష్కరించటం లేదనే అనుమానం వ్యక్తమవుతుంది.

## అక్రమ రేషన్ బియ్యం పట్టివేత

**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండల పరిధిలోని ఎర్రబోయినపల్లి గ్రామంలో గల రేషన్ షాప్ నంబర్ 223 20 20 గల దుకాణంలో అక్రమంగా నిల్వ ఉన్న 13 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని గురువారం వరంగల్ రీజినల్ విజిలెన్స్, ఎన్ఫోర్స్మెంట్ వారు పలు రేషన్ దుకాణాలలో దాడులు నిర్వహించగా ఎర్రబోయినపల్లి గ్రామంలో గలదుకాణంలో 13 కింటాల అక్రమ రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. సివిల్ సప్లై డ్యూటీని వివరణ కోరగా ఆ దుకాణం డీలర్ పై సిక్స్ ఏ కేసు నమోదు చేసినట్లు అట్టి బియ్యాన్ని పక్కనే ఉన్న రేషన్ డీలర్ కు అప్పజెప్పినట్లు సివిల్ సప్లై డిటి నరేష్ తెలిపారు.

## షిర్డి సాయిబాబా మందిరంలో అన్నదానం

**ప్రజాపక్షం/ మధిర :** మధిర పట్టణంలో వేంచేసియున్న శ్రీ దివ్య షిర్డి సాయి బాబా మందిరం నందు గురువారం దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. తాళశీల జీవనతేజ పుట్టిన రోజు సందర్భంగా వారి కుటుంబసభ్యుల ఆర్థిక సహకారంతో సాయిప్రసాదం అన్నప్రసాద వితరణ చేశారు. ముందుగా సాయిబాబాకు ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ నిర్వాహకులు మాట్లాడుతూ దాతల సహకారంతో ప్రతి గురువారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు, దాతల సహకారం మరువలేనిదని వారికి కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రభుత్వ భూమిలో బడాబాబులు

794 ప్రభుత్వ సర్వేలో దర్జాగా పాగా

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** సత్తుపల్లి మండలం రేజర్ల రెవిన్యూ లోని కొత్తూరు గ్రామంలోని 22 ఎకరాల పైచిలుకు ఉన్న 794 ప్రభుత్వ సర్వే నెంబర్ల లో బడాబాబులు పాగా వేశారు. పాగా వేసిన బడాబాబులకు 88 సర్వే నెంబర్లో ఉన్నట్లుగా అధికారులు పాస్ బుక్కులు జారీ చేశారు. పెద్ద మొత్తంలో చేతులు మారినట్లుగా ఆరోపణలున్నాయి. ఇదిలా ఉండగా 88 సర్వే నెంబర్ లో ఉన్న దాదాపు 80 మంది రైతులను 794 సర్వే నెంబర్లు కూర్చోబెట్టి పాసు బుక్కులు పంపిణీ చేయడం సర్వత్ర ఆరోపణలకు దారి తీసింది. ఈ భారీ మోసాన్ని విచారణ జరపాలని కోరుతూ రైతులు హైకోర్టు జస్టిస్, గవర్నర్, సీఎంతో సహా సిబిఐ, సిఐడి విజిలెన్స్ తదితర ఉన్నత స్థాయి విచారణ బృందాలకు ఫిర్యాదు చేసినట్లుగా సమాచారం. తాజాగా ఈ ఏరియాలో సింగరేణి వాళ్ళు రోడ్డు నిర్మాణం చేపడుతుండగా, భూ సేకరణ యాక్ట్ 2013కు విరుద్ధంగా నోటీసులు జారీ చేసినట్లుగా రైతులు ఆరోపిస్తున్నారు. సత్తుపల్లి ప్రాంతంలోని అసైన్డ్, సీలింగ్, ప్రభుత్వ భూములు దర్జాగా కబ్జా జరుగుతున్న అధికారులు పట్టించుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. సీలింగ్, అసైన్డ్ భూములకు సైతం రిజిస్ట్రేషన్లు జరగడం విశ్వయాన్ని కలిగిస్తుంది. అధికారులు జరిపిన దొంగ చాటు వ్యవహారాలపై ఉన్నత స్థాయి విచారణ జరపాలని ప్రజా సంఘాల నాయకులు జిల్లా కలెక్టర్ ను కోరుతున్నారు.

## మానవతారాయ్‌కి 'డాక్టరేట్'



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు కు చెందిన మానవతారాయ్‌కి ఉస్మానియా విశ్వవిద్యాలయం గురువారం డాక్టరేట్ ప్రకటించింది. ఉస్మానియా విశ్వవిద్యాలయం మాజీ గవర్నర్ హైదరాబాద్ రాష్ట్ర మొట్టమొదటి చిట్టచివరి ముఖ్యమంత్రి డాక్టర్ బూర్గుల రామకృష్ణారావు జీవితం సాహిత్యం అనే అంశంపై తెలుగు శాఖకు సమర్పించిన సిద్ధాంత గ్రంథానికి ఉస్మానియా విశ్వవిద్యాలయం గురువారం అతనికి డాక్టరేట్ ప్రకటించింది. ప్రస్తుత సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య నిత్యానందరావు ఈ పరిశోధనకు మార్గదర్శకత్వం వహించారు. ఖమ్మం జిల్లా కల్లూరు కి చెందిన మానవతారాయ్ తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించారు. ఉస్మానియా కళాశాలలో ఎల్ఎల్బి పూర్తి చేసిన అతను హైకోర్టు న్యాయవాదుల సంఘంలో శాశ్వత సభ్యునిగా కొనసాగుతున్నారు. విద్యార్థి నిరుద్యోగ జేఏసీ చైర్మన్ గా పోరాటాలు చేశారు. కాంగ్రెస్ పార్టీలో రెండుసార్లు ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు.

# బిజెపి జిల్లా స్థాయి సమావేశంలో రగడ

అధ్యక్షుడి ఒంటెత్తు పోకడ

భగ్గుమన్న వర్గ విభేదాలు

**ప్రజాపక్షం/పాల్వంచ :** పాల్వంచలో జరిగిన భారతీయ జనతా పార్టీ జిల్లా స్థాయి సమావేశం రసాబాసాగా సాగింది. గత కొంత కాలంగా రగులుతున్న అంతర్గ విబేధాలు భగ్గుమన్నాయి. జిల్లా అధ్యక్షుడి ఒంటెద్దు పోకడలకు నిరసనగా సీనియర్ నాయకులు తమ అసంతృప్తిని వెల్లగక్కారు. ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. సమావేశానికి జిల్లా అధ్యక్షుడి అనుచర వర్గానికి మాత్రమే ముందస్తు సమాచారం ఇచ్చి సీనియర్ నాయకులకు కావాలనే దూరం పెడుతూ ఆహ్వానం పంపలేదంటూ వారు తమ అసంతృప్తిని వెల్లగక్కారు. అధ్యక్షులు ఉద్దేశ్యపూర్వకంగానే సీనియర్ నాయకులు విస్మరిస్తున్నారని పలువురు ఆరోపించారు. బిజెపి విస్తరణకు కాకుండా తన వర్గ ప్రాబల్యం కోసం పాకులాడుతున్నారని, పార్టీ అభివృద్ధికి గొడ్డలి పెట్టులా అధ్యక్షులు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. సీనియర్ నాయకులు సీతారాం నాయక్ తో పాటుగా ఇతర సీనియర్ నాయకులు తమ అభ్యంతరాలను వ్యక్తం చేశారు. ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోవటం మంచిది కాదంటూ హితవు పలికారు. ముందస్తుగా సమాచారం ఇవ్వకుండా సమావేశం నిర్వహించడాన్ని సీతారాం నాయక్ వర్గానికి చెందిన నాయకులు అడ్డుకోవడానికి శత విధాలుగా ప్రయత్నించారు.



## హత్యకేసును ఛేదించిన పోలీసులు

వివరాలను వెల్లడించిన ఎసిపి తిరుపతిరెడ్డి




**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఖమ్మం జిల్లాలో సంచలనం సృష్టించిన ఓ వ్యక్తి హత్య కేసును పోలీసులు విజయవంతంగా చేదించారు. నమ్మిన వ్యక్తే డబ్బుకోసం హతమార్చినట్లు తేల్చారు. ఇందుకు సంబంధించిన సంచలన వివరాలను ఖమ్మంరూరల్ పోలీస్‌స్టేషన్‌లోని తన కార్యాలయంలో ఏసీపీ తిరుపతిరెడ్డి గురువారం వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్‌టీఆర్ జిల్లా వత్సవాయి మండలం చిట్యాల గ్రామానికి చెందిన ఏ1 పరిమి అశోక్ ఎం.ఫార్మిసీ వరకు చదువుకుని ఖమ్మం నగరంలో ఓ ప్రైవేట్ జాబ్ చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి కామేపల్లి మండలం కెప్టెన్ బంజరకు చెందిన గట్ల వెంకటేశ్వర్లు(40) గ్రంథాలయంలో పరిచయం అయ్యాడు. అది కాస్త ఇరువురి మధ్య స్వలింగ సంపర్కానికి దారి తీసింది. అశోక్‌కి ఏ2 కొమ్ము నగ్మాతో పరిచయం ఏర్పడి అది వివాహేతర సంబంధానికి దారి తీసింది. అలాగే తన స్వగ్రామంలో కూరగాయల సాగు చేసిన క్రమంలో డ్రిప్ ఇరిగేషన్ పనులు చేసుకునే బల్లెపల్లి, బాలపేటకి చెందిన ఏ3 పెంటి కృష్ణయ్య అలియాస్ కృష్ణరామస్వామి పరిచయంతో స్నేహితులయ్యారు. ఈ సారి గట్ల వెంకటేశ్వర్లు రూమ్‌కి వచ్చిన సమయంలో ఎలాగైన చంపి తన వద్ద ఉన్న బంగారం, డబ్బులను తీసుకోవాలని ముగ్గురు కుట్ర పన్నారు. అయితే హత్య చేయడం ఎలా అని ఏ3 కృష్ణను ఏ1 అశోక్ అడగగా..కత్తితో గొంతు బాగంలో నరకడం ద్వారా అరవకుండా చంపవచ్చని సలహ ఇచ్చాడు. అటు తరువాత ఏ1 అశోక్ సెల్‌ఫోన్ ద్వారా యుట్యూబ్‌లో ఒక మనిషిన చంపడం, శరీర భాగాలను విడిగా చేయడంఎలా అని సేర్చ్ చేసి తెలుసుకున్నాడు. దానికనుగుణంగానే సెప్టెంబర్ 15న కత్తులన తెచ్చుకోగా అదే రోజు రాత్రి మృతుడు ఇంటికి వచ్చి పడుకున్నాడు. ఈ క్రమంలో 16న తెల్లవారుజామున సుమారు 5గంటల సమయంలో గొంతు బాగంపై బలంగా కత్తితో నరికి, మెడపై పలుమార్లు నరకి తల, మొండెం వేరు చేసాడు. ఆ క్రమంలో రూమ్‌వైపు ఎవరు రాకుండా నగ్మాను కాపలాగా పెట్టాడు. అదే కత్తితో శరీరభాగాలను ముక్కలు, ముక్కలుగా నరికి దుప్పటిలో మూటగా కట్టి మోటర్ సైకిల్‌పై తీసుకుని కరునగిరి ప్రాంతంలో పొదలలో గల చెత్తలో పారేశాడు. ఈ కేసును కామేపల్లి మండలం కెప్టెన్ బంజరకు చెందిన కొండ యాదగిరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తులో తెలీనట్లు వివరించారు. నిందితుడు ఉపయోగించిన హిరో గ్లామర్ ద్విచక్రవాహనం, మృతుని నుండి దోచుకున్న 2.7 తులాల బంగారు గొలుసు, అతని సెల్‌పోన్లు2, అలాగే నిందితులవి రెండు సెల్‌ఫోన్లు, నేరముకు ఉపయోగించిన రెండు కత్తులు,దుస్తులు స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురిపై పలు సెక్షన్ల క్రింద కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు చేదనలో కీలకంగా పనిచేసిన సింగరేణి సిఐ తిరపతిరెడ్డి, కామేపల్లి ఎస్ఐ బి.సాయి, కారేపల్లి ఎస్ఐ బి.గోపి, కానిస్టేబుల్‌లు సంపత్, ఆనంద్, అంజీ, రాజేష్, ఉపేందర్, సైదాలను ఏసీపీ అభినందించారు.

## పేద ప్రజల సమస్యలను పరిష్కారిస్తాం : బందు మహేందర్

**ప్రజాపక్షం/ తొర్రూరు :** స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎంపిటిసి, జెడ్‌పిటిసి ఎన్నికల్లో భారత కమ్యూనిస్టు పార్టీ పక్షాన పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్న అభ్యర్థుల గెలుపు కోసం ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని సిపిఐ తొర్రూరు మండల కార్యదర్శి బందు మహేందర్ అన్నారు. ఈ సందర్భంగా మహేందర్ మాట్లాడుతూ మండలంలోని అమ్మాపురం రెండు ఎంపిటిసి స్థానాలకు, కంఠాయపాలెం, వెలికట్ట, హరిపిరాల గ్రామాల ఎంపిటిసిల స్థానాలకు పోటీ చేయడానికి నిర్ణయించడం జరిగిందన్నారు. తొర్రూరు జెడ్‌పిటిసికి సిపిఐ పార్టీ పక్షాన పోటీ చేయడానికి నిర్ణయించడం జరిగిందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఐ పార్టీ అభ్యర్థులను గెలిపించి, ప్రశ్నించే గొంతులను ఆదరించాలని కోరారు.

పేద ప్రజల పక్షా, శ్రామిక వర్గం, రైతాంగ పక్షాన నిత్యం సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం చూపే ఎర్రజెండా పార్టీగా, సిపిఐ పార్టీ మండలంలో పని చేస్తుందన్నారు. ఈ ఎన్నికల్లో సిపిఐ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం పని చేయాలని కోరారు.

## మహబూబాబాద్‌లో మొదటి విడత ఎన్నికలు జరిగే స్థానాలు ఇవే !

**ప్రజాపక్షం/మహబూబాబాద్:** జిల్లాలో మొదటి విడతలో 9 జెడ్‌పిటిసి, 104 ఎంపిటిసి స్థానాలకు జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికలు జరిగే స్థానాల వివరాలు ఇలా ఉన్నాయి. బయ్యారం, చిన్న గూడూరు, దంతాలపల్లి, గార్ల, గూడూరు, మహబూబాబాద్, నరసింహులపేట, పెద్దవంగర, తొర్రూరు మండలాల్లో జెడ్‌పిటిసి, ఎంపిటిసి, స్థానాలకు (554) పోలింగ్ కేంద్రాల ద్వారా ఎన్నికలు నిర్వహిస్తారు.

ఉదయం పదిన్నరకు నోటిఫికేషన్ విడుదలైంది. 9 గురువారం నుంచి ఈ నెల అక్టోబర్ 11వరకు నామినేషన్ల స్వీకరణ. అక్టోబర్ 12న పరిశీలన, 15వరకు ఉపసంహరణ. అక్టోబర్ 23న మొదటి దఫా ఎన్నికలు, నవంబర్ 11న ఫలితాలు వెలువడే అవకాశం, జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ చర్యలు తీసుకుని సర్వం సిద్ధంగా ఉన్నారు.

## గవర్నర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న కలెక్టర్



**ప్రజాపక్షం/ జనగామ :** ఆర్‌టిఐ ధరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించినందుకు జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్‌కు అవార్డు దక్కింది. రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ శర్మ చేతుల మీదుగా గురువారం హైదరాబాద్‌లో కలెక్టర్ అవార్డు అందుకున్నారు. సమాచార హక్కు చట్టం వారోత్సవాలు గురువారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఘనంగా జరిగాయి. ఈ నేపథ్యంలో బెస్ట్ ఫెర్ఫార్మెన్స్ డిస్ట్రిక్ట్, బెస్ట్ పిఐఒ, బెస్ట్ డిపార్మెంట్ ఇన్ డిస్పోజల్ ఆఫ్ ఆర్‌టిఐ కేసెస్ మొదలగు ఏడు విభాగాల్లో పురస్కారాలను ప్రధానం చేశారు. ఈ క్రమంలో గవర్నర్ విష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా జిల్లా కలెక్టర్ అవార్డులు అందుకున్నారు. జిల్లాలో ఆర్‌టిఐ ధరఖాస్తులను ఎప్పటికి అప్పుడు పరిష్కరిస్తూ పెండింగ్ లేకుండా చూశారు. దీనితో బెస్ట్ ఫెర్ఫార్మింగ్ డిస్ట్రిక్ట్‌గా జనగామ ఎంపికైంది. దీనికి గాను జిల్లా కలెక్టర్‌కు అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ మాట్లాడుతూ ఎప్పటికి అప్పుడు ఆర్‌టిఐ ధరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని, పౌరులు అడిగిన సమాచారాని ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.

## ఉద్యమ కేసులో కోర్టుకు పొన్నాల

**ప్రజాపక్షం / జనగామ :** జనగామ జిల్లా ఉద్యమ కేసులో భాగంగా రాష్ట్ర మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య గురువారం జనగామ కోర్టుకు హాజరయ్యారు. కోర్టుకు హాజరై కోర్టు రిజిస్టర్‌లో సంతకం చేశారు. కోర్టులో తనను కలిసిన న్యాయవాధులు, పలువురు ప్రజలతో కరాచలం చేస్తూ గడిపారు. కోరుట హాల్ బయట కూడా అనేక మందిని కలిశారు. జిల్లా వచ్చి చాలా రోజులు అయినా కోర్టులో మాత్రం కేసు పోవడం లేదన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనతో పాటు జిల్లా కోసం పోరాటం చేయడం జరిగిందన్నారు. పొన్నాల వెంట బిఆర్ఎస్ నాయకులు దర్మపురి శ్రీనివాస్, మాజిద్, ధర్మపురి శ్రీనివాస్, హరిచంద్రగుప్త, రాజు, ఆకుల సతీష్ తదితరులు ఉన్నారు.

## ఎమ్మెల్యే దొంతికు రమేష్ పరామర్శ



**ప్రజాపక్షం/ నర్సంపేట :** నర్సంపేట శాసన సభ్యులు దొంతి మాధవరెడ్డి మాతృమూర్తి దొంతి కాంతమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. గురువారం సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పంజాల రమేష్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి తల్లి కాంతమ్మ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి, అనంతరం ఎమ్మెల్యేను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో నర్సంపేట మండల కార్యదర్శి అయిత యాకుబ్, ఎన్ఎఫ్ఐడబ్ల్యు జిల్లా అధ్యక్షురాలు పాలక కవిత, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు దిడ్డి పార్థసారధి, మాదన్నపేట రోడ్ సిపిఐ శాఖ కార్యదర్శి పిట్టల సతీష్, సహాయ కార్యదర్శి బాధరబోయిన యాదగిరి, గడ్డం నాగరాజు, మాతంగి సురేష్, అరుణ, గౌరబోయిన పద్మ, కోలుగురి రాధిక తదితరులుపాల్గొన్నారు. అనంతరం నర్సంపేట పట్టణానికి చెందిన స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధులు హన్మకొండలోని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి నివాసంలో ఎమ్మెల్యేను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంధ సంస్థల సమాఖ్య అధ్యక్షులు, కన్స్యూమర్ ఫోరమ్ జిల్లా అధ్యక్షులు గిరగాని సుదర్శన్ గౌడ్, ఏఎస్ఆర్ సంస్థ నిర్వాహకులు ఎర్రబోయిన రాజశేఖర్, స్వయంకృషి సంస్థ నిర్వాహకులు బెజ్జంకి ప్రభాకర్, ప్రతిభ సంస్థ ప్రతినిధి బోయిని వెంకటస్వామి, స్వేచ్ఛ సంస్థ నిర్వాహకురాలు మైస వసంత, కన్స్యూమర్ ఫోరమ్ విజిలెన్స్ కమిటి మెంబెర్ నాగేల్లి సారంగం గౌడ్, మెడికల్ స్టోర్స్ అసోసియేషన్ ప్రతినిధి రవికాంత్, సోషల్ వాలంటీర్ కాసుల వెంకటాచారి, రిటైర్డ్ ఫారెస్ట్ ఆఫీసర్ కుమారస్వామి తదితరులుపాల్గొన్నారు.

## ఉద్యమకారులు, కమ్యూనిస్టులకు ఆదర్శం 'చె గువేరా'



**ప్రజాపక్షం/నెక్కొండ:** ప్రపంచ వ్యాప్తంగా ఉద్యమకారులు, కమ్యూనిస్టులకు చెగువేరా ఒక ఆదర్శ ప్రతిమ అని వరంగల్ జిల్లా ఏఐటియుసి కార్యదర్శి, నెక్కొండ మండల సిపిఐ నాయకుడు కందిక చెన్నకేశవులు అన్నారు. చేగువేరా వర్ధంతి సందర్భంగా నెక్కొండలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. చెన్నకేశవులు మాట్లాడుతూ.. 1967 అక్టోబరు 9న బొలివియాలోని హిగువేరాలో చెగువేరాను ఉరిత తీశారన్నారు. క్యూబా విప్లవంలో చెగువేరా కీలక పాత్ర పోషించారని, ఫిడెల్ క్యాస్ట్రోతో కలిసి కమాండర్‌గా సైనిక యుద్ధాల్లో పాల్గొన్నారన్నారు. విప్లవ యోధుడిగా సైనికులకు ధైర్యం నింపిన నాయకుడని, శత్రువులు క్రూరంగా హత్యచేసి ఆయన శవాన్ని కనిపించని విధంగా మాయం చేశారన్నారు. అలాంటి మహానుభావుడి జీవితం ప్రతీ ఉద్యమకారుడికి స్ఫూర్తి. ప్రజల సమస్యలపై పోరాడే ప్రతీ ఒక్కరూ చెగువేరా ఆత్మ స్ఫూర్తిని తమలో కలిగించుకోవాలన్నారు.

## మృతురాలి కుటుంబానికి సిపిఐ నాయకులు పరామర్శ



**ప్రజాపక్షం/ తొర్రూరు :** మండలంలోని జీకె తండా గ్రామానికి చెందిన బానోతు చంద్రమ్మ ఆకస్మికంగా మృతి చెందడంతో సిపిఐ అమ్మాపురం గ్రామ శాఖ తీవ్ర దిగ్భ్రాంతిని తెలిపింది. సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ మాజీ సభ్యులు తమ్మెర విశ్వేశ్వర్‌రావు, సిపిఐ నాయకులు యం.రమేష్, లక్ష్మణ్, యాకాంతం తదితరులు జీకె తండా గ్రామానికి చేరుకొని బానోతు చంద్రమ్మ భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. చంద్రమ్మ కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. చంద్రమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించిన వారిలో సిపిఐ నాయకులు, పలు పార్టీల నాయకులు, తండ గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

# నిఖార్సైన వామపక్ష నేత పుసులూరి

### సిపిఐ జాతీయ కమిటీ సభ్యుడు బాగం హేమంతరావు



**ప్రజాపక్షం/మహబూబాబాద్:** వామపక్ష భావజాలంతో పేదల అభ్యున్నతికి, సమాజ శ్రేయస్సు కు దోహదాపడడానికి, అలాగే కుటుంబానికి సమ న్యాయంతో వ్యవహరించిన మహనీయుడు పుసులూరి రంగన్న అని సిపిఐ జాతీయ కమిటీ సభ్యులు భాగం హేమంతరావు, మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి బి. విజయ సారథిరెడ్డి అన్నారు. సిపిఐ మండల కార్యదర్శిగా, జిల్లా కార్యవర్గ సభ్యుడిగా పనిచేశారని అన్నారు. పుసులూరు రంగన్న సంస్మరణ సభ మహబూబాద్ జిల్లా బయ్యారం మండల కేంద్రంలో గురువారం కమ్మ ఫంక్షన్ హాలులో సిపిఐ మండల కార్యదర్శి సారి క శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించగా ఆ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు కట్టెబోయిన శ్రీనివాస్, ఇల్లందు మాజీ శాసనసభ్యులు గుమ్మడి నరసయ్య, సిపిఎం జిల్లా నాయకులు మండ రాజ న్న, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య పా ల్గొని మాట్లాడుతూ కుటుంబంలో, సమాజంలో అంద రి మన్నలను పొంది సిపిఐ పార్టీ అభివృద్ధికి పాటుపడిన వ్యక్తి అని, ఒకే పార్టీలో ఉంటూ పార్టీని వీడకుండా పలువురికి ఆదర్శంగా పనిచేశారని తెలిపారు. నిత్యం పేద ప్రజల బాగోగుల కోసం తపించే వార ని తన జీవితంలో రంగన్న భార్య ఈ మధ్యకాలంలో అనారోగ్యంతో మృతి చెందడం, అది మరిచిపోక ముందే రంగన్నను కోల్పోవడం పార్టీకి, కుటుంబ సభ్యులకు తీరని నష్టమని ఆవేదన వ్యక్తం చేశారు. వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్తామని తెలిపారు. రంగన్న సంస్మరణ సందర్భంగా వారి కుటుంబ సభ్యులు శ్రీలత, శ్రీలక్ష్మి అమ్మానాన్న ప్రేమలను ఎన్నటికీ మర్చిపోమని వారి తండ్రి సంస్మరణ సభలో గుర్తు చేసుకొని కన్నీటి పర్యంతమయ్యారు. మా అమ్మా నాన్నలు ఆడపిల్లలమని ఎప్పటికీ దిగులు పడలేదని, మా పెళ్లిళ్లు అయిన తర్వాత కూడా అల్లుళ్లను కూడా సొంత కొడుకుల వలె ప్రేమించారని, వారి సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్, సిపిఐ మహిళా సంఘం జిల్లా నాయకురాలు నాదెండ్ల పద్మ, జిల్లా కమిటీ సభ్యులు అజయ్ సారధి రెడ్డి, నల్లు సుధాకర్, ఇల్లందు నియోజకవర్గ సిపిఐ నాయకులు, సిపిఎం మండల కార్యదర్శి నంబూరి మధు, కాంగ్రెస్ పార్టీ నాయకులు,తిరుమల ప్రభాకర్ రెడ్డి, మూల మధుకర్ రెడ్డి, సత్తిరెడ్డి, కళింగ రెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

## అపేస్ ఐడి హాజర్ పద్ధతిని వెనికి తీసుకోవాలి

**ప్రజాపక్షం/ వరంగల్ :** సికెఎం ప్రసూతి ఆస్పత్రిలో అబాస్ పేరుతో పేస్ ఐడి హాజర్ వేసే పద్ధతిని ఈ రాష్ట్ర ప్రభుత్వం వెనికి తీసుకోవాలని ఎఐటియుసి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్ డిమాండ్ చేశారు. గురువారం సికెఎం ఆర్ఎంఒకు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సికెఎం హాస్పటల్లో పనిచేస్తున్న సానిటేషన్, పేషంట్ కేర్, సెక్యూరిటీ కార్మికులకు కొత్తగా అబాస్ పేరుతో పేస్ ఐడి హాజర్ వేసే పద్ధతిని వెనకి తీసుకోవాలన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కాం ట్రాక్టు కార్మికుల పైన సవతి తల్లి ప్రేమ చూపిస్తుందని, చిన్న కార్మికులైన వారిపైన పెను భారం మోపుతుందన్నారు. అబ్బాస్ పేరుతో కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తుందని, కార్మికులు ఫేస్ ఐడి చూపించాలన్న, కొద్దిగా లేటు అయిన కార్మికులకు జీతం కట్ అయ్యే అటువంటి పరిస్థితులు కళ్లకుకట్టినట్లు కనిపిస్తుందన్నారు. సూపర్‌వైజర్లు అబ్బాస్ యాఫ్ పేరుతో కార్మికుల పెస్ తీసుకోవడం జరుగుతుందని, ఒకవేళ లేట్ అయితే మూడు సార్లు అబాసుకు ఫేస్ ఐడి కనబడకపోయినచో ఒకరోజు వేతనము కార్మికులకు తె లియకుండానే కట్టయ్యే ప్రమాదము ఉందన్నారు. ఎఐటియుసి వ రంగల్ జిల్లా సహాయ కార్యదర్శి దామెర కృష్ణ, సికెఎం హాస్పటల్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు కలకోట్ల రాజు, నాగవెల్లి శంక ర్, సక్కుబాయి, సులోచన, సీనయ్య, సురేష్, రవీందర్, సుగుణ, సుప్రజ, సమ్మయ్య, రాము, వాణి, శ్రీశైలం, గిరి పాల్గొన్నారు.

## పోటీకి కార్యకర్తలు సన్నద్ధం కావాలి

### సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నల్లు సుధాకర్ రెడ్డి



**ప్రజాపక్షం/మరిపెడ:** ఆత్మ కమిటీ చైర్మన్ స్థానిక సంస్థల ఎన్నికలలో పార్టీ ప్రాతినిధ్యం పెంచే విధంగా పొత్తులతో సంబంధం లేకుండా పోటీకి కార్యకర్తలు సన్నద్ధం కావాలని ఆత్మ కమిటీ చైర్మన్, సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, నల్లు సుధాకర్ రెడ్డి పిలుపు నిచ్చారు. మరిపెడ మండల కేంద్రంలో జరిగిన పార్టీ మండల కమిటీ సమావేశంలో పాల్గొన్న సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో అధికార పార్టీపొత్తుతో సంబంధం లేకుండా, మన పార్టీ ప్రాతినిధ్యం పెంచే వి ధంగా బలమైన అభ్యర్థులను ఎంపిక చేసి పోటీలో నిలుపుదామని అన్నా రు. గత బీఆర్ఎస్ పదేండ్ల ప్రజా వ్యతిరేక పాలన, బిజెపి అవలంబిస్తున్న మతతత్వ, నియంతృత్వ విధానాలను ప్రతిఘటించే విధంగా వారికి బుద్ధి చెప్పి ప్రజల సమస్యల పరిష్కారం కోసం పనిచేసే సిపిఐ అభ్యర్థులకు స్థానిక సంస్థల ఎన్నికలలో ప్రజలు పట్టం కట్టాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి మారగాని బాలకృష్ణ, జిల్లా కౌన్సిల్ సభ్యులు అబ్దుల్ రషీద్, గాడిపల్లి వెంకన్న, తురక రమేష్, పాల్గొన్నారు.

## నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్



**ప్రజాపక్షం/ వరంగల్ :** స్థానిక సంస్థల ఎన్నికలలో భాగంగా రాష్ట్ర ఎన్నికల కమిషన్ విడుదల చేసిన షెడ్యూల్ ను అనుసరిస్తూ వరంగల్ జిల్లాలో తొలి విడత ఎంపిటిసి, జడ్పిటిసి స్థానాలకు రిటర్నింగ్ అధికారులు గురువారం నోటిఫికేషన్ లు జారీ చేయగా, నామినేషన్ల స్వీకరణ ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. వరంగల్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని 5 మండలాలైన గీసుగొండ, సంగెం, పర్వతగిరి, వర్ధన్నపేట, రాయపర్తి, జెడ్‌పిటిసి స్థానాలతో పాటు, పై మండలాల పరిధిలోని 64 ఎంపిటిసి స్థానాలకు ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ నేపథ్యంలో గీసుగొండ, మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ సత్య శారద గురువారం ఆకస్మికంగా సందర్శించి, అందుబాటులో ఉన్న సదుపాయాలు, అవసరమైన అన్ని ఏర్పాట్లను పరిశీలించారు.హెల్ప్ డెస్క్, వీడియోగ్రాఫీ, పోలీస్ బందోబస్తు తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ, సపోర్టింగ్ స్టాఫ్ సరిపడా ఉన్నారా అని ఆరా తీశారు. నోటీసు బోర్డులపై ప్రదర్శించిన నోటిఫికేషన్ పత్రాలను తనిఖీ చేశారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా నామినేషన్ల ప్రక్రియను నిర్వహించాలని, నామినేషన్ దరఖాస్తు ఫారాలు తీసుకున్న వారి వివరాలను కూడా రిజిస్టర్ లో నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. దాఖలైన నామినేషన్లకు సంబంధించిన అఫిడవిట్‌లను ఏ రోజుకు ఆ రోజు నోటీసు బోర్డులపై ప్రదర్శిస్తూ, జిల్లా కేంద్రానికి సకాలంలో రిపోర్టులు పంపించాలని ఆర్‌ఓలకు సూచించారు. ప్రతి నామినేషన్ సెంటర్ వద్ద హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామని, నామినేషన్‌పత్రాలు దాఖలు చేసే విషయంలో అభ్యర్థులకు అవసరమైన సహకారం అందించాలని సూచించారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను తూచ తప్పకుండా పాటిస్తూ, ప్రశాంత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియను నిర్వహించాలన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి పక్కాగా అమలయ్యేలా చూడాలన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎలాంటి సందేహాలు ఉన్నా, పై అధికారులను సంప్రదించాలని సూచించారు. కలెక్టర్ వెంట జిల్లా పరిషత్తు సిఈఓ రామిరెడ్డి, ఎంపిడిఓ కృష్ణవేణి, తహసీల్దార్ రియాజోద్దీన్, స్థానిక అధికారులు తదితరులు ఉన్నారు.

## సిజిహెచ్ఎస్ వెల్‌నెస్ సెంటర్‌కు భవన పరిశీలన

### సెంటర్ ఏర్పాటుకు సిజిహెచ్ఎస్ అడిషనల్ డైరెక్టర్‌తో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఎంపి కావ్య



**ప్రజాపక్షం/హనుమకొండ :** వరంగల్ నగరంలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు మెరుగైన వైద్య సేవలను అందించాలనే లక్ష్యంతో సెంట్రల్ గవర్నమెంట్ హెల్త్ స్కీమ్ (సిజిహెచ్ఎస్) వెల్‌నెస్ సెంటర్ స్థాపనకు కృషి చేస్తున్న వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య గురువారం స్వయంగా క్షేత్రస్థాయిలో భవనాలను పరిశీలించారు. ఇటీవల కలెక్టర్, వరంగల్ మున్సిపల్ కమిషనర్ సంబంధిత అధికారులతో పలు భవనాలను పరిశీలించి, ఎంపిక చేసిన భవనాల వివరాలను ఎంపి డాక్టర్ కావ్య హైదరాబాదులోని సిజిహెచ్ ఎస్ అడిషనల్ డైరెక్టర్ రోహిణికి తెలియజేస్తూ, సెంటర్ ఏర్పాటుకు అనువైన భవనాల ఎంపికను త్వరితగతిన పూర్తి చేయాలని సిజిహెచ్ఎస్ డైరెక్టర్‌కి సూచించారు. ఈ క్రమంలో గురువారం సిజిహెచ్ఎస్ అడిషనల్ డైరెక్టర్ రోహిణి హనుమకొండ చేరుకుని ఎంపి డాక్టర్ కడియం కావ్యతో కలిసి పలు ప్రభుత్వ భవనాలను పరిశీలించారు. హనుమకొండలోని కాజీపేట డివిజన్ మున్సిపల్ కార్యాలయం, దూరదర్శన్ కార్యాలయంతో పాటు వసతి గృహం, వరంగల్ పాత కలెక్టర్ వసతి గృహం, కుడా కార్యాలయాలను సందర్శించి వాటి స్థితిగతులు, సౌకర్యాలు, విస్తీర్ణం వంటి వివరాలను తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఎంపి డాక్టర్ కావ్య అధికారులు, ఇంజనీర్లతో కలిసి సెంటర్‌కు అవసరమైన మౌలిక వసతులపై చర్చించారు. భవనం ఎంపిక ప్రక్రియను తక్షణం పూర్తి చేసి సెంటర్ ప్రారంభానికి చర్యలు తీసుకోవాలనిసిజిహెచ్ ఎస్ అధికారులకు ఎంపీ డాక్టర్ కడియం కావ్య సూచించారు. తరువాత హనుమకొండలోని కనకదుర్గ కాలనీలోని ఎంపి కార్యాలయంలో పెన్షనర్లు డాక్టర్ కడియం కావ్యను కలిసి సిజిహెచ్ ఎస్ వెల్నెస్ సెంటర్ మంజూరుకు చేస్తున్న కృషికి కృతజ్ఞతలు తెలిపారు. వెంటనే భవనాల పరిశీలనకు సిజిహెచ్ ఎస్ డైరెక్టర్ తో ముందడుగు వేయడంపై ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఓ డా.అప్పయ్య, సిజిహెచ్ ఎస్ అధికారులు, ఇతరఅధికారులుతదితరులుపాల్గొన్నారు.

## అక్రమ కేసులు ఎత్తివేయాలి

### సిపిఐ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అజయ్ సారధి రెడ్డి డిమాండ్



**ప్రజాపక్షం/మహబూబాబాద్ :** ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేయాలని నాడు ఆర్‌టిసి కార్మికులకు మద్దతుగా చేసిన పోరాటంలో భాగంగా నేడు సిపిఐ నేతలు శ్రేణులు కోర్టుకు హాజరయ్యారు ఈ సందర్భంగా సిపిఐ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి అజయ్ సారథి రెడ్డి మాట్లాడుతూ గత బిఆర్ఎస్ పాలనలో ఉద్యమకారులపై అక్రమంగా కేసులు పెట్టారన్నారు. కార్మికుల మద్దతుగా 50 రోజులపాటు సిపిఐ ఏఐటియుసి ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించామని నూతనంగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గత బిఆర్ఎస్ పాలనలో సిపిఐ నేతలపై, ఉద్యమకారులపై పెట్టిన కేసులన్నీ ఎత్తివేయాలని ఆయన కోరారు. కోర్టుకు హాజరైన వారిలో పెరుగు కుమార్, దేశ పల్లి నవీన్, చింత కుంట్ల వెంకన్న, మామిండ్ల సాంబలక్ష్మి, వెలుగు శ్రావణ్, ఎండి ఫాతిమా, మంద శంకర్, కందుకూరి లక్ష్మీ నరసు, రామ నర్సు, బాబు, వెంకన్న, శ్రీనివాస్, బాలాజీ, షంషీర్, రమేష్, జిలకర పవన్, తండ మాధవి, ఎండి అలీమా, ఖాజామీయా, కోన సత్యం హాజరయ్యారు.

## పంట మార్పిడి విధానంతో అధిక దిగుబడి

### నీతి ఆయోగ్ ప్రభరి అధికారి పౌసమి



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** పంట మార్పిడి విధానం ద్వారా అధిక దిగుబడి సాధనకు రైతులకు అవగాహన కల్పించాలని నీతి ఆయోగ్ ప్రభరి అధికారి పౌసమి బసు పేర్కొన్నారు. గురువారం ఐడిఓసి కార్యాలయంలో ఆకాంక్షి త జిల్లాలో అభివృద్ధి సూచికలపై వైద్య, విద్య, మహిళా, శిశు సంక్షేమం, డిఆర్‌డిఎ, పశు సంవర్థక శాఖల అంశాలపై సమగ్ర సమీక్ష జరిపారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సమావేశంలో పాల్గొని వివిధ రంగాల్లో జరుగుతున్న కార్యక్రమాల పురోగతిని వివరించారు. ఈ సందర్భంగా ప్రభరి అధికారి పౌసమి బసు మాట్లాడుతూ, రైతులు పంట మార్పిడి పద్ధతులు అవలంభించడం ద్వారా భూమి సారాన్ని కాపాడుకోవడంతో పాటు అధిక దిగుబడులు సాధించవచ్చని సూచించారు. అలాగే వైద్య, విద్యా రంగాల్లో గుణాత్మక మెరుగుదలకు చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడాలని, ఆ దిశగా అధికారులు కార్యాచరణ కొనసాగించాలని నీతి ఆయోగ్ ప్రభరి అధికారి పౌసమి బసు తెలిపారు. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడాలని, ఆదిశగా కార్యాచరణ కొనసాగించాలని జిల్లా అధికారులకు సూచించారు. ప్రతి శాఖ నిరంతరం పర్యవేక్షణ, సమగ్ర సమన్వయంతో అభి వృద్ధి కార్యక్రమాలను వేగవంతంగా అమలు చేయవలసిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం. 10వ తరగతిలో నూరు శాతం ఫలితాలు రావాలి. ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానం సాధించాలి. వెనుకంజలో ఉన్న విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నందుకు అభినందించారు. యాస్పిరేషన్ అంశాలల్లో రాష్ట్ర గవర్నర్ నుండి అవార్డు తీసుకోవడం పట్ల అభినందించారు. ఈ కార్యక్రమంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, జిల్లా వైద్యాధికారి డా. మధుసూదన్, మ హిళా సిశు సంక్షేమ అధికారి మల్లీశ్వరి, పిపిఒ బాబూరావు, డిఆర్‌డిఓ బా లకృష్ణ, డిఇఒ రాజేందర్, పశు వైద్య శాఖ ఎడి గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## బిసి రిజర్వేషన్లపై హైకోర్టు తీర్పు ఆక్షేపణీయం

### బిసి హక్కుల రాష్ట్ర సాధన సమితి ఉప ప్రధాన కార్యదర్శి నేదునూరి రాజమౌళి




**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** రాష్ట్ర శాసనసభలో ప్రభుత్వ ప్రతిపక్ష పార్టీలన్నీ ఏకగ్రీవంగా బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని ఏకగ్రీవ తీర్మానం చేయడం జరిగిందని, కానీ టిఆర్ఎస్, బిజెపి దొడ్డిదారిన కొంతమందిని ప్రోత్సహించి రిజర్వేషన్లకు వ్యతిరేకంగా హైకోర్టులో పిటిషన్ వేయించడం దుర్మార్గమైన చర్య అని, హైకోర్టు స్టే ఇవ్వడం ఆక్షేపణీయమని బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి నేదునూరి రాజమౌళి తెలిపారు. గురువారం హనుమకొండలోని బాలసముద్రంలో జరిగిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో శాసనసభ ద్వారా చేసిన శాసనాన్ని గవర్నర్ పెండింగ్‌లో పెట్టడం, కోర్టు స్టే ఇవ్వడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం పాలు చేయడం అని తెలిపారు. జిఒ నంబర్ 9ద్వారా రిజర్వేషన్లు పెంచిన రాష్ట్ర ప్రభుత్వాన్ని స్వాగతించవలసింది పోయి దొడ్డి దారి ద్వారా అడ్డుకోవడం అప్రజాస్వామికమన్నారు. 56 శాతం ఉన్న బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వడం కాదని కోర్టు తీర్పులు బ్రహ్మ పదార్థం కాదని ప్రజాస్వామ్యంలో ప్రభుత్వ నిర్ణయాలే శిరోధార్యం కావాలని పేర్కొన్నారు. సామాజిక న్యాయం రాజకీయరంగంలో స్థానిక సంస్థల ఎన్నికల ద్వారా నిర్వర్తించే నిర్ణయం ప్రభుత్వ ఉత్తరువులను స్వాగతించాల్సిన ప్రతిపక్ష పార్టీలు వ్యతిరేకించడం విచారకరమన్నారు. హైకోర్టు చెప్పినట్లు వెంటనే రాజకీయ పార్టీలు 42 శాతం రిజర్వేషన్స్ మద్దతు తెలుపుతూ ఇంప్లీట్స్ ఇవ్వాలని కోరినారు. ప్రభుత్వం వెంటనే స్పందిస్తూ న్యాయ పోరాటాన్ని కొనసాగించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు టి.వెంకట్ రాములు, జిల్లా అధ్యక్షులు సదానందం న్యాయవాది, సామాజికవేత్త సాయిని నరేందర్, దొమ్మాటి ప్రవీణ్ కుమార్, గుంటి రాజేందర్, కే రవి తదితరులు పాల్గొన్నారు.

## దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లు

### వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగ రాజు



**ప్రజాపక్షం/ వర్ధన్నపేట:** వర్ధన్నపేట నియోజకవర్గంలో అర్హులైన లబ్ధిదారులకు దశలవారీగా ఇందిరమ్మ ఇల్లు కేటాయిస్తామని, దాదాపుగా 90శాతం ఇండ్ల నిర్మాణాలు పూర్తిచేయడం జరిగిందని వర్ధన్నపేట ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు అన్నారు. గురువారం హనుమకొండలోని సుబేదారి ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు ఇంటి ఆవర్ణంలోని క్యాంపు కార్యాలయంలో ఐదుగురి ఇందిరమ్మ లబ్ధిదారులకు ఇళ్ల మంజూరి పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 1వ డివిజన్ పరిధిలోని 5మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజురు పత్రాలను పంపిణీ అందిచామన్నారు. ఎక్కడా అవినీతిలేకుండా లబ్ధిదారుల ఎంపిక జరిగిందన్నారు. ఇందిరమ్మ కమిటీ సభ్యులకు, గ్రామ, మండల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామాల్లో కొత్త పాత, తెడా లేకుండా అందరినీ సమన్వయం చేసుకొని సమిష్టి నిర్ణయంతో కాంగ్రెస్ పార్టీ బలోపితం చేయాలని పిలుపు నిచ్చారు. జరుగనున్న స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పని చేయాలని కార్యకర్తలకు సూచించారు. పెగడపెల్లి ఫాక్స్ చైర్మన్ చల్ల గోపాల్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు దేవరకొండ అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# క్రీడ



## మహిళల వన్డే క్రికెట్‌లో చరిత్ర సృష్టించిన మంధాన

భీకర ఫామ్‌లో ఉన్న భారత మహిళల జట్టు ఓపెనర్ స్మృతి మంధాన రికార్డుల దుమ్ముదులుపుతోంది. ఇప్పటికే ఏడాదిలో నాలుగు శతకాలతో రికార్డు నెలకొల్పిన ఈ సొగసరి బ్యాటర్.. మరో రికార్డు తన పేరిట రాసుకుంది. ఒకే ఏడాది వన్డేల్లో అత్యధిక పరుగులతో చరిత్ర సృష్టించిందీ డాషింగ్ ఓపెనర్. స్వదేశంలో జరుగుతున్న మహిళల వన్డే వరల్డ్ కప్ రెండు మ్యాచుల్లో విఫలమైన మంధాన.. దక్షిణాఫ్రికాతో మ్యాచ్‌లో ఏడు పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద ఈ ఘనత సాధించింది. ఈ ఏడాది విధ్వంసక బ్యాటింగ్‌తో అలరిస్తున్న మంధాన 972 పరుగులతో ఆస్ట్రేలియా దిగ్గజం బెలిండా క్లార్క్ రికార్డును బద్ధలు కొట్టింది. వరల్డ్ కప్ ముందు ఆస్ట్రేలియాపై రెండు సెంచరీలతో కదం తొక్కిన మంధాన ఆసీస్ వెటరన్ క్లార్క్ రికార్డుకు దగ్గరైంది. సఫారీలతో మ్యాచ్‌లో ఆమె 1997లో 970 పరుగులతో క్లార్క్ నెలకొల్పిన ఆల్‌టైమ్ రికార్డును బద్ధలు కొట్టింది. ప్రస్తుతానికి వన్డేల్లో ఒక ఏడాదిలో అత్యధిక పరుగుల రాణుల జాబితాలో మంధాన టాప్‌లో కొనసాగుతుండగా.. దక్షిణాఫ్రికా కెప్టెన్ లారా వొల్వార్డ్ 2022లో 882 రన్స్‌తో మూడో స్థానంలో ఉంది. డెబ్బీ హాక్లే (న్యూజిలాండ్ 1997లో 880 రన్స్‌తో నాలుగో స్థానంలో నిలవగా.. 2016 లో ఆ దేశానికే చెందిన అమీ సటెర్‌వైట్ 853 పరుగులతో ఐదో స్థానం దక్కించుకుంది.

## ప్రపంచ జూనియర్ మిక్స్‌డ్ టీమ్ చాంపియన్‌షిప్స్‌లో భారత్ క్వార్టర్స్‌కు



**గువాహటి:** బిడబ్ల్యుఎఫ్ ప్రపంచ జూనియర్ బ్యాడ్మింటన్ ఛాంపియన్షిప్లో భారత్ జోరు కొనసాగుతోంది. మిక్స్డ్ టీమ్ వరుసగా మూడో విజయంతో భారత్ క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. బుధవారం జరిగిన గ్రూపు హెచ్ పోరులో భారత్ 45–37, 45–34తో యుఎఇపై విజయం సాధించింది. ఇంతకు ముందు నేపాల్, శ్రీలంకపై సాధికారికంగా గెలిచిన భారత్.. చివరి లీగ్ మ్యాచ్లోనూ ఆధిపత్యం కనబరిచింది. బాలికల సింగిల్స్‌లో తన్విశర్మ 9–5తో ప్రాకృతి భరత్ (యుఎఇ)పై నెగ్గి భారత్‌కు శుభారంభం అందించింది. మిక్స్డ్ డబుల్స్‌లో ఆదిత్య కిరణ్ సాక్షి జంటపై లాలమంగా విశాఖ టోపో జోడీ గెలవడంతో భారత్ 18–10తో ఆధిక్యం సంపాదించింది. బాలుర సింగిల్స్‌లో లలాజాలా, డబుల్స్ భార్గవ రామ్ అరిగెల విశ్వతేజ గొబ్బూరు తడబడినా 45–37తో మొదటి సెట్ను భారత్ కైవసం చేసుకుంది. రెండో సెట్లో తన్వి స్థానంలో ఉన్నతి హుడా.. లలాజౌలా బదులు సూర్యాంష్ రావత్ బరిలో దిగారు. ఉన్నతి 9–6తో ప్రాకృతిపై నెగ్గడంతో భారత్ వెనుదిరిగి చూడలేదు. వరుసగా అన్ని మ్యాచ్‌లో పైచేయి సాధించిన భారత్ 45–34తో రెండో సెట్ గెలుచుకుంది.

ఆయా గ్రూపుల్లో విజేతలుగా నిలిచిన జపాన్ (గ్రూపుఎ), అమెరికా (బి), చైనా (డి), ఇండోనేసియా (ఎఫ్) నాకౌట్ చేరుకున్నాయి. క్వార్టర్స్ గ్రూపుజి విజేతతో భారత్ తలపడనుంది.

## వందలోపే నాలుగు వికెట్లు..

### భారమంతా కెప్టెన్‌పైనే..!

వైజాగ్‌లో చెలరేగిపోతారనుకుంటే భారత బ్యాటర్లు డగౌట్‌కు క్యూ కడుతున్నారు. దక్షిణాఫ్రికా బౌలర్లను ఉతికారేస్తారనుకుంటే పేలవ షాట్లతో వికెట్లు సమర్పించుకుంటున్నారు. ఓపెనర్ ప్రతీకా రావల్ (37) తర్వాత వచ్చిన జెమీమా రోడ్రిగ్స్ డకౌట్ అయింది. చోలే ట్రయాన్ వేసిన 21వ ఓవర్లో నాలుగో బంతికి స్వీప్ షాట్ ఆడబోయిన ఆమె ఎల్బీగా వెనుదిరిగింది. దాంతో.. 92 వద్ద టీమిండియా నాలుగో వికెట్ పడింది. ప్రస్తుతం కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్(3 నాటౌట్), దీప్తి శర్మలు క్రీజులో ఉన్నారు. వీరిద్దరు కనీసం అర్ధ శతకం భాగస్వామ్యం అయినా నెలకొల్పితేనే భారత్ మెరుగైన స్థితిలో నిలిచే అవకాశముంది. మహిళల వన్డే వరల్డ్ కప్‌లో భారత ఓపెనర్లు మరోసారి నిరాశపరిచారు. శుభారంభం లభించినా స్మృతి మంధాన (23) స్వల్ప స్కోర్‌కే వెనుదిరగగా.. దూకుడుగా ఆడే క్రమంలో ప్రతీకా రావల్(37) వికెట్ కోల్పోయింది. అనంతరం వచ్చిన జెమీమా రోడ్రిగ్స్ బాధ్యతగా ఆడాల్సింది పోయి ఎల్బీగా వెనుదిరిగింది. చోలే ట్రయాన్ ఓవర్లో స్వీప్‌షాట్‌కు యత్నించిన తను వికెట్ సమర్పించుకుంది. 92కే నాలుగు వికెట్లు పడడంతో.. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ జట్టుకు పోరాడగలిగే స్కోర్ అందించే పనిలో నిమగ్నమైంది.



## ఫోకస్

# ‘మేధో’ వైకల్యం అంటే..

దివ్యాంగుల జాబితాలో కేవలం శారీరక వైకల్యం ఉన్నవారేగాక, మేధోపరమైన వైకల్యం (Intellectual Disability)తో బాధపడుతున్న వారు కూడా చేరుతారు. ఇది ఒక వ్యక్తి యొక్క ఆలోచన, అర్థం చేసుకోవడం, నేర్చుకోవడం, సమస్యలు పరిష్కరించడం, రోజువారీ పనులు చేసుకోవడంలో ఉన్న శక్తి సాధారణ స్థాయి కంటే తక్కువగా ఉండే పరిస్థితి. దీనిని సాధారణంగా చిన్న వయసులోనే గుర్తించవచ్చు. ఈ రకమైన వైకల్య లక్షణాలను పరిశీలిస్తే, మాట్లాడే భాషను ఆలస్యంగా నేర్చుకోవడం లేదా సరిగా ఉపయోగించలేకపోవడం ప్రధానంగా కనిపిస్తుంది. చదువు, లెక్కలు, జ్ఞాపకం వంటి నేర్చుకునే ప్రక్రియలు నెమ్మదిగా సాగడం, సమస్యలు పరిష్కరించడం, నిర్ణయాలు తీసుకోవడంలో కష్టాలు, స్వయం సంరక్షణ (ఆహారం, దుస్తులు, పరిశుభ్రత) లో ఇబ్బందులు ఉంటాయి. అదే విధంగా సామాజిక సంబంధాలు అంతగా ఉండవు. వీరు ఇతరులతో కలిసిపోవడంలో కష్టం. ఈ మేధోపరమైన వైకల్యానికి ఎన్నో కారణాలు ఉన్నాయి. వాటిలో జన్యుపరమైన ‘డౌన్ సిండ్రోమ్’, ‘జన్యు లోపాలు’ ముఖ్యమైనవి. గర్భధాలరణ సమయంలో పౌష్టికాహార లోపం, ఇన్ఫెక్షన్లు, మద్యం లేదా డ్రగ్స్ వాడకం తదితర కారణాలు, ప్రసవ సమయంలో ఆక్సిజన్ లోపం లేదా నెలలు నిండకుండానే పుట్టడం




వంటి అంశాలు కూడా మేధోపరమైన వైకల్యాలకు కారణమవుతాయి. జననం తర్వాత తల గాయాలు, ఇన్ఫెక్షన్లు, తీవ్రమైన జ్వరాలు వంటి అంశాలు ప్రభావితం చేస్తాయి. మేధోపరమైన వైకల్యం కలిగిన వారికి ప్రత్యేక హక్కులను భారత రాజ్యాంగం, దివ్యాంగుల హక్కుల చట్టం 2016 కల్పించాయి. వీటిని అనుసరించి, మేధోపరమైన వైకల్యంగల వారికి కూడా ప్రతి పౌరుడిలాగే గౌరవం, స్వేచ్ఛ, సమాన అవకాశాలు పొందే హక్కు ఉంటుంది. అదే విధంగా వీరికి గల విద్యా హక్కు కింద, ప్రత్యేక పాఠశాలలు, ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ ద్వారా నాణ్యమైన విద్యను విధిగా అందించాలి. అవసరమైన సహాయక ఉపకరణాలు, శిక్షణ ఇవ్వాలి. వీరికి ఉద్యోగ హక్కు కూడా కల్పించారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో రిజర్వేషన్లు అమలు చేయాలి.

ప్రత్యేక వృత్తి శిక్షణ, స్వయం ఉపాధికి ప్రోత్సాహం ఇవ్వాలి. ఆరోగ్య హక్కు కింద వీరికి ఉచిత లేదా తక్కువ ధరలో వైద్య సేవలు అందించాలి. కౌన్సెలింగ్ పునరావాసం, థెరపీ వంటివి అందుబాటులో ఉండాలి. వీరికి పింఛన్లు, ఆర్థిక సహాయం, బీమా పథకాలు, ప్రత్యేక సదుపాయాలు రవాణా, భవనాలు వంటి సామాజిక భద్రత కూడా కల్పించాలి. వివక్ష లేకుండా, దౌర్జన్యం లేకుండా జీవించే గౌరవ హక్కు వీరికి ఉంది. మేధోపరమైన వైకల్యంతో బాధపడుతున్న వారిని హేళన చేయకుండా, సమాజంలో సమానంగా చేర్చే బాధ్యత ప్రభుత్వానిది మాత్రమే కాదు... సమాజానిది కూడా. మేధోపరమైన వైకల్యం ఉన్నవారు సహానుభూతికి మాత్రమే కాదు, గౌరవానికి మరియు అవకాశాలకు అర్హులు. సరైన సహాయం, విద్య, ఉద్యోగం, సామాజిక మద్దతు లభిస్తే వారు కూడా సమాజానికి ఉపయోగపడగలరు. సమాజం వారిని బలహీనులుగా కాకుండా, సమాన హక్కులు కలిగిన పౌరులుగా చూడాలి.

## మానసిక అనారోగ్యం..

కొంత మంది నిర్లక్ష్యంగా... మరికొంత మం ది భయంగా... ఇంకొంత మంది సానుభూతి ప్రదర్శిస్తున్నారే తప్ప మానసిక అనారోగ్యం (Mental Illness)తో బాధపడుతున్న వారికి అండగా నిలిచి, వారిని సాధారణ స్థితికి ర ప్పించే ప్రయత్నాలు చేస్తున్న వారు చాలా అరుదు. మానసిక అనారోగ్యం అంటే మనసు, ఆలోచనలు, భావోద్వేగాలు, ప్రవర్తనపై ప్రభావం చూపే వ్యాధి స్థితి. ఇది సాధారణ ఒత్తిడి, దుఃఖం లేదా తాత్కాలిక ఆందోళనతో తేడా కలిగి ఉంటుంది. దీని వల్ల వ్యక్తి తన దైనందిన జీవితాన్ని సవ్యంగా గడపడంలో, ఇతరులతో సంబంధాలు కొనసాగించడంలో, పని చేయడంలో కష్టాలు ఎదుర్కొంటా డు. మానసిక అనారోగ్యం స్థితి అంటే ఆలోచనల్లో సమస్యలు, తప్పుడు నమ్మకాలు, తార్కికత కోల్పోవడం. వీరికి భావోద్వేగాల్లో అసమతుల్యత లోపిస్తుంది. ఎక్కువగా భయపడటం, కోపం, డిప్రెష న్, నిరాశ వంటి లక్షణాలు కనిపిస్తాయి. ప్రవర్తన లో మార్పులు చూడవచ్చు. సామాజిక సంబంధా ల నుండి దూరం కావడం, అసహజ అలవాట్లుగా మారతాయి. ఈ పరిస్థితి వల్ల నిద్రలేమి, ఆకలి మార్పులు, అలసట వంటి శారీరక సమస్యలు ఏర్పడతాయి. మానసిక అనారోగ్యం రకాల్లో మొదటిది ఆందోళన వ్యాధులు (Anxiety Disorders). ఈ స్థితిలో భయం, టెన్షన్ అధికం గా ఉంటాయి. రెండోది ఉదాసీనత (Depres sion). తీవ్రమైన నిరాశ, ఉత్సాహం లేకపోవడం వంటి ముఖ్యలక్షణాలు ఉంటాయి. ద్విము ఖ వైకల్యం (Bipolar Disorder)లో ఆనందం, నిరా శ మధ్య తీవ్రమైన మార్పులు ఉంటాయి. స్కిజోఫ్రీనియా అనేది మరో రకమైన మానసిక అనారో గ్యం. ఇందులో భ్రమలు, అవాస్తవ దృశ్యాలు, వి చిత్ర ప్రవర్తన సాధారణం. లేనివి ఊహించుకొని భయపడడం, ఎవరెవరో ఉన్నారని భ్రమడడం ఈ స్థితిలో సాధారణం. కాగా, భయానక సంఘటనల జ్ఞాపకాల వల్ల మానసిక క్షోభను పోస్ట్‌ట్రామా టిక్ స్ట్రెస్ డిజార్డర్‌గా పేర్కొంటారు. మానసిక అనారోగ్యానికి జన్యు కారణాలు (వంశపారంపర్య ప్రభావం), మెదడు రసాయనాల అసమతుల్యత, తీవ్రమైన ఒత్తిడి, దుర్ఘటనలు, మత్తు పదార్థాల వాడకం, శారీరక వ్యాధులు లేదా దీర్ఘకాలిక సమస్యలు వంటి ఎన్నో కారణాలు ఉన్నాయి. భారతదేశంలో మానసిక ఆరోగ్య సంరక్షణ చట్టం – 2017 మానసిక అనారోగ్యం కలిగిన వారి హక్కులను స్పష్టంగా పేర్కొంటున్నది. వీరికి ఉచితంగా, గౌరవంతో మానసిక ఆరోగ్య చికిత్స పొందే ఆరో గ్య హక్కు ఉంది. ప్రభుత్వ ఆసుపత్రులు వీరికి అవసరమైన సేవలు అందించాల్సిన బాధ్యత స్వీకరించాలి. వివక్ష లేకుండా సమాజంలో జీవించే హక్కు, అవమానకరమైన లేదా క్రూరమైన వైఖరి నుంచి రక్షణ హక్కు. తన చికిత్సలో భాగంగా ఏ ఔషధాలు, ఏ విధానాలు కావాలో ముందే చెప్పే స్వతంత్ర నిర్ణయ హక్కు ఉంటాయి. తీవ్రమైన లేదా అత్యవసర పరిస్థితుల్లో తప్ప వీరికి బలవంతపు చికిత్స చేయకూడదు. రోగి సమాచారం రహస్యంగా ఉంచే బాధ్యత ఆసుపత్రులకు, వైద్యులపై ఉంది. హింస, నిర్బంధం, హక్కుల ఉల్లంఘన జరిగితే న్యాయపరంగా రక్షణ లభిస్తుంది. చట్టపరమైన సహాయం పొందే అవకాశం ఉంటుంది. విద్య, ఉద్యోగం, నివాసం, సామాజిక భద్రతలో సమాన అవకాశాలు, కుటుంబ సభ్యులు లేదా సంరక్షకుల సహకారంతో గౌరవప్రదమైన జీవనం వంటి సామాజిక హక్కులను కూడా మానసిక అనారోగ్యంతో బాధపడుతున్న వారికి చట్టం కల్పిస్తున్నది. ఏదిఏమైనా, మానసిక అనారోగ్యం అనేది బలహీనత కాదు, ఒక వైద్య పరిస్థితి. దీన్ని సిగ్గు పడకుండా, దాచిపెట్టకుండా సరైన చికిత్స తీసుకోవాలి. సమాజం వారిని వెక్కిరించడం కాదు, అర్థం చేసుకోవడం, అంగీకరించడం నేర్చుకోవాలి. మానసిక అనారోగ్యం ఉన్నవారు కూడా గౌరవంతో, సమాన అవకాశాలతో జీవించాల్సిన హక్కు కలిగిన పౌరులే.




# ప్రతిఘటనకు చిహ్నం ‘చె గువేరా’

### విప్లవ వీరుడు చె గువేరాకు ఘననివాళులు







వరంగల్...



ఖమ్మం...

**ప్రజాపక్షం/వరంగల్:** ప్రతిఘటనకు చిహ్నంగా చె గువేరా అని ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సయ్యద్ వలి ఉల్లా ఖాద్రీ అన్నారు. విప్లవ వీరుడు చెగువేరా 58వ వర్ధంతిని వరంగల్ నగరంలోని రాణి రుద్రమాదేవి విగ్రహం, పోచమ్మ మైదాన్ చౌరస్తా వద్ద నిర్వహించగా చె గువేరా చిత్రపటానికి సయ్యద్ వలి ఉల్లా ఖాద్రీ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చె గువేరా అన్యాయం, దోపిడీకి వ్యతిరేకంగా ప్రతిఘటనకు ప్రతీకగా నిలిచిన విప్లవకారుడని, ఆయన శాంతి, న్యాయం, సమానత్వం అనే సిద్ధాంతాలతో అచంచల నిబద్ధతతో లక్షలాది మంది హృదయాలలో నిలిచాడన్నారు. చెగువేరా స్ఫూర్తితో నేటి విద్యార్థి, యువత తమ హక్కుల కోసం ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి మస్కా శుదీర్, నాయకులు ఖాదర్ అలీ, జగదీష్, మతీన్ కకా, యూసుఫ్, వెంకటేష్‌రావు పాల్గొన్నారు.

**ఖమ్మం అర్బన్ :** సామాజ్యవాద వ్యతిరేక తిరుగుబాటు విప్లవానికి చెగువేరా దిక్సూచి అని ఆయన ఆశయ సాధనకు విద్యార్థులు ఉద్యమించాలని ఎఐఎస్‌ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఇటికాల రామకృష్ణ తెలిపారు. ఖమ్మం గిరిప్రసాద్ భవన్‌లో ఎఐఎస్‌ఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో చెగువేరా వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా చెగువేరా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఇటికాల రామకృష్ణ మాట్లాడుతూ అణిచివేతపై గెరిల్లా పోరాటాలు నడిపి స్వాతంత్ర ఫలాలు అందించిన విప్లవ వీరుడు చెగువేరా అని తెలిపారు. యువత, విద్యార్థులు చెగువేరాను ఆదర్శంగా తీసుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న విధానాలపై ఉద్యమాలకు సంసిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మడుపల్లి లక్ష్మణ్, జిల్లా సహాయ కార్యదర్శి షేక్ నాగుల మీరా, వంశీ, శివ, జిల్లా నాయకులు గోపి, నరేందర్, రాహుల్, యశ్వంత్, గణేష్, అభిషేక్, దిలీప్, ప్రశాంత్, విశ్వనాథ్, చరణ్, ఆదిత్య, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

**వరంగల్ :** సామ్రాజ్యవాదుల గుండెల్లో దడ పుట్టించిన విప్లవ ధృవతార చెగువేరా అని, ఆయన ఉద్యమ పోరాట స్ఫూర్తితో నేటి విద్య, ఉపాధి, ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న పాలకులపై ఉద్యమించాలని ఎఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి శరత్ పిలుపునిచ్చారు. గురువారం వరంగల్ శివనగర్‌లోని ఎస్‌సి హాస్టల్‌లో ఎఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో చెగువేరా వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. చేగువేరా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శరత్ మాట్లాడుతూ అసమానతలు లేని సమాజం కోసం పోరాడిన విప్లవ వీరుడు చేగువేరాని, ఆ ఉద్యమ కారుని పోరాట స్ఫూర్తితో విద్య వ్యతిరేక విధానాలపై, అసమానతలపై, ఆకలి లేని, పేదరికం లేని, అత్యాచారాలు లేని సమాజం కోసం పోరాటం చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎఐఎస్‌ఎఫ్ నాయకులు మదారపు శ్రేయస్, శరత్, వరప్రసాద్, రవి తేజ, వంశీ, తదితరులు పాల్గొన్నారు.

**పెద్దపల్లి :** ప్రవహించే ఉత్తేజం చెగువేరా అని ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆరెపల్లి మానస్, ప్రధాన కార్యదర్శి మార్కపూర్ సూర్య అన్నారు. గురువారం స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద చేగువేరా వర్ధంతిని ఎఐవైఎఫ్ పెద్దపల్లి జిల్లా సమితి ఆధ్వర్యంలో నిర్వహించారు. చెగువేరా చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెగువేరా స్ఫూర్తితో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్న యువజన వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా యువత పోరాడాలని పిలుపునిచ్చారు కార్యక్రమంలో నాయకులు మాచర్ల అంజి, తాళ్లపల్లి సురేందర్, చంద్రగిరి ఉదయ్ కుమార్, మాచర్ల లక్ష్మణ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

**కరీంనగర్‌సిటీ :** చెగువేరా స్ఫూర్తితో నేటి విద్యార్థి యువత తమ హక్కుల కోసం ఉద్యమించాలని ఎఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి మామిడిపల్లి హేమంత్ పిలుపునిచ్చారు. గురువారం ఎఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని బద్దం ఎల్లారెడ్డిభవన్‌లో చెగువేరా వర్ధంతి సంధర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సంధర్భంగా హేమంత్ మాట్లాడుతూ చేగువేరా పేరు వింటేనే నరనరాల్లో చైతన్యం ప్రవహిస్తుందన్నారు. ఆయన పోరాట స్ఫూర్తితో రానున్న రోజుల్లో నేటి విద్యార్థి, యువత విద్యా ఉపాధి, ఆర్థిక, సామాజిక అసమానతలపై పోరాటాలు కొనసాగించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎఐఎస్‌ఎఫ్ నగర నాయకులు కసిరెడ్డి సందీప్‌రెడ్డి, అన్వేష్, బొల్లి సాయి, విశాల్, అజయ్, సాయికుమార్, హర్షిత్ పాల్గొన్నారు.

**నాగర్‌కర్నూల్ :** విప్లవయోధుడు చెగువేరా నేటి యువతకు ఎంతో ఆదర్శమని, ఆయన జీవితాన్ని అధ్యయనంచేసి సమాజ శ్రేయస్సుకు నేటియువత నడుం బిగించాలని సిపిఐ నాగర్‌కర్నూల్ జిల్లా కార్యదర్శి ఎస్‌ఎండి ఫయాజ్ పిలుపునిచ్చారు. గురువారం సిపిఐ జిల్లా కార్యాలయంలో చేగువేరా వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించి అనంతరం ఆయన మాట్లాడారు. అంతరాలులేని సమాజం సరిహద్దులులేని ప్రపంచం కోరుకున్న ప్రపంచ ప్రేమికుడు చేగువేరా అని ఆయన కొనియాడారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్, సిపిఐ జిల్లా సమితి సభ్యులు తుమ్మల శివుడు, కృష్ణాజి, గోపిచారి, సిపిఐ నాయకులు వెంకటస్వామి, జంగంశివుడు, కృష్ణకుమార్, బంగారయ్య, విజయ్, రాములు పాల్గొన్నారు.



పెద్దపల్లి...




కరీంనగర్...




నాగర్‌కర్నూల్...

# చింతకానిలో పూర్వవైభవం చాటాలి

### బాగం హేమంతరావు




**ప్రజాపక్షం/చింతకాని :** చింతకాని మండలంలో సిపిఐ పూర్వ వైభవం చాటాలని పార్టీ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు పేర్కొన్నారు. గురువారం ఖమ్మం జిల్లా చింతకాని మండలంలో సిపిఐ కార్యాలయంలో పదిమల వెంకటనర్సయ్య అధ్యక్షతన జరిగిన పార్టీమండల సమితి సమావేశంలో బాగం హేమంతరావు మాట్లాడారు. కాంగ్రెస్‌తో పొత్తుకు సిపిఐ సిద్ధంగా ఉందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీకి పూర్వ వైభవం తీసుకురావాలన్నారు. నాగిలిగొండ, నేరడ, కొదుమూరు, రామకృష్ణాపురం, ప్రొద్దుటూరు, చిన్నమండవ ఎంపిటిసి స్థానాలతో పాటు జడ్‌పిటిసి స్థానానికి పోటీ చేసేందుకు స్థానిక నాయకత్వం సిద్ధంగా ఉండాలని సూచించారు. సిపిఐ జడ్‌పిటిసి అభ్యర్థిగా పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు, రాఘవాపురం మాజీసర్పంచ్ కొండపర్తి గోవిందరావును మండల కౌన్సిల్ ఏకగ్రీవంగా ప్రతిపాదించింది. పార్టీ నిర్ణయం మేరకు స్థానిక నాయకత్వం ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని బాగం పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు కొండపర్తి గోవిందరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఏపూరి రవీంద్రబాబు, పావులూరి మల్లిఖార్జునరావు, కూచిపుడి రవి, దూసరి గోపాలరావు, మార్గం శ్రీను, అబ్బూరి మహేష్, రాసాల మోహన్‌రావు, కన్నెబోయిన విజయమ్మ, దొబ్బల వెంగళరావు, గోగుల ఆది, కూచిపుడి రవి, పగిళ్లపల్లి ఏసు తదితరులు పాల్గొన్నారు.

# ఒంటరిగానైనా బరిలో ఉంటాం

### సిపిఐ మంచిర్యాల జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్



**ప్రజాపక్షం/మంచిర్యాల :** స్థానిక సంస్థల ఎన్నికల్లో జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లోని అన్ని మండలాల్లో జడ్‌పిటిసి, ఎంపిటిసి స్థానాలకు పోటీ చేయడానికి సిపిఐ సిద్ధంగా ఉందని పార్టీ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ తెలిపారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత శాసన సభ ఎన్నికల్లో సిపిఐ, కాంగ్రెస్‌పార్టీలు మిత్ర ధర్మంతో పోటీ చేశాయని, స్థానిక ఎన్నికల్లోనూ అదే కొనసాగాలని కోరారు. మతోన్మాద శక్తులను ఓడించాలంటే మిత్ర ధర్మం కొనసాగాల్సిన అవసరం ఉందన్నారు. వారు మిత్రధర్మం పాటిస్తే స్థానిక ఎన్నికల్లో కలిసి పోటీ చేయడం జరుగుతుందని, లేదంటే సిపిఐ ఒంటరిగానే స్థానిక ఎన్నికలలో పోటీ చేస్తుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు జరిగిన నిత్యం ప్రజల కోసం పోరాటాలు ఉద్యమాలు నిర్వహించే ప్రజల గొంతుకగా నిలుస్తున్న సిపిఐ అభ్యర్థులను గెలిపించాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. పార్టీకి బలం ఉన్నచోట్ల జడ్‌పిటిసి, ఎంపిటిసిలు గా, సర్పంచులుగా, వార్డు మెంబర్లుగా పోటీ చేసే స్థానాలకు సీట్ల సర్దుబాటు చేసుకోవాల్సిన అవసరం ఉందని, కాంగ్రెస్‌తోపాటు ఇతర వామపక్ష పార్టీలతో కలిసి స్థానికసంస్థల ఎన్నికల్లో ముందుకు వెళ్తామన్నారు. సమావేశంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు జోగుల మల్లయ్య, ఇప్పకాయల లింగయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు ఖలీందర్ ఆలీఖాన్, మిట్టపల్లి శ్రీనివాస్, జిల్లాసమితి సభ్యులు దేవి పోచన్న, చాడ మహేందర్‌రెడ్డి, వనం సత్యనారాయణ, నాయకులు దుర్గం దేవదాస్ పాల్గొన్నారు.



# స్థానికం
REGIONAL NEWS
కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## ఆర్వో కార్యాలయాన్ని తనిఖీ చేసిన కలెక్టర్



**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :**జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ రాత్రి పట్టణంలోని జిల్లా పరిషత్ కార్యాలయంలోని ఆర్వో కేంద్రాన్ని తనిఖీ చేశారు.ఈ స ందర్భంగా కలెక్టర్ ఇక్కడ ఏర్పాటు చేసిన వసతులను పరిశీలించారు.కలెక్టర్ మాట్లాడుతూ,తొలివిడత జెడ్పిటిసి,ఎంపిటిసి ఎన్నికల నిర్వహణలో భా గం గా,రేపటి నుంచి నామినేషన్ పత్రాలు స్వీకరిస్తున్నామని అన్నారు. నా మినేషన్ల స్వీకరణకు సంబంధించి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా వ్య వహరించాలని సూచించారు.ఈ కార్యక్రమ ంలో ఆర్‌డిఒ రత్నకళ్యాణి,జెడ్పి సిఇఒ గో వింగ్, ఎంపిడిఒ గజానన్,ఇతర అధికారులు,సిబ్బంది,తదితరులు పా ల్గొన్నారు.

## సిజెఐపై దాడికి అధ్యాపకుల నిరసన



**ప్రజాపక్షం/భీమ్‌గల్:**సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బిఆర్. గవా యిపై జరిగిన దాడికి ప్రభుత్వ డిగ్రీ కళాశాల భీమ్‌గల్ అధ్యాపక బృందం నిరసన తెలిపి సిజెఐపై దాడిని ప్రిన్సిపాల్ సతీష్ తీవ్రంగా ఖండించారు. అత్యున్నత హోదాలో ఉన్న సిజెఐపై దాడి చేయడమంటే దేశ రాజ్యా ంగానికి మాయని మచ్చ అని తెలిపారు. ఇలాంటి దాడులు దేశవ్యాప్తంగా ప్రజాస్వామ్యవాదులు ఖండించాలని ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా ఉండాలంటే పౌర సమాజం నిరసనల ద్వారా చైతన్యం చేయాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉండాలన్నారు. కార్యక్రమంలో కో ఆర్డినేటర్ డాక్టర్ బి.శ్రీనివాస్, వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ సుమలత, ఎన్‌ఎ స్ఎస్ పోగ్రాం కోఆర్డినేటర్ పడిగెల సుదర్శన్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ జ లందర్‌రెడ్డి, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

## దళారులను నమ్మి రైతులు మోసపోవద్దు

### వాడీలో కొనుగోలు కేంద్రం ప్రారంభం



**ప్రజాపక్షం/నిజామాబాద్ :**రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని చైర్మన్ జనార్ధ న్ సిఇఒగంగానర్సయ్య రైతులకు సూచించారు. గురువారం ధర్పల్లి మండలం లోని హోన్నాజీపేట్, వాడీ, మద్దు తండాలలో పిఎసిఎస్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా వీడీసీ చైర్మన్ జిన్నా సాయిలు, సిఇఒగ ంగానర్సయ్య మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు జరగకుండా ఉండేందుకు కొనుగోలు కేంద్రాలను ముందుగానే ప్రారంభించటం జరిగిందన్నారు. ఈ పరిధిలోని రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వి నియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వాడీ విడిసిచైర్మన్ జిన్నా సాయిలు, లింగాపురం సాయిలు, డైరెక్టర్లు సాయిలురెడ్డి, సుభాష్‌రెడ్డి, మోహన్, ధర్మేశ్, చేగంటి భూమయ్య, గంగామోహన్, రమేష్ పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

**ప్రజాపక్షం/నిజాంపేట్:**నిజాంపేట మండల కేంద్రంతో పాటు కలవ్రకుంట మరియు రజాక్ పల్లి గ్రామాల్లో గురువారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో వడ్ల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడం జరిగింది. ప్రభుత్వం ఎ గ్రేడ్ రకానికి క్వింటాల్ కి రూ.2389, సాధారణ రకానికి రూ.2369 చెల్లిస్తుందని రైతులకి తెలియజేయడం జరిగింది.రైతులు ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో మాత్రమే ధాన్యాన్ని విక్రయి ంచాలని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కొండల్ రెడ్డి, ఎఇఒలు శ్రీలత, మౌనిక, రమ్య, సిఇఒశోభ మరియు రైతులు బా బు,కుమార్, పర్శరాములు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆస్పత్రి సేవలపై కేంద్ర బృందం సమీక్ష



**ప్రజాపక్షం/సిర్పూర్‌టి:**సిర్పూర్ (టి) ప్రభుత్వ ఆస్పత్రి సేవలను కేంద్ర ఆరోగ్య శాఖ బృందం గురువారం సందర్శించి, పరిశీలిం చింది. డాక్టర్ సుబోధ్ కందమూతన్, డాక్టర్ ఎస్. సందీప్, డాక్టర్ సాయి ప్రసాద్, డాక్టర్ వినయ్ లతో కూడిన బృందం ఆస్పత్రిలోని వార్డులు, ఆపరేషన్ థియేటర్, ఆక్సిజన్ ప్లాంట్, అత్యవసర విభాగాన్ని తనిఖీ చేసింది. రోగులకు అం దుతున్న వైద్యసేవల నాణ్యత, సిబ్బంది పనితీరు, సదుపాయాల పరి స్థితులను వారు ప్రత్యక్షంగా పరిశీలించారు.ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు బాధ్యతగా పనిచేయాలని సిబ్బందికి సూచించింది. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జోగేం దర్ బృందానికి వివరాలు అందించారు.

## జెడ్‌పిటిసి,ఎంపిటిసి నామినేషన్ల ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి: కలెక్టర్

**ప్రజాపక్షం/నిర్మల్:**జిల్లాలో జరుగుతున్న మొదటి విడత జెడ్పిటిసి ,ఎంపి టిసి ఎన్నికల నామినేషన్ల ప్రక్రియను సమర్థవంతంగా,పారదర్శకంగానిర్వహించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ సూచించా రు.గురువారం క డెం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసి న నామినేషన్ స్వీకరణ కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,అభ్యర్థులకు సకాలంలో సమాచారం అంది ంచే ందుకు హెల్ప్‌డెస్క్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నామినేషన్ దాఖలు ప్రక్రియలో అధికారులు ఖచ్చితంగా సమయపాలన పాటించాలని ఆదేశించారు.ప్రతి రోజు స్వీకరించిన పత్రాలను భద్రప రిచి,సంబంధిత రిజిస్టర్లలో నమోదు చేయాలని తెలిపారు.ఎన్నికల ప్రక్రి య ప్రశాంతంగా సాగేందుకు తగిన పోలీసు బందోబస్తు ఏర్పాట్లు చేయా లని కలెక్టర్ పేర్కొన్నారు.నామినేషన్లపై రోజువారీ నివేదికలను కలెక్టరేట్ కు పంపాలని సూచించారు.ఈ పరిశీలనలో జెడ్ పిసిఇఒ గోవిం ద్,డిఆర్డివో విజయలక్ష్మి ,తహసీలార్ ప్రభాకర్,ఎ ం పిడిఒ అరుణతో పాటు ఎన్నికల అధికారులు,సిబ్బంది,తదితరులు పా ల్గొన్నారు.

## నామినేషన్ కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా ఎన్నికల పరిశీలకులు



**ప్రజాపక్షం/రామాయంపేట:** సాదారణ ఎన్నికల ప్రక్రియ ప్రారంబమైన నేపథ్యంలో గురువారం మెదక్ జిల్లా ఎన్నికల పరిశీలకులు ఐఏఎస్ వాసం వెంకటేశ్వర్‌రెడ్డి నామినేషన్ కేంద్రాలను పరిశీలించారు. అడిషనల్ కలెక్టర్ నగేష్ కలిసి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిటిసి, జెడ్పిటిసి ప్రవర్తణ నియమావళిని పక్కాగా అమలు చేసేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఈసందర్భంగా వాసం వెంకటేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. పోలింంగ్ కేంద్రాల్లో మౌళిక సదుపాయాలు, నామినేషన్ కేంద్రాల్లో అధికారులు తీసుకుంటున్న జాగ్రత్తలను ఆయన పరిశీలించారు. హెల్ప్ డెస్కులు, రిటర్నింగ్ అధికారి చాంబర్, నామినేషన్ల స్వీకరణకు ఏర్పాటు చేసిన , ఇతర సౌకర్యాలను పరిశీలించారు. కాగా రామాయంపేట మండల పరిషత్‌లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ అభ్యర్థులు ఎవరు గురువారం నామినేషన్లు వేయలేదని ఎంపీడివో షాజిలోద్దిన్ తెలిపారు.

# నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను సందర్శించిన కలెక్టర్



**ప్రజాపక్షం/నిజామాబాద్ :**స్థానిక సంస్థల ఎన్నికలలో భాగంగా రాష్ట్ర ఎన్నికల కమిషన్ విడుదల చేసిన షెడ్యూల్‌ను అనుసరిస్తూ జిల్లాలో తొలి విడత ఎంపిటిసి, జెడ్‌పిటిసి స్థానాలకు రిటర్నింగ్ అధికారులు గురువారం నోటిఫికేషన్లు జారీ చేసి నామినేషన్ల స్వీకరణ ప్ర క్రియకు శ్రీకారం చుట్టారు. నిజామాబాద్, బోధన్ రెవె న్యూ డివిజన్ల పరిధిలోని 18 మండలాలోలైన బోధన్, చందూర్, కోటగిరి, మోస్రా, పోతంగల్, రెజింల్, రుద్రూర్, సాలూర, వర్ని, ఎడపల్లి, ధర్పల్లి, డిచ్‌పల్లి, ఇందల్వాయి, మాక్లూర్, మోపాల్, నవీపేట్, నిజామాబాద్, సిరికొండ జెడ్‌పిటిసి స్థానాలతో పాటుపై మండలాల పరిధిలోని 177 ఎంపిటిసి స్థానాలకు ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ నేపథ్యంలో మోస్రా, చందూర్, రుద్రూర్ మండల కేంద్రాల్లోని ఎంపిడిఒ కా ర్యాలయాల్లో ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేం ద్రాలను జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి గురువారం ఆకస్మికంగా సందర్శించి అందుఆటులోని సదుపాయాలు, అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశా రా అని పరిశీలించారు. హెల్ప్‌డెస్క్, వీడియోగ్రఫీ, పోలస్ బందోబస్తు తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ సపోర్టింగ్ స్టాఫ్ సరిపడా ఉ



న్నారా అని ఆరా తీశారు. నోటీసు బోర్డులపై నోటిఫికేషన్ పత్రాలను ప్రదర్శించాలని తనిఖీ చేశారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా నామినేషన్ల ప్రక్రియను నిర్వహించాలని నామినేషన్ దరఖాస్తు ఫారాలు తీసుకున్న వారి వివరాలను కూడా రిజిస్టర్‌లో నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. దాఖలైన నామినేషన్లకు సంబంధించిన అఫిడవిట్లను ఏ రోజుకు ఆ రోజు నోటీసు బోర్డులపై ప్రదర్శిస్తూ జిల్లా కేంద్రానికి సకాలంలో రిపోర్టులు పంపించాలని ఆర్‌ఓలకు సూచించారు. ప్రతి నామినేషన్ సెంటర్ వద్ద హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామని, నామ పత్రాలు దాఖలు చేసే విషయంలో అభ్యర్థులకు అవసరమైన సహకారమందించాలని సూచించారు. ఎన్నికల కమీషన్ మార్గదర్శకాలను తు.చ. తప్పకుండా పాటిస్తూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియను నిర్వహించాలన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి పక్కా గా అమలయ్యేలా చూడాలన్నారు. ఎన్నికల నిర్వహణ కు సంబంధించి ఎలాంటి సందేహాలున్నా పై అధికారులను సంప్రదించాలని సూచించారు. కలెక్టర్ వెంట బో ధన్ సబ్ కలక్టర్ వికాస్ మహతో స్థానిక అధికారులున్నారు.

**పాఠశాలలు, ఎటిసి కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్**

ప్రభుత్వ పాఠశాలలు, ఐటిఐలలో కొనసాగుతున్న అడావ్స్‌డ్, టెక్నాలజీ సెంటర్లను కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. చందూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠవాలతో పాటు అదే ఆవరణలో కొనసాగుతున్న ప్రాథమిక పాఠశాలలను కలెక్టర్ సందర్శించారు. ముఖ్య గుర్తింపు విధానం ద్వారా ఉపాధ్యాయులు, విద్యార్థులు హాజరు తీసుకున్నారా అని పరిశీలించారు. విద్యార్థులు కోసం వండిన మధ్యాహ్న భో జనం నాణ్యతను తనిఖీ చేశారు. విద్యార్థులకు ప్రభు త్వ ం నిర్దేశించిన మెనూ ప్రకారం పౌష్టికాహారంతో కూడిన భోజనం అందించాలని సూచించారు. డైనింగ్ హాల్ ని ర్మాణం అర్ధాంతరంగా నిలిచిపోయి ఉండటాన్ని గమనించిన కలెక్టర్ పనులను పూర్తి చేయించాలని సంబంధి త ఇంజనీరింగ్ అధికారులను ఫోన్ ద్వారా ఆదేశించా రు. అనంతరం బోధన్ పట్టణం, నిజామాబా ద్ నగరంలలో ప్రభుత్వ ఐటిఐలకు అనుసంధానంగా ప్రభుత్వం నూతనంగా నెలకొల్పిన అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లను కలెక్టర్ సందర్శించారు. అవసరమున్న మౌలిక వసతులపై నిర్వాహకులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట స్థానిక అధికారులున్నారు.

## నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి

### జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్







**ప్రజాపక్షం / మందమర్రి/ తాండూర్/ బెల్లంపల్లి :**జిల్లాలో జరగనున్న 2వ సాధారణ పంచాయతీ ఎన్నికల నిర్వహణలో నిబంధనలను కచ్చితంగా పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. గురువారం రోజున ఆయన జిల్లాలోని మందమర్రి, తాండూర్, బెల్లంపల్లి మండల కేంద్రాలలో పర్యటించి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయాలను సందర్శించి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను దగ్గరుండి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం విడుదల చేసిన కార్యాచరణ ప్రకారం నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఉపసంహరణ, పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియలను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. ప్రజల సౌకర్యార్థం మండల కేంద్రాలలో సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అర్హత గల ప్రతి ఒక్కరూ ఎన్నికలలో తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని కోరారు. ఎన్నికల నిర్వహణ పూర్తిగా ఎన్నికల సంఘం ఆదేశాలకు లోబడి ఉంటుందని, నిబంధనల ఉల్లంఘన జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సంబంధిత మండలాల అధికారులు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

**జాతీయ రహదారి విస్తరణ వేగవంతం చేయాలి**

జిల్లాలో జాతీయ రహదారి విస్తరణ ప్రక్రియను వేగవంతం చేయాలని, ప్రభావిత గ్రామాలలో అవార్డుల జారీ ప్రక్రియను త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కేంద్రంలోని మంచిర్యాల రాజస్వ మండల అధికారి కార్యాలయంలో జాతీయ రహదారి విస్తరణలో ఆర్బిట్రేషన్ సంబంధిత రికార్డులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ రహదారి విస్తరణలో భాగంగా ప్రభావిత గ్రామాలలో అవార్డుల జారీ ప్రక్రియను వేగవంతం చేసి, ఆర్బిట్రేషన్ సంబంధిత రికార్డులను పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.


## ఎటిసి సెంటర్‌లో కలెక్టర్ ప్రావీణ్య తనిఖీ



**ప్రజాపక్షం/ సంగారెడ్డి ;** సాంకేతిక శిక్షణతో ఉపాది అవకాశాలు మెరుగువుతాయని హత్నూర ఎటిసి సెంటర్‌ను తనిఖి చేసిన సందర్భంగా జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అన్నారు. గురువారం నాడు జిల్లా కలెక్టర్ మండల కేంద్రమైన హత్నూర పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ ను తనికీ చేసారు. ఎటిసి సెంటర్ల ఎంత మంది విద్యార్థులు శిక్షణ పొందుతున్నారు. అన్న వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఏఏ కోర్సులలో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు. విద్యార్థులకు అందుతున్న ఆధునాతన శిక్షణపై కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎటిసి సెంటర్‌లో ఉన్న మౌళిక సదుపాయాలు అవసరాలపై సమగ్రంగా సమీక్షించారు. రానున్న రోజుల్లో అడ్వాన్స్ టెక్నాలజీ రంగంలోని ఉపాధి, అవకాశాలు ఎక్కువగా ఉంటాయని ఎటిసిలో శిక్షణ పొందిన వారికి భవిష్యత్తులో మంచి ఫలితాలు వస్తాయని కలెక్టర్ అన్నారు. ఈ సందర్శనలో ఎటిసి అధికారులు ,సిబ్బంది పాల్గొన్నారు.

## 'ఐలా'కు తాగు నీరు

### జలమండలి ఎండి అశోక్ రెడ్డిని కోరిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



**ప్రజాపక్షం/ పటాన్‌చెరు:**పటాన్ చెరు ఐలా పారిశ్రామిక వాడకు త్రాగు నీరు సౌకర్యాన్ని కల్పించాలని, ఉస్మాన్ నగర్ బీఈమ్యాక్ సోసైటీ ప్రజలకు ఇంప్ర్యూమెంట్ చార్జీలు తగ్గించాలని, జలమండలి ఎండి అశోక్ రెడ్డిని ఏమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కోరారు. పటాన్ చెరు డివిజన్ ఐలా పరిధిలో గల పరిశ్రమలకు మంచినీటీ కనెక్షన్లు లేకపోవడం మూలంగా కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎంటనే ప్రథమ ప్రాధాన్యతగా గుర్తించి ప్రతి పరిశ్రమను మంచి నీటీ కనెక్షన్లు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ జలమండలి ఎండి అశోక్ రెడ్డి ని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. గురువారం హైదరాబాద్‌లోని జలమండలి కార్యాలయంలో ఎండి అశోక్ రెడ్డితో ఎమ్మెల్యే జిఎంఆర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలో జలమండలి ద్వారా చేపడుతున్న మంచినీటి సరఫరా రిజర్వాయర్లు నూతన కనెక్షన్లపై చర్చించారు. అదే విధంగా తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని ఉస్మాన్ నగర్‌లో గల బిహెచ్ఇఎల్ బీఈమ్యాక్ సోసైటీ కాలనీవాసులకు మంచినీటి కనెక్షన్ల కోసం వసూలు చేస్తున్న ఇంప్రూమెంట్ చార్జీలను తగ్గించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని ఉస్మాన్ నగర్ లో బిహెచ్ ఎల్ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులకు బిఈమెక్ సోసైటీ పేరుతో గృహాలను నిర్మించుకొని జీవనం కొనసాగిస్తున్నారని తెలిపారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన ఎండి అశోక్‌రెడ్డి అతి త్వరలో వీటికి సంబంధించి ఉత్తర్వులు జారీ చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో రాంచంద్రాపురం మాజీ ఎంపిపి యాదగిరి యాదవ్, ఐలా ప్రతినిధులు సురేందర్‌రెడ్డి, శ్రీనివాస్, మాజీ ప్రజా ప్రతినిధులు నరసింహా ,ఉమేష్ ,మధు, బీఈమ్యాక్, అధ్యక్షులు ,శివ ,నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## పొగాకు రహిత యువ సమాజ నిర్మాణం లక్ష్యం

### జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి అనిత



**ప్రజాపక్షం/మంచిర్యాల టౌన్ :**పొగాకు రహిత యువ సమాజ నిర్మాణం లక్ష్యంగా పాఠశాలలు, కళాశాలల్లో 60 రోజులపాటు పొగాకు నిర్మూలన అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్. అనిత అన్నారు. గురువా రం సాయి కుంటలోని జిల్లా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ అనిత మాట్లాడుతూ పాఠశాలలు, కళాశాలలు, బస్టాండ్‌లు, రైల్వే స్టేషన్‌లు, రద్దీ ప్రాం తా ల్లో పొగాకు వినియోగంపై చైతన్యం కల్పించే విధంగా 6 0 రోజులపాటు అవగాహన కార్యమాలు నిర్వహించనున్నామని తెలిపారు. పొగాకు వినియోగం వలన మానసి క, శారీరక ఆరోగ్యంపై కలిగే దుష్ప్రభావాలపై ప్రజల్లో చై తన్యం పెంపొందించడమే లక్ష్యమని ఆమె పేర్కొన్నారు. జిల్లాలోని 17 పిహెచ్‌సిల పరిధి లోని ఉప కేంద్రాలు, ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాల వైద్యులు, సిబ్బంది ద్వారా ప్రజల్లో పొగాకు ఉత్పత్తుల హానికారకతపై ప్రచారం కొనసాగుతోందని తెలిపారు. యువత పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలని, పొగాకు వినియోగం వ్యక్తి, కుటుంబం, సమాజం, దేశం మొత్తం మీద ప్రతికూల ప్రభావం చూపుతుందని, ప్రజలు స్వచ్ఛందంగా ఈ అవగాహన కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం టొబాకో నియంత్రణపై కరపత్రాలు, పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రసాద్ (అసంక్రమణ వ్యాధుల ప్రోగ్రాం ఆఫీసర్), డాక్టర్ శివ ప్రతాప్, డాక్టర్ అమన్ లింగారెడ్డి, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్కా వెంకటేశ్వర్, సిహెచ్ఓలు లక్ష్మ ణస్వామి, అపర్ణ, సంచాలకులు వెంకటేశ్వర్లు, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఫాతిమా, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎన్నికల నియమావళిని పటిష్ఠంగా అమలు చేస్తాం

* ఎంపిటిసి,జెడ్‌పిటిసి నామినేషన్ల నేపథ్యంలో కఠిన పోలీసు బందోబస్తు
* సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలపై కఠిన చర్యలు తప్పవు
* జిల్లా ఎస్‌పి డా.జి.జానకి షర్మిల



**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :**రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంతంగా,నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామని జిల్లా ఎస్‌పి డా.జి.జానకి షర్మిల తెలిపారు.ఎన్నికల నియమనిబంధనల మేరకు నిర్మల్ జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళిని(ఎన్నికల కోడ్) పటిష్టంగా అమలు చేస్తామన్నారు. జిల్లా ప్రజలు,పౌరులు రాజకీయ పార్టీల అభ్యర్థులు అప్రమత్తంగా ఉండాలనిఎస్‌పిసూచించారు.ఒకవేళ ప్రజలు ఎలాంటి అనుమానాస్పద కార్యకలాపాలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.డయల్ 100 కు లేదా పోలీస్ కంట్రోల్ రూమ్ నం.8 712 659 555,వాట్సాప్ నంబర్ 8712659599లకు సమాచారం ఇవ్వాలని తెలియజేశారు.గత ఎన్నికల కేసుల్లో ఉన్న నేరస్థులను ముందస్తుగా బైండోవర్ చేయడం,సమస్యలు సృష్టించే ట్రబుల్ మాంగర్స్‌ను,రౌడీలను,కేడిలను,సస్పెక్ట్‌లను ముందస్తు బైండోవర్ చేస్తామని,జిల్లాలో ఉన్న ఆయుధాలను ముందస్తుగా స్వాధీనం చేసుకోవడం జరుగుతుందని తెలియజేశారు.అలాగే జిల్లా ఎస్‌పి కొన్ని ప్రధాన సూచనలను తెలిపారు.

**ఎన్నికల కోడ్ అమలు..**

ఎన్నికల కోడ్ అమలు ఎన్నికల షెడ్యూల్ ప్రకటించడంతో తక్షణమే ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందని పేర్కొన్నారు.అక్టోబర్ 9న నోటిఫికేషన్ విడుదలవుతుందని,నవంబర్ 11 నాటికి ఎన్నికల ప్రక్రియ పూర్తవుతుందని తెలిపారు.

**ఎలక్షన్ సెల్ ఏర్పాటు..**

జిల్లాలో ప్రత్యేక ఎలక్షన్ సెల్ ఏర్పాటు చేసి,అనుభవజ్ఞులైన అధికారులను,సిబ్బందిని నియమించినట్లు తెలిపారు.ఈ సెల్ మొత్తం ఎన్నికల సమన్వయ కేంద్రంగా పనిచేస్తుందని చెప్పారు.

**చెక్ పోస్టులు..**

ఎడు అంతర్ రాష్ట్ర చెక్ పోస్టులు ఏర్పాటు చేశామని,ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా చెక్ పోస్టులు ఏర్పాటు చేశామని,అక్కడ ముమ్మర వాహన తనిఖీలు నిర్వహించాలని అధికారులకు ఆదేశించారు.

**బైండ్ ఓవర్ చర్యలు...**

గత ఎన్నికల అనుభవాలను పరిగణనలోకి తీసుకొని ఎన్నికల నేరాలకు పాల్పడిన వ్యక్తులు,రౌడీ షీటర్లను సంబంధిత రెవెన్యూ అధికారుల ముందు బైండ్ ఓవర్ చేయాలని ఎస్‌పి సూచించారు.

**నగదు పరిమితి..**

సరైన ఆధారాలు లేకుండా రూ.50,000 కంటే ఎక్కువ నగదు వెంట తీసుకువెళ్లరాదని,ఈ నిబంధనను ఉల్లంఘిస్తే నగదు స్వాధీనం చేసుకోవాలని ఆదేశించారు.

**సోషల్ మీడియా...**

సోషల్ మీడియాపై ప్రత్యేక నిఘా ఉంచాం,తప్పుడు సమాచారం,రెచ్చగొట్టే విధంగా,అవమానపరిచే విధంగా రూమర్స్ సృష్టించడం లాంటివి సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేస్తే సంభందిత వ్యక్తులు,వాట్సప్ అడ్మిన్ లపై చట్టపరమైన చర్యలు తప్పవు అని ఎస్‌పి హెచ్చరించారు అభ్యర్థులు అనుమతి పొందిన వాహనాలు మాత్రమే ఉపయోగించాలని,ఊరేగింపులు,ర్యాలీలు కుల,మత,ప్రాంత,వర్గ విభేదాలు రేకెత్తించే విధంగా ఉండరాదన్నారు.వాహనాలపై లౌడ్‌స్పీకర్ల వినియోగానికి సంబంధిత అధికారుల అనుమతి తప్పనిసరి,ప్రతి వాహనానికి రిటర్నింగ్ అధికారి జారీ చేసిన పర్మిట్ ఒరిజినల్ కాపీ కలిగి ఉండాలన్నారు.నామినేషన్ దాఖలు చేయడానికి రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి 100 మీటర్ల పరిధిలో మాత్రమే ఊరేగింపులకు అనుమతి ఉంటుందన్నారు.కార్యాలయంలోకి ప్రవేశం ఎన్నికల నిబంధనల మేరకు అభ్యర్థి అర్హులైన సహాయకులకు మాత్రమే ఉంటుందన్నారు.అభ్యర్థులు పార్టీలు చట్టపరమైన నియమాలు పాటించి,శాంతి భద్రతలతో ఎన్నికలు జరగడానికిసహకరించాలని జిలాఎస్‌పిపిలుపునిచ్చారు.



# స్థానికం
REGIONAL NEWS
కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## నామినేషన్ కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్



**ప్రజాపక్షం/శంకరపట్నం:** శంకరపట్నం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జడ్పిటిసి, ఎంపిటిసి నామినేషన్ కేంద్రాలను గురువారం జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పరిశీలించారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో 13 ఎంపిటిసి, 1 జడ్పిటిసి స్థానానికి జరిగే హెల్ప్ డెస్క్‌ను పరిశీలించారు. అనంతరం కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాలను పరిశీలించి రిటర్నింగ్ అధికారులు, ఎంపిడివోను అడిగి తెలుసుకున్నారు. నామినేషన్ ప్రక్రియ సజావుగా సాగేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. జిల్లా కలెక్టర్ వెంట కృష్ణ ప్రసాద్, సురేఖ ఉన్నారు.

## కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



**ప్రజాపక్షం/చందుర్తి:** జిల్లా నూతన కలెక్టర్ హరిత గురువారం మండల కేంద్రం లోని నామినేషన్ స్వీకరణ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎంపిటిసి , జెడ్‌పిటిసి మొదటి విడత ఎన్నికల నిర్వహణకు సిబ్బంది సిద్ధంగా ఉన్నారని అన్నారు. రాష్ట్ర ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు ఆర్వోలు , ఏఆర్వో లతో రివ్యూ చేశామన్నారు.సిబ్బందికి ఎన్నికల నిర్వహణన శిక్షణ పూర్తయిందని తెలిపారు. జిల్లాలో గ్రామ పంచాయితి ఎన్నికలు రెండు , మూడు విడతల్లో నిర్వహిస్తామని అందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి అయ్యాయయని తెలిపారు.

## ఆర్‌టిఐ అమలులో జిల్లాకు అవార్డు

గవర్నర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న కలెక్టర్



**ప్రజాపక్షం/కరీంనగర్:** సమాచార హక్కు చట్టం(ఆర్టీఐ) అమల్లోకి వచ్చి 20 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా దేశ వ్యాప్తంగా వారోత్సవాలను నిర్వహిస్తున్నారు. అందులో బాగంగా తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ లోని రవీంద్ర భారతిలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి బెస్ట్ పెర్ఫార్మింగ్ డిస్ట్రిక్ట్ కేటగిరిలో తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.

## సొంతగూటికి చేరిన మాజీ ఎంపిపి



**ప్రజాపక్షం/కొండపాక:** కొండపాక మాజీ ఎంపీపీ అనంతుల పద్మ నరేందర్ గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మాజీమంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు సమీక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు.గతంలో బిఆర్ఎస్ పార్టీలో పనిచేసిన పద్మ నరేందర్ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ చేరారు.మళ్లీ బిఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు.ఈ సందర్భంగా అనంతుల నరేందర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో వచ్చిన ఆరు గ్యారెంటీలను తుంగలో తొక్కిందని ఆరోపించారు.యూరియా దొరకకరైతులు నానా ఇబ్బందులకు గురయ్యారన్నారు.పింఛన్ పెంచకపోవడం, ఆడపిల్లల పెళ్లిలకు తులం బంగారం ఇస్తామని చెప్పి ఇవ్వలేదని వీటన్నింటి విషయంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అందుకోసమే పార్టీని వీడి బీఆర్ఎస్‌లో చేరుతున్నట్టు పేర్కొన్నారు.ఆయనతో పాటు పలువురు కార్యకర్తలు నాయకులు చేరారు.ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు వంటేరు ప్రతాప్ రెడ్డి, లక్కిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, అనంతుల ప్రశాంత్, దుర్గయ్య, జైపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, బొద్దుల తిరుపతి, రాములు, స్వామి, రాము, హరీష్, కరుణాకర్, అంజయ్య, నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.

## పాత పద్ధతుల్లోనే బ్రిడ్జి నిర్మాణం

## తహసీల్దార్‌కు సిపిఐ వినతి



**ప్రజాపక్షం/జమ్మికుంట:** జమ్మికుంట మండలంలోని మడిపల్లి 18 ఇ గేటు రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి సంబంధించిన రైల్వే అధికారులు ముందు సర్వే చేయించినటువంటి ప్లానింగ్ ప్రకారం ఎవరికీ నష్టం కలగకుండా చేయాలని గ్రామ రైతులు తహసీల్దార్ వెంకటరెడ్డికి వినతి పత్రం సమర్పించారు. పాతదారిలో చేసిన ప్లానింగ్ పనులు చేయకుండా ఇద్దరు వ్యక్తులు అడ్డుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మడిపల్లి, చెల్పూరు గ్రామాల రైతులకు ఉపయోగకరంగా ఉంటుందని అప్పటి మంత్రి ప్రస్తుత మల్కాజిగిరి ఎంపి ఈటల రాజేందర్ చొరవతో సుమారు రూ.5 కోట్లతో తారు రోడ్డు, రెండు గ్రామాల మధ్య వాగుపై రూ.2 కోట్లతో బ్రిడ్జి నిర్మించినట్లు తెలిపారు. ఈ రోడ్డు మీదుగా ఇల్లందకుంట మండలంలోని శ్రీరాములపల్లి, లక్ష్మాజిపల్లి, కనగర్తి, జమ్మికుంట మంలం మడిపల్లి, అంకుషాపూర్ గ్రామ ప్రజలు హుజురాబాద్, కరీంనగర్ వెళ్లడం ద్వారా సుమారుగా 12 నుంచి 15 కిలోమీటర్ల దూరం తగ్గుతుందని తెలిపారు. మడిపల్లి , చెల్పూరు గ్రామ రైతులకు నిత్యం వ్యవసాయ భూముల కోసం రైల్వే గేటు దాటుతూ ప్రయాణం చేస్తారని, కొందరి స్వార్థం కోసం రైల్వే బ్రిడ్జి తరలకుండా చూసి ఇక్కడే నిర్మాణం అయ్యేలా చొరవ చూపాలని కోరారు.

## జాతీయ గణాంక సర్వే

**ప్రజాపక్షం/జగిత్యాలటౌన్:** జగిత్యాల పట్టణంలో ప్రజల జీవన స్థితిగతులపై జాతీయ గణాంక శాఖ సర్వే చేపడుతున్నట్లు జాతీయ గణాంక శాఖ అధికారి గుర్రం శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. మున్సిపల్ ఉద్యోగులు గుర్రం శ్రీనివాస్‌గౌడ్ జగిత్యాల మున్సిపల్ కమిషనర్ స్పందనకి కలిసి సర్వేకు సంబంధించినటువంటి కరపత్రాలను అందజేయడం జరిగింది. ప్రజలజీవన స్థితిగతులపై జాతీయ గణాంక శాఖ అధికారులు జగిత్యాల పట్టణంలో సర్వే ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేసిన పట్టణాలు గ్రామాలలో ప్రజల ఉపాధి స్థితిగతులపై నిర్వహిస్తున్న సర్వే నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా జాతీయ గణాంక శాఖ అధికారి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ తొలుత సాధారణ వివరాలతో సర్వే చేసిన అనంతరం ప్రత్యేక ట్యాబ్ ద్వారా 12 కుటుంబాలను ఎంపిక చేస్తామన్నారు. ఇందులో కుటుంబ యజమాని పేరు సభ్యుల వివరాలు, విద్యార్హతలు, వృత్తివిద్య కోర్సులు , స్వయం ఉపాధి తదితర అంశాలు నమోదు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ కనకయ్య, జగిత్యాల ఎంపీఎస్‌వో కవిత, మున్సిపల్ వార్డు ఆఫీసర్ మోహన్, మున్సిల్ వార్డు ఆర్పీ లావణ్య, సుమలత, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# యువతకు ఉపాధి కల్పించేందుకే అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లు



ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థను సందర్శించిన కలెక్టర్ హైమావతి



**ప్రజాపక్షం/సిద్దిపేట:** సిద్దిపేట రూరల్ మండలం ఇర్కోడ్ గ్రామశివారులో గల ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థను జిల్లా కలెక్టర్ హైమావతి సందర్శించారు. విద్యార్థులకు అందించే శిక్షణ తరగతులను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. అంతకు ముందు ప్రిన్సిపల్ రామానుజ, ట్రైనింగ్ ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ హైమావతి మాట్లాడుతూ యువతకు ఉపాధి కల్పించేందుకు అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లను ప్రారంభించి కొత్త కోర్సులను తీసుకొచ్చినట్లు తెలిపారు. అన్ని కోర్సుల శిక్షణ తరగతులు, విద్యార్థులకు సరైన పద్దతిలో ఇవ్వాలన్నారు. ప్రతి ఒక్క విద్యార్థికి ఉపాధి కల్పించాలని ఆదేశించారు. అయా డిపార్టుమెంటుల సహకారంతో అడ్మిషన్‌లు అన్నకున్నవిధంగా విద్యార్థులను తీసకొచ్చినట్లు తెలిపారు. ట్రైనింగ్ సైతం అంతే నిబద్ధతతో అందించాలని, విద్యార్థులకు క్రమశిక్షణ నేర్పించాలన్నారు. ఉదయం నేర్చుకున్నది సాయంత్రం మూల్యాంకనం చేయాలన్నారు. విద్యార్థులు రోజు వారి ప్రణాళికలు డైరిలో రాసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఏటిసి కావాల్సిన సామాగ్రిని మౌళిక వసతులు, స్టాఫ్ గురించి అన్ని వివరాలను తయారు చేయాలన్నారు. ట్రైనింగ్ క్లాసులో విద్యార్థులతో ముచ్చటించారు. జీవితంలో ఎవరిమీద ఆధారపడకుండ ఉండాలంటే ఈ ఐటిఐ కేంద్రం మంది వేదిక మంచి అధ్యాపకులు ఉన్నారన్నారు. కోర్సు పూర్తి చేసిన వెంటనే ఉద్యోగాలు వస్తాయని, అర్థికంగా జీవితంలో నిలదొక్కుకోవటానికి మంచి వేదిక అన్నారు. ఇంజినీరింగ్ కళాశాలకు కూడ అన్ని ఆదునూతన సౌకర్యాలు లేవన్నారు. మంచి క్రమశిక్షణతో అధ్యాపకులతో శిక్షణ తరగతులకు హాజరై భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు ఎగదాలని కోరుకుంటున్నాని, విద్యార్థులకు ఆల్‌ది బెస్టు తెలిపారు. విద్యార్థులకు బస్సు సౌకర్యార్థం అందించటంతో పాటు రిక్వెస్టు బస్‌స్టాప్‌ను కల్పిస్తామని హామీనిచ్చారు.

**ఎన్నికల నామినేషన్ ప్రక్రియను పరిశీలన**

2వ సాధరణ ఎన్నికలు 2025 ప్రక్రియలో భాగంగా గురువారం జిల్లా కేంద్రంలో సిద్దిపేట అర్బన్, సిద్దిపేట రూరల్ మండలాలు, కొమురవెల్లి మండల కేంద్రంలో మండల పరిషత్ కార్యాలయంలో మొదటి విడుత జడ్పిటిసి , ఎంపిటిసి నామినేషన్ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ హైమావతి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈసందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లాలో మొదటి విడుత, 15 జడ్పిటిసి, 125 ఎంపిటిసిలు స్థానాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి నామినేషన్ ప్రక్రియ ప్రారంభమైందన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మార్గదర్శకాల ప్రకారం నామినేషన్ అభ్యర్థి కార్యాలయం విచ్చేసిన సమయం మొదటి నామినేషన్ వేసి వెళ్లేవరకు వీడియో గ్రఫీ తప్పనిసరిగా చేయాలన్నారు. నామినేషన్ వేసిన అభ్యర్థితో పాటు ముగ్గుర్ని మాత్రమే అనుమతించాలన్నారు.నామినేషన్ వేసే అభ్యర్థులకు హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఏలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండ గట్టి బందోబస్తును ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు.

## భారతదేశం స్థిరమైన అభివృద్ధి పట్ల అంకితభావంతో ఉంది: ఎంపి



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** భారతదేశ స్థిరమైన అభివృద్ధి పట్ల అంకితభావంతో ముందుకెళ్తుందని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ అన్నారు.భారత పార్లమెంట్ సభ్యుడు, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ న్యూయార్క్‌లో జరుగుతున్న 80వ ఐక్య రాజ్యసమితి సర్వసభ్య సమావేశం లో భారత ప్రతినిధి బృందంలో భాగంగా పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీనియర్ పార్లమెంటరీ నేతల నేతృత్వంలో, భారత శాశ్వత మిషన్ వద్ద వివిధ అంతర్జాతీయ సమావేశాలు, ద్వైపాక్షిక చర్చలు, పాల్గొనడం ద్వారా, ప్రపంచ వేదికపై భారత ప్రజాస్వామ్య విలువలు, సంభాషణ, సమానత్వం, సహకార భావనలను ఆవిష్కరించడం జరిగిందని అన్నారు. కాగా దశాబ్ద కాలం తర్వాత భారత పార్లమెంట్ నుండి మల్టీపార్టీ ప్రతినిధి బృందం ఐక్యరాజ్య సమితి సర్వసభ్య సమావేశాల్లో పాల్గొనడం చారిత్రాత్మక పరిణామమని ,ఇది భారత ప్రజాస్వామ్య బలాన్ని, తెలంగాణ ప్రజల గర్వాన్ని, మరియు పెద్దపల్లి ప్రతినిధి పాత్రను అంతర్జాతీయ వేదికపై చాటిచెప్పిందనీ పలువురు కాంగ్రెస్ శ్రేణులు అన్నారు.

## ఇందిరమ్మ ఇండ్లకు శంకుస్థాపన



**ప్రజాపక్షం/కొత్తపల్లి:** కొత్తపల్లి మండలంలోని రేకుర్తి బుడిగె జంగాల కాలనీలో పలువురు ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇండ్లు ఇస్తామని ఇచ్చిన మాట నిలబెట్టుకోలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం భూమి ఉన్న చివరి లబ్దిదారుని వరకు ఇండ్లు మంజూరు చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో అస్తపురం రమేష్, పర్వతం మల్లేషం, అస్తపురం తిరుమల, మ్యాక శ్రీనివాస్, దుబ్బుల రాజయ్య, లింగంపల్లి లచ్చయ్య, పోచవ్వ, పర్వతం స్వప్న, అంజవ్వ, లక్ష్మి తదితరులున్నారు.

## రాజు కుటుంబాన్ని పరామర్శించిన చాడ వెంకట్‌రెడ్డి



**పజాపక్షం/గన్నేరువరం:** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) కరీంనగర్ జిల్లా కౌన్సిల్ సభ్యుడు న్యాలపట్ల రాజు మాతృమూర్తి న్యాలపట్ల మల్లవ్వ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో గురువారం గన్నేరువరం మండలం గునుకుల కొండాపూర్ గ్రామంలో రాజు నివాసానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను సిపిఐ జాతీయ నేత, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి పరామర్శించారు. మల్లవ్వ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ గునుకుల కొండాపూర్ గ్రామంలో భారత కమ్యూనిస్టు పార్టీ నిర్మాణంలో న్యాలపట్ల మల్లవ్వ పాత్ర ఉందని, గత 40 సంవత్సరాలుగా వారి కుటుంబమంతా సిపిఐకి అండగా ఉంటున్నారన్నారు. తాను ఉమ్మడి కరీంనగర్ జిల్లా సిపిఐ కార్యదర్శిగా, ఇందుర్తి ఎమ్మెల్యేగా పనిచేస్తున్న కాలంలో మల్లవ్వతో వారి కుటుంబ సభ్యులతో సన్నిహిత సంబంధాలున్నాయని పేర్కొన్నారు. మల్లవ్వ చిన్న కుమారుడు రాజు విద్యార్థి యువజన దశ నుంచే అనేక పోరాటాల్లో పాల్గొన్నాడని, ప్రస్తుతం సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడుగా కొనసాగుతున్నాడని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు నిర్వహిస్తున్న క్రమంలో అనేక ఆటుపోట్లను ఎదుర్కొని కేసుల పాలై జైలు జీవితం గడిపాడని, నాడు జనశక్తి వారితో ప్రాణహాని ఉన్నప్పటికీ మల్లవ్వ, వారి కుటుంబం మొక్కవోని ధైర్యంతో ఉన్నారని తెలిపారు. కుమారునికి ప్రాణహాని ఉన్నప్పటికీ మల్లవ్వ ఎంతో ధైర్యంగా ఉండేదని, అలాంటి మల్లవ్వ మృతి చెందడం అత్యంధ బాధాకరమని, వారి మృతిపట్ల తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేస్తూ వారి కుటుంబానికి సానుభూతిని తెలియజేయడంతో పాటు అండగా సిపిఐ ఉంటుందని వెంకటరెడ్డి తెలిపారు. పరామర్శించిన వారిలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కలవేన శంకర్, జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు అందె స్వామి, కసిరెడ్డి మణికంఠరెడ్డి, కరీంనగర్, సిద్దిపేట జిల్లాల సిపిఐ కార్యవర్గ సభ్యులు పోతిరెడ్డి వెంకటరెడ్డి, జాగీరు సత్యనారాయణ, నాగెల్లి లక్ష్మారెడ్డి, కసిరెడ్డి సురేందర్ రెడ్డి, చొక్కల్ల శ్రీశైలం, అంజిరెడ్డి, సదాశివ, సీతారాంపూర్ మాజీ సర్పంచ్ గోలిబాపు రెడ్డి, అంజయ్య తదితరులున్నారు.

## ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఘనంగా చె గువేరా వర్ధంతి



**ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ:** అఖిల భారత యువ జన సమాఖ్య (ఏఐవైఎఫ్) నగర సమితి ఆధ్వర్యంలో విప్లవవీరుడు చేగువేరా 58వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ నగర సమితి అధ్యక్షుడు చెంచల మురళి మాట్లాడుతూ స్వేచ్ఛాయుత ప్రపంచం కోసం పోరాడి ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడి ప్రజా పోరాటాలే శ్వాసగా జీవించిన చేగువేరా నేటి యువతకు ఆదర్శమని కొనియాడారు. యుద్దానికి భయం నేర్పిన వీర యోధుడన్నారు. పోరాటాలకు కొత్త పుంతలు తొక్కించిన ధీరుడని, ప్రాణం అంటే లెక్కచేయని త్యాగధనుడని, సామ్రాజ్యవాదానికి ముచ్చెమటలు పట్టించిన మగధీరుడు అని పేర్కొన్నారు. భయం మొదలైనప్పుడే మనిషి బానిసగా మారుతాడని, భయం లేని వెరుపు లేని దోపిడీ లేని సమసమాజం ప్రపంచవ్యాప్తంగా వెల్లి విరియాలని పోరాడారన్నారు. సమసమాజ స్థాపన లక్ష్యంగా తన ప్రాణాలు త్యాగం చేసిన మహాయోధుడు చేగువేరా అని గుర్తు చేశారు. స్వార్థం లేని సమాజ నిర్మాణం కోసం ఏఐవైఎఫ్ కార్యకర్తలు అంకితం కావాలని, బంగారు తెలంగాణ, భారతదేశం బంగారు దేశంగా నిలబడాలన్నా అందుకు యువతే ముఖ్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో శ్రావణ్, ఆదిత్య, రమేష్‌రెడ్డి, స్పందన, అలేఖ్య, ఉమారాణి తదితరులున్నారు.

## రాజకీయ జీవితంలో కాంగ్రెస్ కార్యకర్తలే నా బలం



**ప్రజాపక్షం/జగిత్యాల:** తాన సుదీర్ఘ రాజకీయ జీవితంలో కాంగ్రెస్ కార్యకర్తల బలమే తాన బలమని మాజీ మంత్రివర్యులు తాటిపర్తి జీవన్‌రెడ్డి అన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని దేవిశ్రీ గార్డెన్‌లో స్థానిక సంస్థల సంయుక్త సమావేశంలో మాజీ మంత్రి జీవన్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి మాట్లాడుతూ ఎంపీటిసి జడ్పీటిసి స్థానిక సంస్థల ఎన్నికలలో రిజర్వేషన్ ప్రకారం ఎవరైతే పోటీ చేయాలకునే అభ్యర్థులు వారి యొక్క నామినేషన్ ప్రక్రియలో కుల ధ్రువీకరణ పత్రం తప్పకుండా నమోదు చేయాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం మేరకు జడ్పీటిసి స్థానాలకు ప్రతి మండలం నుంచి ముగ్గురి పేర్లను కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి ప్రతిపాదించడం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ ఐ కామాండ్ నుండి బీ ఫామ్ ఏ అభ్యర్థికి అయితే వస్తుదో వారు అధికారికంగా కాంగ్రెస్ పార్టీ నుండి అభ్యర్థిగా ఎన్నికలలో నిలిచి ఉంటారని, ఎవరైతే ఎంపీటిసి ఆశావాహుల అభ్యర్తులు ఉన్నారో ఏకాభిప్రాయానికి వచ్చి నిల్చునే అభ్యర్థిని బలపరుచాలని, రాజకీయ పార్టీల్లోలైన క్షేత్ర స్థాయిలో కార్యకర్తలు బలంగా ఉంటేనే ఆ పార్టీ బలంగా ఉంటుందన్నారు. తాన నాలుగు దశాబ్దాల రాజకీయ జీవితంలో తాను రాజకీయంగా బలంగా ఉండటానికి కారణం క్షేత్రస్థాయిలో తాన కోసం కష్టపడుతున్న తాన పార్టీ కార్యకర్తలు మాత్రమేనని, గతంలో టీడిపి బీఆర్ఎస్ ప్రభుత్వాలు ఉన్నప్పుడు కూడా జగిత్యాల నియోజకవర్గంలో మండల పరిషత్, జిల్లా పరిషత్ కూడా కార్యకర్తల సూచన మేరకు జరుగుతుందన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలలో అభ్యర్థులను ఎంపిక చేసుకోవడం , గెలిపించుకోవడం కార్యకర్తల బాధ్యత అని, కాంగ్రెస్ సంబంధం లేని వారు కాంగ్రెస్ సభ్యత్వం లేని వారు బి ఫామ్ తామకే వస్తాయని చెప్పుకుంటూ తిరుగుతన్నారని, కాంగ్రెస్ బీ ఫామ్ అడగడానికి వారు ఎవరని అన్నారు. తాన రాజకీయ జీవితంలో ఏ నిర్ణయం తీసుకొన్న కూడా కార్యకర్తల సూచనల మేరకు నిర్ణయం తీసుకున్నారని, కాంగ్రెస్ కార్యకర్తల హక్కులు నిలబెట్టడమే తాన బాధ్యత అన్నారు. తాన ప్రజా జీవితంలో తానకు ఎలాగైతే ఇన్ని రోజులు మీరు అండగా నిలిచారో మీకు అండగా నిలవాల్సిన బాధ్యత తానపై ఉందని, 100కు 100శాతం మన సూచనలకు అభిప్రాయాలకు అనుగుణంగానే నిర్ణయాలని ఉంటాయని తెలిపారు.

## 26వ డివిజన్‌లో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాలి

సిపిఐ నగర కార్యదర్శి కామ్రేడ్ కె.కనకరాజ్

**ప్రజాపక్షం/పెద్దపల్లి:** రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మార్కండేయ కాలనీ పాత 26వ డివిజన్ లోని అధికారుల నిర్లక్ష్యం వలన పిచ్చి మొక్కలు,గడ్డి ఏపుగా పెరిగి ఈగలు, దోమలు అధికమై ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని సిపిఐ నగర కార్యదర్శి కామ్రేడ్ కె కనకరాజ్ ఒక ప్రకటనలో తెలిపారు.వర్షాకాలం ప్రారంభమైనప్పటినుండి పారిశుధ్యాన్ని మెరుగు పరచక పోవడం సంబంధిత అధికారుల నిర్లక్ష్యానికి నిలువుటద్దంలా మారిందని ఆరోపించారు. డివిజన్ లోనీ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, ఓపెన్ డ్రైనేజీ లలో మురుగునీరు నిలువ ఉండి రోడ్లపై పారడం వల్ల దోమలు, ఈగలు వ్యాప్తి చెంది ప్రజలు రోగాల బారిన పడుతున్నారని అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని అన్నారు.ఓపెన్ డ్రైనేజీ మరియు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ లలో మురుగు ను ఎప్పటికప్పుడు పారిశుధ్య సిబ్బంది శుభ్రం చేసే విధంగా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. అదేవిధంగా రోడ్ల పై వర్షపు నీరు నిలిచి ఉండడం వల్ల కూడా మురుగు వాసన వస్తుందని తెలిపారు. దోమల నివారణ కోసం గతంలో వీధుల్లో ఫాంగిన్గ్ చేసేవారని ప్రస్తుతం ఎలాంటి పారిశుధ్య చర్యలు చేపట్టడం లేదని ఆరోపించారు. పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆయన సంబంధిత పై అధికారులను కోరారు.

## తపాలా కార్యాలయాన్ని సందర్శించిన 'ఆల్ఫోర్స్' విద్యార్థులు



**ప్రజాపక్షం/కరీంనగర్ :** తపాల సేవలు ప్రపంచ వ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందాయని, ఈ సేవల ద్వారా ఎన్నో అవసరాలు తీరుతాయని చెప్పడంలో ఎటువంటి సందేహం లేదని ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా. వి. నరేందర్ రెడ్డి అన్నారు. కొత్తపల్లి లోని ఆల్ఫోర్స్ ఈ టెక్నో పాఠశాలలో వేడుకగా నిర్వహించినటువంటి ప్రపంచ తపాల దినోత్సవం వేడుకలకు ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంతో పురాతన కాలం నుండి తపాల సేవలు కొనసాగుతున్నాయని చాలా మందికి అనేక లాభాలు జరుగుతున్నాయని అన్నారు. ఈ సేవల ద్వారా ఎన్నో అవసరాలు తీరుతున్నాయని చెప్పడంలో ఎటువంటి సంశయం లేదని వారు చెప్పారు. ప్రపంచాన్ని సామాజిక ఆర్థిక అభివృద్ధి పాత్రలో గొప్పగా వ్యవహరిస్తుందని, ప్రజలకు వారి జీవితంలో తపాల సేవలో అందించే సేవలను చక్కగా తెలియజేశారు. ప్రపంచ వ్యాప్తంగా జరుపుకునేటువంటి ఈ వేడుక ద్వారా ప్రతి ఒక్కరు తపాల ఉద్యోగులను గౌరవించి వారు అనుసరిస్తున్న విధానాన్ని గౌరవించాలని వారు కోరారు. అనంతరం కొత్తపల్లిలోని తపాల కార్యాలయాన్ని సందర్శించి, సబ్ పోస్ట్ మాస్టర్ సంపత్ కుమార్‌కి పర్యవేక్షకులకు, పోస్టల్ సిబ్బందికి జ్ఞాపికలను ప్రధానం చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సాంఘీక శాస్త్ర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## నామినేషన్లు వేసేందుకు ముందుకు రాని అభ్యర్థులు




**ప్రజాపక్షం/జమ్మికుంట:** జమ్మికుంట ఎంపిడివో కార్యాలయంలో జడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికల నామినేషన్ల స్వీకరణ కోసం గురువారం అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభమై ఐదు గంటల వరకు ఎన్నికల నామినేషన్ల స్వీకరణకు గడువు విధించి ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. కాగా కోర్టు తీర్పు కోసం వేచి చూసిన అభ్యర్థులు నామినేషన్లు వేసేందుకు ముందుకు రాలేదు. 5 గంటల వరకు వేచి చూసినప్పటికీ నామినేషన్లు వేయలేదని ఎంపిడివో విజయ్ కుమార్ తెలిపారు. ఉన్నతాధికారులు తెలిపే వరకు ఎన్నికల ప్రక్రియ ఉంటుందో లేదో చెప్పలేమని పేర్కొన్నారు. ఎన్నికల సంధర్భంగా జమ్మికుంట సిఐ రామకృష్ణ గౌడ్, ఎస్సై సతీష్ బందోబస్తు నిర్వహించారు.






# పుణేలో 'పెద్ది' కోసం స్టెప్పులేస్తున్న రామ్, జాన్వీ

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న యాక్షన్ డ్రామా 'పెద్ది'. ఈ సినిమా చిత్రీకరణ శర వేగంగా జరుగుతోంది. బుచ్చి బాబు సనా దర్శకత్వంలో వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పిస్తున్నారు. ఈ చిత్రం భారీ స్థాయిలో చిత్రీకరణ జరుపుకుంటోంది.పూణేలో జరిగే షెడ్యూల్‌లో రామ్ చరణ్, హీరోయిన్ జాన్వీ కపూర్‌పై పాటను చిత్రీకరించనున్నారు. అకాడమీ అవార్డు విన్నర్ రెహమాన్ అదిరిపోయే సాంగ్‌ని కంపోజ్ చేశారు. ఈ సాంగ్‌కి స్టార్ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ కొరియోగ్రఫీ చేస్తున్నారు. సినిమా పోస్ట్‌ప్రొడక్షన్ పనులు కూడా కొనసాగుతున్నాయి. షెడ్యూల్ ప్రకారం సినిమా పూర్తయ్యేలా టీమ్ పనిచేస్తోంది.రామ్ చరణ్ తన పాత్ర కోసం కంప్లీట్ గా మేకోవర్ అయ్యారు. కన్నడ సూపర్ స్టార్ శివ రాజ్ కుమార్ పవర్ ఫుల్ పాత్రలో నటిస్తున్నారు, జగపతి బాబు, దివ్యేందు శర్మ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఆర్ రత్నవేలు సినిమాటోగ్రఫీని నిర్వహిస్తున్నారు, జాతీయ అవార్డు గ్రహీత నవీన్ నూలి ఎడిటర్. గా పని చేస్తున్నారు. రామ్ చరణ్ పుట్టిన రోజు సందర్భంగా మార్చి 27, 2026న పెద్ది పాన్ఇండియా థియేట్రికల్ విడుదలకు సిద్ధమవుతోంది.

# పూరి సినిమాకు హర్షవర్ధన్ సంగీతం



తమిళ నటుడు విజయ్ సేతుపతి కథానాయకుడిగా పూరి జగన్నాథ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న సినిమాకు జాతీయ అవార్డు గ్రహీత హర్షవర్ధన్ రామేశ్వర్ సంగీతం అందిస్తున్నారు. ఈ విషయాన్ని పూరి జగన్నాథ్ వెల్లడించారు. సందీప్ రెడ్డి వంగా రూపొందించిన యానిమల్ సినిమాకు బ్యాక్ గ్రౌండ సంగీతం అందించినందుకు గాను హర్షవర్ధన్ రామేశ్వర్ జాతీయ అవార్డు అందుకున్నారు. ఇప్పుడు పూరి జగన్నాథ్ సినిమాకు ఆయన సంగీతం అందిస్తున్నారు. ఈ సినిమాలో విజయ్ సేతుపతి సరసన సంయుక్త హీరోయిన్ గా నటిస్తోంది. బాలీవుడ్ నటి టాబు మరో ముఖ్యమైన పాత్రను పోషిస్తోంది. తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో రూపుదిద్దుకుంటున్న ఈ సినిమాను హీరోయిన్ ఛార్మి సమర్పిస్తున్నారు. జె బీ నారాయణరావు కొందరొల్ల ఈ సినిమాకు నిర్మాతగా వ్యవహరిస్తున్నారు.

# బైసన్ చిత్రం ఫస్ట్ సింగిల్ రిలీజ్



నీలం స్టూడియోస్, అప్లాజ్ ఎన్‌టర్‌టైన్మెంట్ నిర్మాణంలో, ప్రముఖ దర్శకుడు పారంజిత్ సమర్పణలో మారి సెల్వరాజ్ దర్శకుడుగా ధృవ్ విక్రమ్ హీరోగా నటిస్తున్న చిత్రం బైసన్.ఈ చిత్రాన్ని అక్టోబర్ 24న జగదంబే ఫిలిమ్స్ ప్రొడ్యూసర్ బాలాజీ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో గ్రాండ్ రిలీజ్ చేస్తున్నారు.ఈ సందర్భంగా జగదాంబే ఫిలిమ్స్ ప్రొడ్యూసర్ బాలాజీ మాట్లాడుతూ..'ఈ చిత్రాన్ని తెలుగులో విడుదల చేయడం చాలా ఆనందంగా ఉంది. ధృవ్ తనదైన పర్ఫామెన్స్ తో తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకుంటారు. ఒక డిఫరెంట్ కాన్సెప్ట్ తో ప్రేక్షకులకు ముందుకు రాబోతున్న ఈ సినిమా తెలుగులో మంచి విజయాన్ని అందుకుంటుందని భావిస్తున్నాం. నాకు తెలుగులో విడుదల చేసే అవకాశాన్నిచ్చిన నీలం స్టూడియోస్, అప్లాజ్ ఎంటర్టైన్మెంట్ సంస్థలకు ధన్యవాదాలు' అని అన్నారు. తాజాగా ఈ చిత్రం నుంచి మొదటి పాటను విడుదల చేశారు. నివాస్ కే ప్రసన్న కంపోజ్ చేసిన ఈ పాటకు దర్శకుడు మారి సెల్వరాజ్ తమిళంలో లిరిక్స్ రాయగా, ఎనమంద్రా రామకృష్ణ తెలుగు లిరిక్స్ అందించారు. మనువర్ధన్ పాటను పాడారు. తీరేనా తీరేనా.. గుండెల్లోన మండుతున్న మూగవేదన..' అంటూ సాగిన పాట సినిమాపై క్యూరియాసిటీని క్రియేట్ చేసింది. ఇందులో ధృవ్ ఇంటెన్స్ లుక్ లో కనిపిస్తున్నారు.

# ఘనంగా 'అరి' ప్రీ రిలీజ్ వేడుక



ఆర్వీ సినిమాస్ పతాకంపై రామిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి ( ఆర్ వీ రెడ్డి ) సమర్పణలో శ్రీనివాస్ రామిరెడ్డి, డి, శేషురెడ్డి మారంరెడ్డి, డా. తిమ్మప్ప నాయుడు పురిమెట్ల, బీరం సుధాకర్ రెడ్డి నిర్మిస్తున్న సినిమా 'అరి'. లింగ గుణపనేని కో ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రానికి 'మై నేమ్ ఈజ్ నో బడీ' అనేది ఉపశీర్షిక. వినోద్ వర్మ, అనసూయ భరద్వాజ్, సాయి కుమార్, శ్రీకాంత్ అయ్యంగార్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. 'పేపర్ బాయ్' చిత్రంతో ప్రతిభావంతమైన దర్శకుడుగా పేరు తెచ్చుకున్న జయశంకర్ దర్శకత్వంలో ఈ సినిమా రూపొందుతోంది. 'అరి' సినిమా ఏషియన్ సురేష్ డిస్ట్రిబ్యూషన్ ద్వారా ఈ నెల 10వ తేదీన వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రాబోతోంది. హైదరాబాద్‌లో ఈ చిత్ర ప్రీ రిలీజ్ ఈవెంట్ పలువురు రాష్ట్ర మంత్రులు, సినీ, రాజకీయ ప్రముఖులు అతిథులుగా ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో నిర్మాత తిమ్మప్ప నాయుడు పురిమెట్ల మాట్లాడుతూ అరిషడ్వర్గాల నేపథ్యంగా అన్ని కమర్షియల్ ఎలిమెంట్స్ జోడించి మా దర్శకుడు జయశంకర్ 'అరి' సినిమాను రూపొందించాడు. కథ విన్నప్పుడే ఈ మూవీ అందరినీ ఆకట్టుకుంటుందనే నమ్మకం కలిగింది అన్నారు. ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ మాట్లాడుతూ 'అరి' లాంటి చిత్రాన్ని మనమంతా సపోర్ట్ చేయాలి. మంచి కాన్సెప్ట్‌తో దర్శకుడు జయశంకర్ ఈ చిత్రాన్ని రూపొందించారు. ఈ సినిమా ఈవెంట్‌కు వెంకయ్యనాయుడు, చినజీయర్ స్వామి లాంటి పెద్దలు వస్తే ఇంకా బాగుండేది. నేను హీరోగా నటించిన ఇండియన్ ఫైల్స్ అనే సినిమాను మన భారత చరిత్ర ఆధారంగా తెరకెక్కించాం. ప్రేక్షకులు 'అరి' సినిమాను ఆదరించి వారి ప్రయత్నాన్ని సక్సెస్ చేయాలని కోరుకుంటున్నా. అన్నారు.శ్రీ శ్రీశ్రీ త్రిదండి అహోబిల రామానుజ జీయర్ స్వామి మాట్లాడుతూ అరిషడ్వర్గాల వల్ల కలిగే ఉద్రేకాల వల్లే మనిషి చెడిపోతాడు. అలాంటి అరిషడ్వర్గాల ఆధారంగా జయశంకర్ సినిమా రూపొందించడం అభినందనీయం. ఇది సమాజానికి మంచి చేస్తుంది కాబట్టే సినిమా కార్యక్రమానికి వచ్చాం. అరి సినిమా చూడండి ఆ హరికి దగ్గరవ్వండి. అన్నారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి, ఎమ్మెల్యే వెంకటరమణ రెడ్డి, తెలంగాణ స్టేట్ ప్లానింగ్ బోర్డ్ వైస్ ఛైర్మన్ జి.చిన్నారెడ్డి, కార్మిక శాఖా మంత్రి జి. వివేక్, నిర్మాత ప్రసన్నకుమార్,నిర్మాత దామోదరప్రసాద్, నటుడు వినోద్ వర్మ నిర్మాత శ్రీనివాస్ రామిరెడ్డి, నటి అనసూయ మ్యూజిక్ డైరెక్టర్ అనూప్ రూబెన్స్, డైరెక్టర్ జయ శంకర్, యాక్టర్ సాయికుమార్ పాల్గొన్నారు.



# మన హద్దుల్లో మనం ఉంటే ఏమి కాదు

ప్రియదర్శి, నిహారిక ఎన్‌ఎం జంటగా విజయేందర్ దర్శకుడిగా బీవీ వరక్స్ బ్యానర్ మీద బన్నీ వాస్ సమర్పణలో కళ్యాణ్ మంథిన, భాను ప్రతాప, డా. విజేందర్ రెడ్డి తీగల నిర్మించిన చిత్రం 'మిత్ర మండలి'. ఈ మూవీ అక్టోబర్ 16న రిలీజ్ కాబోతోంది. ఈ నేపథ్యంలో హీరోయిన్ నిహారిక ఎన్ ఎం మీడియాతో చిట్ చాట్ చేశారు. నేను ముందుగా ఈ 'మిత్ర మండలి' కథనే విన్నాను. కానీ 'పెరుసు' తమిళ చిత్రం ముందుగా రిలీజ్ అయింది. 'మిత్ర మండలి'లో ఉండే భారీ క్యాస్టింగ్ వల్ల అందరి డేట్స్ అడ్జస్ట్ అవ్వడానికి చాలా టైం పట్టింది. మొత్తానికి అక్టోబర్ 16న మా చిత్రం ఆడియెన్స్ ముందుకు రాబోతోంది.మిత్ర మండలి' చిత్రంలో నేను ఓ సాఫ్ట్ పాత్రను పోషించాను. ఇందులో నా పాత్ర చాలా కొత్తగా ఉంటుంది. ఇన్ ఫ్లూయెన్సర్‌గా నాకు చాలా కంఫర్ట్ ఉంటుంది. సినిమాల్లో నటించడం చాలా కొత్తగా, ఆనందంగా ఉంది.ప్రియదర్శి చాలా మంచి వ్యక్తి. అద్భుతమైన నటుడు. 'మిత్ర మండలి' షూటింగ్‌లో ఉండగానే ప్రియదర్శి నటించిన 'కోర్ట్' చిత్రం పెద్ద హిట్ అయింది. ప్రియదర్శి ఎంత సక్సెస్ అయినా కూడా ఒదిగి ఉంటారు.నాకు అన్ని కూడా కామెడీ బేస్డ్ చిత్రాలే వస్తున్నాయి. అందుకే డిఫరెంట్ సబ్జెక్ట్‌లను ఎంచుకోవాలని చూస్తున్నాను. కామెడీ ప్రధాన చిత్రాలే అంటే నేను నా ఇన్ స్టాగ్రాంలో రీల్స్ చేసుకుంటాను కదా . నేను పరాజయాలకు ఇట్టే కృంగిపోతాను. ఫెయిల్యూర్స్ వస్తే చాలా బాధపడతాను. అయితే వెంటనే దాన్నుంచి బయటకు వచ్చేస్తాను. ఇండస్ట్రీలో ఒక్కొక్కరికి ఒక్కో రకమైన అనుభవం ఎదురవుతుంది. బయట ప్రపంచంలో ఇండస్ట్రీ గురించి మాత్రం రకరకాలుగా మాట్లాడుకుంటూ ఉంటారు. మన హద్దుల్లో మనం ఉంటే ఏమీ కాదు. తెరపై నన్ను మా ఫ్యామిలీ హాయిగా చూసుకునేలా ఉండాలి. నా సీన్ వస్తుంటే వాళ్లు కళ్లు మూసుకునేలా ఉండకూడదు.మిత్ర మండలి' చిత్రంలో కథ, కథనం చాలా కొత్తగా ఉంటుంది. అందరినీ నవ్వించేలా మా చిత్రం ఉంటుంది. థియేటర్‌కు వచ్చిన ప్రతీ ఒక్కరినీ హాయిగా నవ్వించేస్తుంది. తెలుగు చిత్ర సీమ నన్ను ఎంతో సాదరంగా ఆహ్వానించింది. దర్శక, నిర్మాతలు నన్ను సొంత ఫ్యామిలీలా చూసుకున్నారు. టాలీవుడ్‌లో దొరికినంత ప్రేమ, కంఫర్ట్ నాకు ఇంకెక్కడా దొరకలేదు.

# పైరసీని ఎంకరేజ్ చేయకండి


ప్రదీప్ రంగనాథన్

వరుస బ్లాక్‌బస్టర్ విజయాలతో దూసుకుపోతున్న యంగ్ సెన్సేషన్ ప్రదీప్ రంగనాథన్ పాన్ ఇండియా మూవీ డ్యూడ్‌తో అలరించడానికి రెడీ అవుతున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ నిర్మించిన ఈ చిత్రంతో కీర్తిశ్వరన్ డైరెక్టర్ గా పరిచయం అవుతున్నారు. 'ప్రేమలు'అద్భుతమైన విజయం తర్వాత ప్రదీప్ సరసన మమిత బైజు నటించగా, శరత్ కుమార్ కీలక పాత్ర పోషించారు. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా సాంగ్స్ చార్ట్ బస్టర్ హిట్ అయ్యాయి. డ్యూడ అక్టోబర్ 17న దీపావళి సందర్భంగా, తెలుగు, తమిళం, హిందీ, మలయాళం, కన్నడ భాషల్లో గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ సందర్భంగా తిరుపతిలో ప్రెస్ మీట్ నిర్వహించారు. ప్రెస్ మీట్ లో హీరో ప్రదీ ప్ రంగనాథన్ మాట్లాడుతూ. డ్యూడ్ కంప్లీట్ ఫ్యామిలీ ఎంటర్టైనర్. చాలా రిలేటబుల్ క్యారెక్టర్. మైత్రి మూవీ మేకర్స్‌తో కలిసి పని చేయ డం హ్యాపీగా ప్రౌడ్‌గా ఉంది. డైరెక్టర్‌ఈ కథ చెప్తున్నప్పుడే తనలోని కాన్ఫిడెన్స్ కన్విక్షన్ చాలా నచ్చింది. తిరుపతి నుంచి ప్రమోషన్స్ స్టార్ట్ చేయ డం అనేది ఒక ఆశీర్వాదంగా భావిస్తున్నాను. తిరుపతిలో ఒక పాజిటివ్ వైబ్ ఉంటుంది. సినిమా మీద చాలామంది జీవితాలు ఆధారపడి ఉంటాయి. దయచేసి పైరసీని ఎవరూ కూడా ఎంకరేజ్ చేయకూడదని కోరుకుంటున్నాను. డ్యూడ సినిమా చాలా అద్భుతంగా వచ్చింది. అందరూ థియేటర్స్ లో చూసి ఎంజాయ్ చేస్తారని కోరుకుంటున్నాను.



























Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com